
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా,
ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 76

బుధవారం 7-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సేవా జ్యోతి

నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న బాన్సువాడ హెడ్ నర్స్
-11లో



లక్ష కోట్ల డాలర్లకు

ఇంటర్నెట్ ఎకానమీ 2030కి ఆరింతలు పెరుగుతుందని అంచనా
-13లో



ఖలిస్తాన్ స్థావరాల్లో ఎన్ఐఏ..

పంజాబ్, హరియాణాలోని ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ ఉగ్రవాద సంస్థ స్థావరాల్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు.
వివరాలు 6లో ▸



మణిపూర్‌లో కాల్పుల కలకలం

మణిపూర్‌లో బీఎస్ఎఫ్ జవాన్లు, అస్సాం రైఫిల్స్ బలగాల శిబిరంపై కుకీ ఉగ్రవాదుల కాల్పుల్లో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు.
వివరాలు 6లో ▸



కొడుకును బతికించుకున్నాడు

బాలాసోర్ ఘటనలో ఓ యువకుడిని చని పోయినట్లుగా భావించి, మార్చురీలో ఉంచగా, తండ్రి కృషితో తిరిగి స్పృహలోకి వచ్చాడు.
వివరాలు 6లో ▸



డ్యామ్‌పై రష్యా దాడి

ఉక్రెయిన్‌లోని కఖోవ్కా డ్యామ్‌పై బాంబుల వర్షం కురవడంతో డ్యామ్ గేట్లు, గోడ దెబ్బ తిని పెద్దఎత్తున నీరు దిగువకు ప్రవహిస్తోంది.
వివరాలు 6లో ▸


న్యూస్‌రీల్

ఆర్టీసీకి లక్కీ మండే



ఆర్టీసీకి సోమవారం రద్దీ కలిసొస్తోంది. గత నెల 15న సోమవారం రోజు రికార్డు స్థాయిలో రూ.20.26 కోట్ల ఆదాయాన్ని సాధించిన ఆర్టీసీ, తాజాగా ఈ సోమవారం దాన్ని బ్రేక్ చేస్తూ రూ.20.36 కోట్లను పొందింది.
- వివరాలు 2లో▶

రోజూ స్కూళ్లలో యోగా, ధ్యానం



స్కూళ్లకు సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. ప్రతి పాఠశాలలోనూ రోజూ 5 నిమిషాల పాటు యోగా, మెడిటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది.
- వివరాలు 14లో▶

ఐటీలో పోటాపోటీ!



తెలంగాణ ఏర్పడేనాటికి రూ.57 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు 2022–23 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేరాయి. ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో అగ్రస్థానంలో ఉన్న కర్ణాటక, మహారాష్ట్రతో తెలంగాణ పోటీ పడుతున్నట్టయింది.
- వివరాలు 3లో▶

సింగరేణి @ 4వేల మెగావాట్లు!



సింగరేణి బొగ్గు గనుల సంస్థ విద్యుదుత్పత్తి రంగంలో తెలంగాణ జెన్‌కో, ఎన్టీపీసీలకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది. కొత్త విద్యుత్ కేంద్రాల స్థాపన ద్వారా తమ థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 4000 మెగావాట్లకు పెంచుకోవాలని నిర్ణయం తీసుకుంది.
- వివరాలు 14లో▶

మంగళవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన ప్రగతి నివేదన సభకు హాజరైన ప్రజలు



ధరణితో.. రైతే రాజు

రైతు బొటన వేలుకే రికార్డులు మార్చే అధికారం: సీఎం కేసీఆర్

- ధరణి తీసేస్తే మళ్లీ చిట్టీలు పట్టుకుని సేట్ల చుట్టూ తిరగాల్సిందే
- మన బతుకులు మళ్లీ వీఆర్వోలు, గిర్దావరీల చేతుల్లోకే వెళ్తాయి..
- ధరణి మూలంగానే రైతుబంధు, ఎక్స్‌గ్రేషియా, పంటలకు డబ్బులు
- నూటికి 99 శాతం భూ సమస్యలు కూడా పరిష్కారం అయ్యాయి
- కాంగ్రెస్ నేతలకు ఇవన్నీ ఇష్టం లేదు..వారి రాజ్యంలో దళారులదే భోజ్యం
- 'పాలమూరు' పూర్తి చేస్తాం.. ఆగస్టులోనే అన్ని రిజర్వాయర్లు నింపుతాం
- నాగర్‌కర్నూల్ ప్రగతి నివేదన సభలో ముఖ్యమంత్రి

2లో



నేతలు బహూకరించిన నాగలితో ముఖ్యమంత్రి కేసీఆర్

నిధులు మళ్లించాం... కానీ ఎక్కడికో తెలియదు

సీఐడీ విచారణలో మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

- విచారణకు సహకరించకుండా మొండికేసిన శైలజ
- కాసేపు జ్వరం, కళ్లు తిరిగాయని, విదేశాల నుంచి వచ్చానని సాకులు
- చిట్టీల మొత్తం చెల్లించలేకపోవడంపై మౌనమే సమాధానం.. శైలజను మరోసారి విచారించాలని సీఐడీ నిర్ణయం



సాక్షి, అమరావతి

తమ చందాదారుల నుంచి ఎంత మొత్తం వసూలు చేశారో తెలియదు!
బ్రాంచీలు, ప్రధాన కార్యాలయంలో ఉన్న నిధులెన్నో తెలియదు!
మిగిలిన నిధులను ఎక్కడికి మళ్లించారో కూడా తెలియదు!
కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం గురించి ఏమాత్రం తెలియదు!
అసలు నాకేమీ తెలియదు.. తెలియదు.. తెలియదు!!
సీఐడీ విచారణలో మార్గదర్శిచిట్‌ఫండ్స్ ఎండీ శైలజా కిరణ్ తీరు ఇదీ!

మార్గదర్శి చిట్ ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–2గా ఉన్న సంస్థ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్‌ను సీఐడీ అధికారులు మంగళవారం హైదరాబాద్‌లో మరోసారి విచారించారు. సీఐడీ ఎస్పీలు అమిత్ బర్దర్, హర్షవర్ధన్‌రాజు, విచారణ అధికారి రవికుమార్‌తోపాటు 30 మందితో కూడిన సీఐడీ అధికారుల బృందం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసానికి ఉదయం 10 గంటలకు చేరుకోగా దాదాపు అరగంటపాటు గేటు తాళం తీయలేదు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సీఐడీ విచారణ కొనసాగింది. 'మీరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ కదా? మీ పేరిటే చెక్ పవర్ కూడా ఉంది. నిధుల మళ్లింపుపై ఆధారాలు ఇవిగో..! మరి వీటిపై ఏమంటారు..?' అని సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించడంతో 'నాకు ఆరోగ్యం బాగా లేదు! నేను సమాధానాలు చెప్పలేకపోతున్నా.. ఇబ్బంది పెట్టొద్దు..' అంటూ శైలజా కిరణ్ తప్పించుకునేందుకు యత్నించారు.

విచారణకు సహకరించకుండా..

తనకు ఆరోగ్యం బాగా లేదని, విదేశాల నుంచి రావడంతో జ్వరం వచ్చిందంటూ శైలజా కిరణ్ విచారణకు సహకరించకుండా
మిగతా 2వ పేజీలో ▶

దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్క్‌లో టాయ్స్ పార్క్ శంకుస్థాపన సందర్భంగా బొమ్మ తుపాకీతో మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు



దేశానికే తెలంగాణ పాఠాలు

రాష్ట్ర మంత్రి కేటీఆర్

- 30 శాతం జాతీయ పంచాయతీ అవార్డులు రాష్ట్రాభివృద్ధికి నిదర్శనం
- టీఎస్ ఐపాస్ లాంటిది అమెరికాలో కూడా లేదు..
- దండుమల్కాపురం ఇండస్ట్రియల్ పార్కులో పారిశ్రామిక ప్రగతి ఉత్సవం


చౌటుప్పల్: ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే అన్ని రంగాల్లో అంధకారం అలుముకుంటుందని ఎంతోమంది అవహేళన చేశారని, కానీ తెలంగాణ నేడు భారతదేశానికే పాఠాలు నేర్పే స్థాయికి ఎదిగిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. విభజన జరిగితే పరిశ్రమలు తరలిపోతాయి, పెట్టుబడులు ఆగిపోతాయన్న వ్యక్తులు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని ఆయన ప్రశ్నించారు. దేశ జనాభాలో 3 శాతం కంటే తక్కువ కలిగిన తెలంగాణ రాష్ట్రం 30 శాతం జాతీయ పంచాయతీ అవార్డులను కైవసం చేసుకోవడం అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. పట్టణాలకు సంబంధించి 26 స్వచ్ఛ సర్వేక్షణ్
మిగతా 3వ పేజీలో ▶

దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్
- వివరాలు 3లో▶

మండిపోయిన మంగళవారం

- 46 డిగ్రీలకు సమీపంలో ఉష్ణోగ్రతలు.. మహదేవపూర్‌లో 45.7 డిగ్రీల నమోదు
- వచ్చే 5 రోజులు వడగాడ్పుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మంగళవారం ఒకట్రెండు చోట్ల 46 డిగ్రీలకు సమీపంలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో ఏకంగా 45.7 డిగ్రీల సెల్సియస్ పగటి ఉష్ణోగ్రత నమోదైంది. కొమురంభీం జిల్లా జంబుగలో 45.4 డిగ్రీలు నమోదైంది. రాగల ఐదు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం నుంచి
మిగతా 2వ పేజీలో ▶



15న ఖమ్మం సభకు అమిత్‌షా



25న నాగర్‌కర్నూల్ సభకు జేపీ నడ్డా



నెలాఖరులో నల్లగొండలో ప్రధాని మోదీ సభ?



రాష్ట్రానికి అగ్ర త్రయం!

పక్షం రోజుల్లోనే బీజేపీ నేతలు మోదీ, అమిత్‌షా, నడ్డా రాక

వారి ప్రచారంతో మళ్లీ గాడిలో పడతామన్న అంచనాల్లో నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మరోసారి బీజేపీ అగ్రనాయక త్రయం పర్యటించనుంది. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో బహిరంగ సభలతో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ముగ్గురు అగ్రనేతలు శంఖం పూరిస్తారని భావిస్తున్నారు. పదిహేను రోజుల వ్యవధిలోనే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో వీరి పర్యటనలు జరగనుండటం విశేషం. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 9 ఏళ్లలో సాధించిన విజయాలను చాటడంతోపాటు ప్రజలను స్వయంగా కలుసుకునేందుకు ఉద్దేశించిన 'మహా జనసంపర్క్ అభియాన్'లో భాగంగా రాష్ట్రంలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులోభాగంగా ఈ నెల 15న ఖమ్మంలో నిర్వహించనున్న సభలో అమిత్‌షా ప్రసంగించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ బలహీనంగా ఉందనే భావనను అమిత్ షా భారీ బహిరంగ సభతో తిప్పికొట్టాలనే వ్యూహంతో రాష్ట్ర నాయకత్వముంది. అదేవిధంగా 25న నాగర్‌కర్నూల్
మిగతా 3వ పేజీలో ▶

'సెమీఫైనల్' వ్యూహాలకు పదును!

- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలపై నడ్డా, అమిత్‌షా, బీఎల్ సంతోష్ కీలక భేటీ

'రివర్స్ గేర్'పై కమలం పీచేముడ్

- కేసీఆర్ 9ఏళ్ల పాలనా వైఫల్యాలపై రివర్స్ అటాక్ కార్యక్రమాలకు నో చెప్పిన హైకమాండ్

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



... ఇప్పుడు మీరు చేస్తున్నదీ అదేగా!!

త్వరలో ఢిల్లీకి టీపీసీసీ నేతలు

- రాహుల్ అమెరికా నుంచి రాగానే ఆయనతో పాటు ప్రియాంకతో భేటీ?
- గత నెల 26న జరగాల్సిన సమావేశం వాయిదా
- పీఏసీ సభ్యులతో ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించనున్న అగ్రనేతలు.. పార్టీలో చేరికలు, తెలంగాణలో బహిరంగసభలపై రానున్న స్పష్టత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ నేతలు త్వరలోనే ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో నెలకొన్న వాతావరణం, పార్టీలోకి చేరికలు, ఈ నెలలోనే నిర్వహించాల్సిన బహిరంగ సభలు, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపుతో పాటు త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు
మిగతా 3వ పేజీలో ▶

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'వాట్సాప్ కాపీయింగ్'

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఓ మెరిట్ విద్యార్థి	వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమాధానాలు పోస్ట్ చేసిన వైనం	మాస్ కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన అతని సోదరుడు, ముగ్గురు స్నేహితులు	ఐదుగురు మైనర్ల వద్ద 5 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం.. నాలుగు పోలీస్‌స్టేషన్లలో కేసులు



సాక్షి, హైదరాబాద్: మొన్న టీఎస్‌పీఎస్సీ.. నిన్న పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీల కలకలం పూర్తిగా మరువక ముందే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్‌లో మైనర్ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడటం సంచలనం సృష్టిస్తోంది. ఆదివారం జరిగిన ఈ పరీక్షలో ఒక మైనర్ విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా, అతని సహకారంతో నలుగురు వాట్సాప్ ద్వారా మాస్ కాపీయింగ్ చేస్తూ దొరికిపోయారు. మొత్తం ఐదు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా వీరిపై హైదరాబాద్, రాచకొండల్లోని నాలుగు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రైవేట్ సంస్థ వ్యవహారాన్నీ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పరీక్ష హాళ్లలోకి స్మార్ట్‌ఫోన్లు రావడంలో ఎవరి వైఫల్యం ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

సోదరుడు, స్నేహితుల కోసం..

కడపకు చెందిన టీచర్ కుమారుడైన ఓ విద్యార్థికి పదో తరగతి పరీక్షల్లో 600కు 600 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 1000కి 940 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లోనూ 94 శాతం మార్కులు సాధించాడు. హైటెక్ సిటీ సమీపంలో ఉన్న ఓ కార్పొరేట్ కాలేజీలో విద్యనభ్యసిస్తున్న ఇతడికి ఒక సోదరుడితో పాటు ముగ్గురు స్నేహితులు ఉన్నారు. ఈ ఐదుగురూ ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. కడప విద్యార్థికి సికింద్రాబాద్ ప్యాట్నీ సమీపంలో ఉన్న ఎస్‌వీఐటీ కాలేజీలో పరీక్షా కేంద్రం ఉండగా, అతని సోదరుడికి మౌలాలిలో, ఇద్దరు స్నేహితులకు (వీరిద్దరూ సోదరులు) మల్లాపూర్‌లో, మరొకరికి
మిగతా 5వ పేజీలో ▶

రూ.లక్ష సాయానికి దరఖాస్తులు షురూ..

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి గంగుల కమలాకర్



- బీసీ కుల, చేతివృత్తిదారులకు పనిముట్లు, ముడిసరుకు కొనుగోలుకు ఆర్థిక సాయం అందించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం
- 9న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా మంచిర్యాల జిల్లాలో ప్రారంభం
- అదేరోజు అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ
- https://tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్‌లో అప్లికేషన్ల స్వీకరణ.. 20 వరకు దరఖాస్తుకు చాన్స్
- వివరాలు వెల్లడించిన మంత్రి గంగుల

-వివరాలు 2లో▶

క్లుప్తంగా...

ఉత్తమ నర్సులకు అవార్డులు ప్రదానం చేసిన ఏపీ గవర్నర్



సాక్షి, హైదరాబాద్: ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో మంగళవారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ వృత్తిలో విశేష కృషి చేసిన వారికి 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డ్–2023' అవార్డులను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అందజేశారు. తెలంగాణ నుంచి బాన్సువాడ ఏరియా వైద్యశాల హెడ్ నర్సు జ్యోతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాల స్టాఫ్ నర్సు కట్కూరి రాణి, నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట ఏరియా ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సు ఉషత్ ఉన్నీసా, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ సంజుల వర్మ, సెయింట్ థెరిసా హాస్పిటల్ నర్సింగ్ ఆఫీసర్ సరితలు ఈ అవార్డులు అందుకున్నారు.

నేడు సాగునీటి దినోత్సవం

రవీంద్రభారతిలో కార్యక్రమానికి సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవం నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతిలో సాగునీటి రంగంలో సాధించిన విజయాలపై కార్యక్రమాన్ని నిర్వహించనుంది. సీఎం కేసీఆర్, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ తదితరులు పాల్గొననున్నారు. జిల్లాల్లో సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మందితో సభలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ చక్రాలకు మంటలు

బాలానగర్: కాచిగూడ నుంచి బెంగళూరు వెళ్లే బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ స్టేషన్‌లో 16 నిమిషాలు ఆగింది. 8.26 గంటలకు బాలానగర్‌కు వచ్చిన రైలు 8.43 గంటలకు తిరిగి బయలుదేరింది. రైల్లో ఎక్కువ మోతాదులో స్పార్క్స్ (మంటలు) రావడంతో ముందు జాగ్రత్తగా రైలును బాలానగర్‌లో నిలిపినట్లు సమాచారం. ట్రిన్ బ్రేకులు వేసిన సమయంలో వీల్స్‌లో స్పార్క్స్ వచ్చాయని, సాధారణంగా చిన్నపాటి స్పార్క్స్ వస్తుంటాయన్నారు. లోకో పైలెట్ 16 నిమిషాలపాటు వాటిని సరిచేసుకుని బయలుదేరి వెళ్లారు. దీంతో కాచిగూడ టు కర్నూలు టౌన్ ట్రైన్‌కు సైతం అరగంట అంతరాయం కలిగినట్లు ప్రయాణికులు చెప్పారు. దీనికి తోడు బాలానగర్ రైల్వేస్టేషన్‌లో సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో స్టేషన్‌లో అంధకారం నెలకొంది.

పలు రైళ్లు రద్దు.. కొన్ని పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: నిర్వహణపరమైన కారణాలు, ఒడిశాలో రైలు ప్రమాద ఘటన దృష్ట్యా ఈ నెల 7 నుంచి 13 వరకు పలు రైళ్లను రద్దుచేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాచిగూడ–నిజామాబాద్ (07596), నిజామాబాద్–కాచిగూడ (07593), నాందేడ్–నిజామాబాద్ (07854), నిజామాబాద్–నాదేడ్ (07853) రైళ్లను ఈ నెల 7 నుంచి 13 వరకు రద్దుచేసినట్లు పేర్కొన్నారు. కాచిగూడ–షాలిమార్–వాస్కోడిగామా (17603/18047), షాలిమార్–హైదరాబాద్ (18045/18046) రైళ్లు ఈ నెల 7న రద్దు కానున్నాయి. వాస్కోడిగామా–షాలిమార్–కాచిగూడ (18048/17604) రైలు 9వ రద్దు కానుంది. దౌండ్–నిజామాబాద్ (11409), నిజామాబాద్–పండర్‌పూర్ (01413) రైళ్లను ముద్ఖేడ్–నిజామాబాద్ మధ్య పాక్షికంగా రద్దుచేశారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

వేసవి రద్దీ దృష్ట్యా కాచిగూడ–తిరుపతి (07061 / 07062), కాచిగూడ–కాకినాడ (07417 / 07418), కాచిగూడ–నర్సాపూర్ (07653 / 07654) ప్రత్యేక రైళ్లను ఈ నెల 30 వరకు పొడిగించనున్నట్లు సీపీఆర్వో తెలిపారు.

ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రానమీలో నారాయణ జైత్రయాత్ర

సాక్షి, హైదరాబాద్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్, జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఒలింపియాడ్స్‌లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఓరియంటేషన్ కమ్ సెలెక్షన్ క్యాంప్‌లో ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ఆరుగురు సభ్యుల బృందంలో ఇద్దరు నారాయణ విద్యార్థులు సోహం పెద్నేకర్, కనిష్క్ జైన్ ఎంపికయ్యారు. 2023 డిసెంబర్ 1 నుంచి 10 వరకు థాయ్‌లాండ్‌లో జరగనున్న (ఐజేఏస్ఓ) ఫైనల్స్‌లో వీరు పాల్గొంటారు. అలాగే ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఆన్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ జూనియర్ విభాగంలోనూ 'నారాయణ' ఫలితాలు సాధించింది. సెప్టెంబర్‌లో గ్రీస్‌లో జరగనున్న (ఐఓఏఏ) జూనియర్ విభాగంలో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే జట్టులో 3 స్థానాల్లో రెండింటిని సొంతం చేసుకుంది. ఇందులో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించడానికి ముగ్గురిని ఎంపిక చేసింది. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ సింధూర, పి.శరణి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ధరణితో.. రైతే రాజు

రైతు బొటన వేలుకే రికార్డులు మార్చే అధికారం: సీఎం కేసీఆర్



కలెక్టరేట్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, వేముల, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: రైతు పేరిట ఉన్న భూమి మార్చేందుకు ఇప్పుడు ఎమ్మార్వో, మంత్రి, చివరకు ముఖ్యమంత్రికి కూడా అధికారం లేదని, ధరణితో కేవలం రైతు బొటన వేలికే భూముల రికార్డులు మార్చే అధికారం ఇచ్చామని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ధరణి తీసేస్తే రైతులు మళ్లీ పంట డబ్బుల కోసం చిట్టీలు పట్టుకుని సేట్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వం తెచ్చిన ధరణి మూలంగానే రైతుబంధు కింద పెట్టుబడి సాయం, రైతు చనిపోతే రూ.5 లక్షలు, వడ్లు అమ్మితే పంట డబ్బులు వెంటనే అందుతున్నాయని తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో సీఎం మాట్లాడారు.

ధరణి లేకుంటే ఎన్ని పంచాయతీలయ్యేవో..

'ప్రపంచంలో ఎక్కడినుంచైనా బటన్ నొక్కి రైతు తన పేరిట ఉన్న భూమిని చూసుకునే చక్కని సదుపాయం ధరణి కల్పించింది. ధరణి లేకుంటే కోట్ల రూపాయలు పలుకుతున్న భూములతో ఎన్ని పంచాయతీలు, పోలీసు కేసులు, మర్డర్లు అయ్యేవో ఆలోచించాలి. ధరణిని బంగాళాఖాతంలో పడేయాలన్న కాంగ్రెస్ నేతలకు ఇదంతా ఇష్టం లేదు. అందువల్ల వారినే బంగాళాఖాతంలో పడేయాలి. కాంగ్రెస్ మాటలు విని రైతులు సాధికారతను కోల్పోవద్దు. రైతుల మధ్య మళ్లీ భూ తగాదాలు పెరగాలి, కోర్టుల చుట్టూ తిరగాలని కొందరు కుట్ర పన్నుతున్నారు. ధరణి తీసేస్తే వీఆర్వోలు, గిర్దావరీల చేతుల్లోకి మన బతుకులు వెళ్తాయి. మళ్లీ వాళ్లు రాసిందే రాత, గీసిందే గీతగా మారుతుంది. ఇప్పుడు అడుగుతున్నా ధరణి తీసేద్దామా? కాపాడుకుందామా? ధరణితో నూటికి 99 శాతం భూసమస్యలు పరిష్కారం అయ్యాయి. ఏవైనా సమస్యలు మిగిలి ఉంటే అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు నిమిషాల్లో పరిష్కారం చేస్తారు..' అని కేసీఆర్ అన్నారు.



పార్టీ భవనం ప్రారంభం సందర్భంగా పూజ చేస్తున్న సీఎం కేసీఆర్

మంది మాటలకు ఆగం కావొద్దు..

'తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయింది. ఇందులో ఒకటిన్నర ఏళ్లు కరోనా, మరో ఏడాది నోట్ల రద్దుతోనే గడిచిపోయింది. అయినా మిగిలిన ఆరున్నర ఏళ్లలోనే దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగంతో పాటు అనేక రంగాల్లో రాష్ట్రం నంబర్‌వన్‌గా ఉంది. మంది మాటలు విని ఆగం కావొద్దు. కాంగ్రెస్ రాజ్యంలో దళారులదే భోజ్యం. ఆ ప్రబుద్ధుల పాలనలో కంప చెట్లే దిక్కయ్యాయి. కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు మధ్య నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది..' అని సీఎం పేర్కొన్నారు.

ఇకపై బంగారు తునకగా పాలమూరు..

'ఉద్యమ సమయంలో నన్ను ఎక్కడి నుంచి పోటీ చేసినా గెలిపిస్తామని పెద్దలు ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. అప్పుడు పాలమూరులో ఉద్యమం అంతగా లేకున్నా ఎంపీగా గెలిపించారు. ఎంపీగా ఉన్నప్పుడే ఇక్కడి కష్టాలు అర్థమయ్యాయి. కల్వకుర్తి తండాల్లో పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. దుందుభి వాగుపై గోరటి పాట రాస్తూ 'వాగు ఎండిపోయెరా, చేను ఎండిపోయెరా..' అని బాధపడ్డడు. నేను ఇక్కడి ఎంపీగా ఉండగానే రాష్ట్రం సాధించుకున్న చరిత్ర పాలమూరుకు ఉంది. రాష్ట్రం ఏర్పడ్డాక పాలమూరును పంటల భూమిగా మార్చిన సంతోషం ఉంది. 'వలసలతో వలవల విలపించిన కరువు జిల్లా.. నేడు చెరువులన్నీ నిండి పన్నీటి జలకమాడే పాలమూరు' అంటూ నేనే పాట రాసిన. నాగర్‌కర్నూల్ నుంచి శపథం చేస్తున్నా. నేను ఇప్పటివరకు ఏ పని చేసినా భగవంతుడు ఓడించలే. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతాం. నార్లాపూర్, ఏదుల, మిగతా అన్ని రిజర్వాయర్లను ఆగస్టులోనే నింపుతాం.

> **పాలమూరులో నియోజకవర్గానికి 4 వేల ఇళ్లు**
>
> ఇకపై నా పాలమూరును బంగారు తునకగా చూడబోతున్నాం. రాష్ట్రంలో గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నాం. కానీ వెనకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో నియోజకవర్గానికి 4 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నాం. కులవృత్తుల కుటుంబాలకు ఈ నెల 9 నుంచి ఇంటికి లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

నా బలగం, బంధువులు తెలంగాణ ప్రజలే..

దేశంలో ఎక్కడకు పోయినా తెలంగాణ మోడల్ గురించే అడుగుతున్నారని కేసీఆర్ చెప్పారు. తన బలగం, బంధువులు తెలంగాణ ప్రజలేనని, మీరిచ్చిన ధైర్యంతోనే దేశ రాజకీయాల్లోకి పోవాలన్న నిర్ణయం తీసుకున్నానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, గోరటి వెంకన్న, చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9 ఏళ్లలో ఊహించని అభివృద్ధి: సీఎం

నాగర్‌కర్నూల్ నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం ప్రారంభం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలోనే ఊహకందని రీతిలో అభివృద్ధి సాధించిందని సీఎం కేసీఆర్ చెప్పారు. ఐటీ రంగంలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచినట్టుగా రిపోర్టులు చెబుతున్నాయన్నారు. రాష్ట్ర ఉద్యోగుల చెమట బిందువుల సమాహారంతోనే ఇది సాధ్యమైందన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కలెక్టరేట్ సముదాయం, ఎస్పీ కార్యాలయాలను సీఎం ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలోని పల్లెలకు దేశంలోని ఏ గ్రామం సాటిరాదని చెప్పారు. గతంలో బొంబాయి బస్సులకు ఆలవాలమైన పాలమూరులో నేడు హార్వెస్టర్లు, వరికోతలు కన్పిస్తున్నాయని అన్నారు. బిహార్, జార్ఖండ్, యూపీ నుంచి పాలమూరుకు వలస వస్తున్నారని చెప్పారు. ఎండాకాలంలోనూ నిండుగా ఉన్న చెక్‌డ్యాంలతో ఆనందపరవశం కలుగుతోందన్నారు. నాగర్‌కర్నూల్‌తో కలిపి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 19 కలెక్టరేట్‌లను ప్రారంభించుకున్నట్టు తెలిపారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజన్ కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా కలెక్టర్ చాంబర్‌ను ఎస్‌హెచ్‌ఏలో ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్న గణపతిరెడ్డి చేతుల మీదుగా సీఎం ప్రారంభింపజేశారు.



కలెక్టర్ చాంబర్‌ను ప్రారంభిస్తున్న ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి. చిత్రంలో సీఎం కేసీఆర్, శ్రీనివాస్ గౌడ్, సీఎస్

నిధులు మళ్లించాం.. కానీ..

▶ మొదటి పేజీ తరువాయి

చాలాసేపు జాప్యం చేశారు. విచారణ మొదలైన కొద్దిసేపటికే జ్వరంగా ఉందని, కళ్లు తిరుగుతున్నాయంటూ వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆమెను పరీక్షించిన డాక్టర్ కొన్ని మాత్రలు సూచించి విచారణ కొనసాగించవచ్చని చెప్పారు. సీఐడీ అధికారులు మళ్లీ విచారణ చేపట్టిన కొద్దిసేపటికే మరోసారి తనకు ఆరోగ్యం సహకరించడం లేదని శైలజా కిరణ్ పేర్కొన్నారు. విచారణను అర్ధాంతరంగా ముగించేందుకు ప్రయత్నించగా సీఐడీ అధికారులు పూర్తి సహనం వహిస్తూ విచారణను కొనసాగించారు.

మళ్లించాం... ఎక్కడికో తెలియదు!

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల నుంచి వసూలు చేసిన నిధులను ఎక్కడికి మళ్లించారనే విషయాన్ని తెలుసుకోవడంపై సీఐడీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. బ్రాంచీల కార్యాలయాల్లోని రికార్డుల ప్రకారం రూ.వేల కోట్లు చందాదారుల నుంచి వసూలు చేసినట్లు తేలింది. బ్యాంకు ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టిన రూ.793.50 కోట్లను అటాచ్ చేసేందుకు సీఐడీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. చందాదారుల నుంచి భారీగా వసూలు చేసిన మిగతా నిధులను ఎక్కడికి మళ్లించారన్నది అంతుచిక్కని వ్యవహారంగా మారింది. రికార్డుల్లో సరైన వివరాలు లేకుండా ఆడిటర్ల ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. సీఐడీ అధికారులు అదే విషయంపై శైలజా కిరణ్‌ను ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. ఏపీలోని 37 బ్రాంచి కార్యాలయాల ద్వారా వసూలు చేసిన చందా నిధులను ఇతర సంస్థల్లో పెట్టుబడులుగా పెట్టామని పేర్కొనట్లు సమాచారం. నిర్దిష్టంగా ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టారన్నది మాత్రం ఆమె వెల్లడించలేదు. దీనిపై సీఐడీ అధికారులు ఎంత ప్రశ్నించినా తనకేమీ తెలియదని శైలజా కిరణ్ చెప్పడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారులకు చిట్టీల మొత్తాన్ని ఎందుకు చెల్లించలేకపోతోందని సీఐడీ అధికారులు శైలజా కిరణ్‌ను ప్రశ్నించగా సూటిగా సమాధానం ఇవ్వలేదు. చందాదారుల సొమ్ము భద్రంగా ఉందంటూ తప్పించుకునే యత్నం చేశారు. అదే నిజమైతే చిట్టీల మొత్తం ఎందుకు చెల్లించలేకపోతున్నారని అధికారులు ప్రశ్నించగా ఆమె స్పందించలేదు.

మరోసారి విచారణ

విచారణకు శైలజా కిరణ్ సహకరించకపోవడంతో ఆమెకు మరోసారి నోటీసులు జారీ చేయాలని సీఐడీ అధికారులు నిర్ణయించారు. ఆమెకు అనుకూలంగా ఉన్న రోజే విచారించాలని భావిస్తున్నారు.



సోదాలు జరిపిన అనంతరం బయటకు వస్తున్న సీఐడీ అధికారులు

ఈమేరకు త్వరలో మరోసారి నోటీసులు జారీ చేయనున్నారు. ఆ తరువాత రామోజీరావును కూడా మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తోంది.

చట్టాన్ని ఉల్లంఘించి...నిధులు కొల్లగొట్టి!

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ద్వారా చెరుకూరి రామోజీరావు, శైలజ భారీగా ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ సోదాల్లో ఆధారాలతో సహా వెల్లడైంది. రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించి ఆర్థిక అక్రమాలను నిర్ధారించారు. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం–1982 ప్రకారం చందాదారుల నుంచి వసూలు చేసిన నిధులను సంబంధిత బ్రాంచీ కార్యాలయాలున్న నగరాలు/పట్టణాల్లోని జాతీయ బ్యాంకుల్లోనే జమ చేయాలి. అందుకు విరుద్ధంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ రూ.వేల కోట్లను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి మళ్లించింది. చిట్‌ఫండ్స్ సంస్థలు తమ నిధులను ఇతర వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టకూడదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం తమ చందాదారుల నిధులను అత్యంత మార్కెట్ రిస్క్ ఉంటే మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లోకి మళ్లించింది. తమ కుటుంబ వ్యాపార సంస్థల్లో పెట్టుబడిగా పెట్టింది. చిట్‌ఫండ్స్ సంస్థలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ చందాదారుల చిట్టీల మొత్తాన్ని పూర్తిగా వారికి ఇవ్వకుండా రశీదులిస్తూ 4 – 5 శాతం వడ్డీ చెల్లిస్తోంది. అంటే అక్రమంగా డిపాజిట్లు సేకరిస్తోంది. పెద్ద ఎత్తున నల్లధనాన్ని తమ సంస్థ ముసుగులో చలామణిలోకి తెస్తున్నట్లు కూడా సీఐడీ గుర్తించింది. గత డిసెంబర్ నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు వేయడం లేదు. ఇప్పటికే దాదాపు రూ.400 కోట్ల టర్నోవర్ నిలిచిపోయింది. చందాదారుల సొమ్మును గుర్తుతెలియని సంస్థల్లో పెట్టుబడిగా పెట్టింది. ఆ నిధులు ఇప్పటికిప్పుడు వచ్చే అవకాశం లేదు. దీంతో చందాదారులకు చిట్టీల మొత్తం చెల్లించలేకపోతోంది.

టీఎస్‌పీఎస్సీ పరీక్షలను ఆపేందుకు బీజేపీ కుట్ర

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలను ఆపేందుకు బీజేపీ, దాని బీ టీం పార్టీలు కుట్ర పన్నుతున్నాయని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్ మండిపడ్డారు. నిరుద్యోగులు పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించడం విపక్షాలకు ఇష్టం లేదని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. పోటీ పరీక్షలు జరిగితే యువత బీఆర్ఎస్ వైపు తిరుగుతారనే భయం విపక్షాలకు పట్టుకుందన్నారు. అందుకే హైకోర్టులో ఈ నెల 11న జరిగే గ్రూప్ పరీక్షలు నిలిపివేయాలని పిటిషన్ వేశారని.. ఈ సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు విపక్షాలకు చెంపపెట్టని అన్నారు.

ఆర్టీసీకి లక్కీ మండే

ఒక్కరోజే టికెట్ల ద్వారా రూ.20.36 కోట్ల ఆదాయం



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీకి సోమవారం రద్దీ బాగా కలిసొస్తోంది. గత నెల 15న సోమవారం రోజు రికార్డు స్థాయిలో రూ.20.26 కోట్ల ఆదాయాన్ని సాధించిన ఆర్టీసీ, తాజాగా ఈ సోమవారం దాన్ని బ్రేక్ చేస్తూ రూ.20.36 కోట్లను పొందింది. గత సంక్రాంతి తర్వాతి రోజు, రాఖీ పౌర్ణమి రోజు రూ.20 కోట్లను మించి టికెట్ రూపంలో ఆదాయం పొందింది. మిగతా సందర్భాల్లో ఒకేరోజు రూ.20 కోట్లను మించి ఆదాయం రికార్డు కాలేదు. ఆ రెండు సందర్భాలు పండుగలతో ముడిపడి ఉన్నందున, ఆర్టీసీ కొంత ఆశించి లక్ష్యంగా పెట్టుకుని ఆదాయం పొందింది. ఈ సోమవారం ఎలాంటి పండుగలు లేకున్నా అంత ఆదాయం రావటం విశేషం. నిర్ధారించుకున్న లక్ష్యాన్ని మించి 116 శాతం ఆదాయం పొందటం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో అది 122 శాతంగా నమోదైంది. ఆక్యుపెన్సీ రేషియో 82 శాతంగా నమోదైంది. సోమవారంరోజు 34.26 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్టు రికార్డు అయింది. కిలోమీటర్‌కు రూ.53.74 చొప్పున ఆదాయం (ఈపీకే) వచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

రూ.లక్ష సాయానికి | దరఖాస్తులు షురూ..

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల వెబ్‌సైట్‌ను ప్రారంభించిన మంత్రి గంగుల



సాక్షి, హైదరాబాద్: బీసీ వర్గాలలోని కుల, చేతివృత్తిదారులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. కులవృత్తులు చేసుకునేవారు పనిముట్లు, ముడిసరుకు కొనుగోలు చేసుకునేందుకు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం నుంచే అవకాశం కల్పించింది. గత కేబినేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ వెనుకబడిన వర్గాల కులవృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్‌ను మంత్రి గంగుల మంగళవారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం నుంచి ఈనెల 20 వరకు https://tsobmmsbc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఫొటో, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తదితర వివరాలతో సరళంగా దరఖాస్తు ఫారాన్ని రూపొందించినట్లు మంత్రి తెలిపారు. వీటిని ఆయా జిల్లాల యంత్రాంగం పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 9న మంచిర్యాలలో ప్రారంభించనున్నారు. అదేరోజు నుంచి లబ్ధిదారులుగా ఎంపికైన వారికి ఆర్థిక సహాయాన్ని రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా చెక్కుల రూపంలో అందించనున్నారు. వెనుకబడిన వర్గాలలో అనాదిగా కులవృత్తులు, ఇతర చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి వచ్చిన పథకమే ఈ లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకం అని గంగుల అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు పాల్గొన్నారు.

> **ఇవీ అర్హతా నిబంధనలు**
>
> - ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపచేస్తారు.
> - ఈ పథకం కింద లబ్ధిపొందగోరే వారు గ్రామాల్లో అయితే లక్షన్నర మేరకు, పట్టణాల్లో రూ.2 లక్షల వరకు ఆదాయ పరిమితిని కలిగి ఉండాలి.
> - దరఖాస్తు చేసుకునే వారి వయసు 18–55 ఏళ్ల మధ్య ఉండాలి.
> - గడిచిన ఐదేళ్లలో వివిధ పథకాల కింద రూ.50 వేల కంటే ఎక్కువ లబ్ధి పొందిన వారు అనర్హులు.

బీసీల్లోని ఎన్ని వర్గాలకు?

వెనుకబడిన వర్గాలలో కులాలను బట్టి చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వపరంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం ఈ పథకం ఉద్దేశం. బీసీ కులాల్లో లక్ష రూపాయల ఆర్థిక సాయం పథకానికి ఎవరిని అర్హులుగా చేయాలన్న విషయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులదే తుది నిర్ణయం. బీసీ వర్గాలలో కుల, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

రూ.1571 కోట్లతో నిమ్స్ విస్తరణ | 14న సీఎం శంకుస్థాపన

- 2000 పడకల ఆసుపత్రి భవనానికి శ్రీకారం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14న నిర్వహించే వైద్య ఆరోగ్య దినోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ.1571 కోట్లతో నిర్మించబోయే 2000 పడకల ఆసుపత్రి భవనానికి జూన్ 14 న సీఎం శంకుస్థాపన చేస్తారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత నిమ్స్‌కు వెళ్లి విస్తరణ శంకుస్థాపన పనులను పరిశీలించారు. కొత్త భవనం నిర్మించే స్థలాన్ని సందర్శించి భూమి పూజ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం 5,000 మందితో నిర్వహించే సభకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య రంగంలో సాధించిన సంపూర్ణ ప్రగతిని జిల్లాల వారీగా తెలియజేస్తూ, కరపత్రాన్ని రూపొందించి ఆరోజు ఆవిష్కరించి పంపిణీ చేయాలన్నారు.



నిమ్స్‌లో శంకుస్థాపన పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఉత్తమ సిబ్బందికి మెమెంటోలు

ఉత్తమ ఆశా వర్కర్, ఉత్తమ ఏఎన్ఎం, ఉత్తమ స్టాఫ్ నర్స్, ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్, ఉత్తమ డాక్టర్... ఇలా ఆరోగ్యశాఖలోని పలు విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు మెమెంటోలు అందించాలన్నారు. వైద్య ఆరోగ్య దినోత్సవం స్ఫూర్తిని చాటేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బ్యాడ్జీలు ధరించాలని చెప్పారు. పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలు సహా అన్ని ఆసుపత్రులనూ అలంకరించాలని హరీశ్‌రావు ఆదేశించారు.

'చల్లని' చిట్కా



ఎండలతో బయటకు రావాలంటేనే జనం జంకుతున్న పరిస్థితుల్లో.. ఆటోడ్రైవర్ల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ ఆటోడ్రైవర్ వినూత్నంగా ఆలోచించాడు. బస్తాలో వడ్ల గింజలు వేయడంతో అవి మొలకెత్తాయి. దీంతో నారుతో కూడిన బస్తాలను ఆటో టాప్‌పై వేయగా.. ఎండ వేడి నుంచి ఉపశమనం లభిస్తోందని చెప్పాడు. మహబూబాబాద్ జిల్లా నుంచి అద్దెపై ఖమ్మం వచ్చిన ఆటోడ్రైవర్‌ను పలకరించగా.. గంటకోసారి బస్తాను నీటితో తడుపుతుండడంతో తనతో ప్రయాణికులు సేదదీరుతున్నారని తెలిపాడు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

మండిపోయిన మంగళవారం

▶ మొదటి పేజీ తరువాయి

ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు ఉత్తర తెలంగాణల్లోని మూడు నాలుగు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని హెచ్చరించింది. ఆ కాలంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు స్థిరంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ దాని చుట్టు పక్కల జిల్లాల్లో 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డు కానున్నాయి. సోమవారం నాటి ఆవర్తనం మంగళవారం దక్షిణ ఛత్తీస్‌ఘడ్ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగుతూ.. సగటు సముద్ర మట్టం నుండి 1.5 కిలోమీటర్ల ఎత్తు వద్ద స్థిరంగా ఉంది. ద్రోణి విదర్భ నుండి తెలంగాణ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టం నుండి 0.9 కిలోమీటర్ల వద్ద కొనసాగుతూ ఉంది. మరోవైపు రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మరికొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

మంగళవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు.. (సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత		
మహదేవపూర్ (జయశంకర్)	45.7	ఖమ్మం	43.4
జంబుగ (కొమురంభీం)	45.4	భద్రాచలం	42.8
కుంచవెల్లి (కొమురంభీం)	45.3	ఆదిలాబాద్	42.0
యానంబైలు (భద్రాద్రి కొత్తగూడెం)	45.3	నల్లగొండ	41.5
జూలూరుపాడు (భద్రాద్రి కొత్తగూడెం)	45.3	హనుమకొండ	41.5
మఠంపల్లి (సూర్యాపేట)	44.8	రామగుండం	41.4
కాటారం (జయశంకర్)	44.7	మెదక్	41.3
హుజూర్‌నగర్ (సూర్యాపేట)	44.7	హైదరాబాద్	39.6
మేడారం (ములుగు)	44.7	నిజామాబాద్	39.5
		మహబూబ్‌నగర్	39.0

క్లుప్తంగా...

గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరాలి

రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్



కాచిగూడ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గోల్కొండ కోటపై బీజేపీ జెండా ఎగరాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌లతో కలిసి సునీల్ బన్సల్ మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే విషయం ప్రజల్లోకి వెళ్లిందని స్పష్టం చేశారు. ఆ విషయాన్ని నాయకులు గుర్తించి ప్రజల మధ్యలో ఉండాలని సూచించారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

టీడీపీ వల్లే తెలుగువారి ప్రతిభ విశ్వవ్యాప్తం

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు



సాక్షి, హైదరాబాద్: తెలుగువారి ప్రతిభ ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన ఆయనను టీటీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి ఏదో ఒకరోజు తప్పకుండా పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో టీడీపీ అధికారంలో లేకపోయినా పార్టీ శ్రేణుల ఉత్సాహం బాగుందని ప్రశంసించారు. దేశంలో తెలంగాణ అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలుస్తోందంటే.. టీడీపీ వేసిన పునాదే అందుకు కారణమని స్పష్టం చేశారు. తెలుగు వాళ్లు ప్రపంచం నలుమూలలా ఉన్నారంటే.. అది తెలుగుదేశం పార్టీ ఘనతేనన్నారు. ఆనాడు ఐటీ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు. మరోసారి తనను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అమ్ముకుంటోంది

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్పీ



నేరేడుచర్ల: ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలకు అమ్ముకుంటోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 243, 244, 253, 350, 358, 479 సర్వే నంబర్లలో గల భూములను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుపేదలు ప్రభుత్వ స్థలాల్లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకొని పోరాటం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించడం ఖాయమని, బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఒక ఎకరం భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివ గౌడ్, జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, వాస కరుణాకర్, పల్లయ్య, మౌలాంబి, సైదా ఉన్నారు.

ఒక రాజకీయ పార్టీకి రెండు కార్యాలయాలా?

ట్విట్టర్‌లో వైఎస్ షర్మిల ఆగ్రహం




సాక్షి, హైదరాబాద్: ఒక రాజకీయ పార్టీకి రెండు కార్యాలయాలా..?. పార్టీ పేరు మార్చినంత మాత్రాన కొత్త భవనానికి సర్కారు భూమా? అని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. రూ.550 కోట్లు పలికే 11 ఎకరాల స్థలం రూ.37కోట్లకే కొట్టేశారని, కేసీఆర్ రాజకీయాలకు అగ్గువకే దొరికే సర్కారీ భూములు పేదల సంక్షేమానికి మాత్రం కనపడవన్నారు. 'దళితులకు 3 ఎకరాల భూమి, 36 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టడానికి, చివరికి అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, జర్నలిస్టులకు స్థలాలివ్వడానికి దొరకని పరిస్థితి.. కానీ కేసీఆర్‌కు మాత్రం రాత్రికి రాత్రే భూబదలాయింపులు జరిగిపోతాయి'అని ట్వీట్ చేశారు. కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించడం దుర్మార్గపు చర్య అని షర్మిల అన్నారు. గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని రూపొందించిన యాదగిరిరావుకి ఇప్పటికీ బిల్లు క్లియర్ చేయకపోవడాన్ని ఆమె ఆక్షేపించారు.

ఐటీలో పోటాపోటీ!

కేంద్ర ప్రభుత్వ నివేదిక (2021-22) ప్రకారం.. ఐటీ ఎగుమతులు

కర్ణాటక	మహారాష్ట్ర	తెలంగాణ	తమిళనాడు
3.95 లక్షల కోట్లు	2.36 లక్షల కోట్లు	1.83 లక్షల కోట్లు	1.57 లక్షల కోట్లు
హర్యానా 0.52 లక్షలు		మొత్తం భారత్ ఐటీ ఎగుమతులు రూ.11.59 లక్షల కోట్లు	



కేంద్ర ప్రభుత్వ నివేదిక (2021-22) ప్రకారం భారత్‌లో ఐటీ ఉద్యోగుల సంఖ్య: సుమారు 50 లక్షలు

బెంగళూరు 15 లక్షలు
హైదరాబాద్ 7.78 లక్షలు
తమిళనాడు 10 లక్షలు
పుణె 4 లక్షలు

బెంగళూరు, ముంబైకి దీటుగా హైదరాబాద్
- ఎగుమతుల్లో 31.44 శాతం వార్షిక వృద్ధిరేటు
- ఏడాది కాలంలోనే కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాలు

ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో తెలంగాణ కొత్త రికార్డులు
- దేశంలో కొత్తగా వస్తున్న ప్రతి రెండు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి రాష్ట్రం నుంచే
- ఆఫీస్ స్పేస్ వినియోగంలో బెంగళూరును అధిగమించిన హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు ఐటీ ఆధారిత సేవల రంగం ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో తెలంగాణ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.57 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేరాయి. దీంతో ఐటీ రంగంలో భారత్‌లో అగ్రస్థానంలో ఉన్న కర్ణాటక, మహారాష్ట్రతో తెలంగాణ పోటీ పడుతున్నట్లయింది. తెలంగాణ రాష్ట్ర రెండో ఐసీటీ పాలసీ (2021-26)లో రూ.3 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు, 10 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 2022-23 ఐటీ శాఖ ప్రగతి నివేదిక ప్రకారం.. తెలంగాణ ఈ లక్ష్యాన్ని రెండేళ్ల ముందుగానే అంటే 2024 నాటికే చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగంలో ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో కొత్త లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు రాష్ట్ర ఐటీ శాఖ సన్నద్ధమవుతోంది. దేశంలో ఏ ఇతర రాష్ట్రం సాధించని రీతిలో 2022-23లో తెలంగాణ ఐటీ ఎగుమతుల్లో 31.44 శాతం వార్షిక వృద్ధిరేటు, ఉద్యోగాల కల్పనలో 16.2 శాతం రికార్డు వృద్ధి రేటును సాధించింది. దీంతో ఏడాది కాలంలోనే కొత్తగా 1.26 లక్షల ఉద్యోగాలు, ఎగుమతుల్లో రూ.57 వేల కోట్లకు పైగా వృద్ధిని ఐటీ రంగం సాధించింది.

17.31% సీఏజీఆర్‌తో పురోగమనం

తెలంగాణ రాష్ట్ర అవతరణ నుంచి 17.31 శాతం సీఏజీఆర్ (సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు)తో వృద్ధి చెందడంతోనే ఐటీ రంగం శరవేగంగా పురోగమిస్తోంది. రాష్ట్ర అవతరణ నాటి పరిస్థితులతో పోలిస్తే ఐటీ ఎగుమతుల్లో నాలుగు రెట్లు, ఉద్యోగాల కల్పనలో మూడు రెట్లు పురోగతి సాధించగా, మరో మూడు రెట్లు పరోక్ష ఉద్యోగాలు వచ్చినట్లు అంచనా. 2022-23లో భారత్ ఐటీ ఎగుమతులు 9.36 శాతం ఉంటే, తెలంగాణలో మాత్రం 31.44 శాతం పెరిగాయి. 2014లో మొత్తం దేశ ఐటీ ఉద్యోగాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటా 9.83% గా ఉంటే ప్రస్తుతం కొత్త ఉద్యోగాల కల్పనలో ఒక్క తెలంగాణ వాటా 27.6%గా ఉంది. భారత్ గణాంకాలతో పోలిస్తే దేశంలో ఐటీ రంగంలో వచ్చిన కొత్త ఉద్యోగాల్లో తెలంగాణ నుంచి 2021-22లో 33 శాతం వస్తే, 2022-23లో 44 శాతం వచ్చాయి. అంటే దేశంలో కొత్తగా వస్తున్న ప్రతి రెండు ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణ నుంచే వస్తున్నట్లు భావించవచ్చు.

ఉద్యోగాల్లో బెంగళూరు తర్వాత ..

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2021-22లో దేశం నుంచి రూ.3.95 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు జరగ్గా, ఇందులో మూడో వంతు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచే జరుగుతున్నాయి. భారతీయ సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో కర్ణాటక నుంచి 34.2 శాతం, మహారాష్ట్ర నుంచి 20.4 శాతం, తెలంగాణ నుంచి 15.6 శాతం చొప్పున జరిగాయి. దేశ వ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ తాజా నివేదిక ప్రకారం తెలంగాణలోనే 9.05 లక్షల మంది పని చేస్తున్నారు. ఉద్యోగాల కల్పనలో బెంగళూరు తర్వాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఐటీ ఎగుమతుల్లోనూ రెండో స్థానంలో నిలిచే దిశగా దూసుకుపోతోంది.

పెట్టుబడులకు ప్రత్యేక ఆకర్షణగా

బెంగళూరు, హైదరాబాద్ పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా ఐటీ రంగం వృద్ధిలో పోటీ పడుతున్నాయి. బెంగళూరుతో పోలిస్తే స్టార్టప్ వాతావరణం, ఐటీ రంగంలో మౌలిక వసతుల కల్పన హైదరాబాద్‌లో కొంత ఆలస్యంగా పుంజుకున్నా ప్రస్తుతం పెట్టుబడులకు హైదరాబాద్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దేశ ఐటీ రాజధానిగా బెంగళూరుకు పేరున్నా ఇటీవలి కాలంలో ఐటీ పార్కులు, ఎస్ఈజెడ్‌లు హైదరాబాద్‌లో శరవేగంగా ఏర్పాటవుతుండటంతో రెండు నగరాల మధ్య ఐటీ, ఐటీ ఆధారిత సేవల కంపెనీలను ఆకట్టుకోవడంలో పోటీ నెలకొంది. ఆఫీస్ స్పేస్ వినియోగంలో ముంబయి, బెంగళూరు నగరాలకు మించి హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. 2021లో ఆఫీస్ స్పేస్ వినియోగం 129 శాతం పెరగ్గా, ఐదు మెట్రో నగరాలతో పోలిస్తే 6 శాతం సగటు వృద్ధి రేటు నమోదైంది. బెంగళూరుతో పోలిస్తే జీవన వ్యయం కూడా తక్కువ కావడంతో ఐటీ నిపుణులు హైదరాబాద్ వైపు చూస్తున్నారు.

తెలంగాణ నుంచి పదేళ్లుగా ఐటీ ఎగుమతులు !

ఏడాది	2022-23	2021-22	2020-21	2019-20	2018-19	2017-18	2016-17	2015-16	2014-15	2013-14
ఎగుమతులు (రూ.కోట్లలో)	2,41,275	1,83,569	1,45,522	1,28,807	1,09,219	93,442	85,470	75,070	66,276	57,258
ఉద్యోగాలు	9,05,715	7,78,121	6,28,615	5,82,126	5,43,033	4,75,308	4,31,891	4,07,385	3,71,774	3,23,396

పోలీసులు రాజ్యాంగం ప్రకారం పనిచేయాలి

- లేకపోతే రాజ్యాంగేతర శక్తులు పుట్టుకొస్తాయ్
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



అచ్చంపేట: పోలీసులు రాజ్యాంగం ప్రకారం విధులు నిర్వహించాలని.. లేకపోతే రాజ్యాంగేతర శక్తులు పుట్టుకొస్తాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలీసులు చట్టాన్ని తుంగలో తొక్కి అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా నడుచుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా లింగోనిపల్లి శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు పెడుతున్న తప్పుడు కేసుల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఎస్ఐ మొదలుకొని డీఎస్పీ వరకు ఎమ్మెల్యేల ఆదేశాలే పాటిస్తున్నారని ఆరోపించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తాం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్నారు. జీఓ 317ను రద్దు చేసి పాత విధానంలోనే బదిలీలు చేపడతామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ధరణిని ఎత్తివేస్తామని చెప్పారు. పోడు భూములపై గిరిజన రైతులకు హక్కు కల్పిస్తూ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వ్యూడలిజాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు సీఎం ధరణి తీసుకొచ్చారని దుయ్యబట్టారు.

ముందస్తు అరెస్టులు సరికాదు: కాంగ్రెస్ పార్టీని దేశంలో, తెలంగాణలో నిషేధించారా..? ముందస్తు అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వాహనాలకు ముందు, వెనక పోలీసు ఎస్కార్టు పెట్టుకొని.. ముందుస్తు అరెస్టులు చేయించేవాళ్లు అసలు ప్రజాప్రతినిధులేనా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

చెరువుల పండుగను బహిష్కరించాలి: మెట్టు



సాక్షి, హైదరాబాద్: పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో మత్స్యకారులకు అన్యాయం జరిగిందని, ఇందుకు నిరసనగా గురువారం ప్రభుత్వం నిర్వహించనున్న చెరువుల పండుగను మత్స్యకారులు బహిష్కరించాలని టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పార్టీ మత్స్యకారులను నిండా ముంచిందన్నారు. ఇప్పుడు దశాబ్ది ఉత్సవాల పేరుతో కొత్త డ్రామాకు తెరలేపిందన్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లకే చేపపిల్లల కాంట్రాక్టులు ఇస్తున్నారని ఆరోపించారు.

బంధువులకు ఉద్యోగాలు ఇచ్చేందుకే బోర్డులా?: బల్మూరి

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ తరహాలోనే మిగిలిన బోర్డుల్లోనూ అవకతవకలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్ నేతల బంధువులకు ఉద్యోగాలిచ్చేందుకు మాత్రమే బోర్డులు పనిచేస్తున్నట్టు ఉందని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. విద్యుత్‌శాఖ ఉద్యోగి రమేశ్ లీకుల వ్యవహారం బయటకు రావడంతో జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగ పరీక్ష ఫలితాలు ప్రకటించి ఉద్యోగాలిచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. లీకేజీలో ప్రభుత్వ తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

త్వరలో ఢిల్లీకి టీపీసీసీ నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

సన్నద్ధతపై అధిష్టానంతో చర్చించనున్నారు. ఏఐసీసీ అగ్రనేతలతో చర్చించేందుకు గానూ త్వరలోనే ఏఐసీసీ నుంచి తెలంగాణ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులకు ఆహ్వానం అందనున్నట్టు తెలుస్తోంది. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశాల్లో భాగంగా ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీ ఈనెల 8వ తేదీన ఢిల్లీ వస్తారని, ఆ తర్వాత ఎప్పుడైనా తెలంగాణ నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు రావచ్చని సమాచారం. 9 లేదా 10 తేదీల్లో ఈ సమావేశం ఉండే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నా, గత నెల 26నే జరగాల్సిన సమావేశం వాయిదా పడిన నేపథ్యంలో తేదీల ఖరారుపై మాత్రం స్పష్టత రావాల్సి ఉంది.

'సెమీఫైనల్' వ్యూహాలకు పదును!

- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలపై నడ్డా, అమిత్‌షా, బీఎల్ సంతోష్ కీలక భేటీ
- రాష్ట్రాల్లో కొత్త కమిటీల ఏర్పాటు, పార్టీ సంస్థాగత నియామకాలపై చర్చ.... ప్రాంతీయ పార్టీలతో పొత్తులపైనా సమాలోచనలు
- పది గంటల పాటు సుదీర్ఘ చర్చలు



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహాలకు బీజేపీ పెద్దలు పదును పెడుతున్నారు. ఈ ఏడాది చివరన ఎన్నికలు జరిగే తెలంగాణ సహా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మిజోరం ఎన్నికలకు కార్యాచరణను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ నూతనంగా నిర్మించిన రెసిడెన్షియల్ భవనంలో సోమవారం అర్ధరాత్రి వరకు, తిరిగి మంగళవారం ఉదయం దాదాపు పది గంటలపాటు కీలక చర్చలు జరిపారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీకున్న బలాబలాలు, బలహీనతలను బేరీజు వేసుకొని వాటిని అధిగమించే అంశంపై మేథోమథనం జరిపారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపునకు ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు కీలకంగా ఉండటం, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు, రాజస్తాన్‌లో 25, మధ్యప్రదేశ్‌లో 29, ఛత్తీస్‌గఢ్‌లో 11 స్థానాలు కలిపి మొత్తంగా 82 స్థానాలు ఉన్నందున అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటితేనే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు సులువవుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీటిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులోభాగంగా కొన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులను, ఇంచార్జీలను మార్చాలని నిర్ణయించినట్లు సమాచారం.

తెలంగాణలో ఏం చేయాలి?

తెలంగాణలో ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని, దీనిని తమకు అనుకూలంగా మలుచుకోవడంతో పాటు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌లో ఉన్న అసమ్మతిని తమవైపు తిప్పుకునే అంశాలపై నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. దీంతోపాటే కొత్తగా ఎన్నికల కమిటీ, ప్రచార కమిటీ, మేనిఫెస్టో సహా ఇతర కమిటీల నియామకాలను పూర్తి చేస్తూనే, సంస్థాగత నియామకాలను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఈటల రాజేందర్‌కు ముఖ్యమైన బాధ్యతలు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై అసంతృప్తిగా ఉన్న నేతలతో మాట్లాడి.. నేతల మధ్య ఐక్యత చెడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు సమాచారం. పార్టీ ప్రచార కార్యక్రమాలు, ఈ నెలలో తెలంగాణలో జరిపే పర్యటనలపైనా చర్చించారు. ఇదే సమయంలో ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తులు, అధికార పక్షం లేదా ప్రధాన ప్రతిపక్షంలో ఉన్న అసమ్మతి నేతలతో తృతీయ ఫ్రంట్ ఏర్పాటు అవకాశాలపైనా సమాలోచనలు చేశారు. అలాంటివి సాధ్యంకాని చోట ప్రభుత్వాలపై ఉన్న ప్రజా వ్యతిరేకతను సొమ్ముచేసుకునే అంశంపై చర్చించినట్లు చెబుతున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల జరిపిన భేటీలో తెలంగాణ విషయంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ ముందుంచిన ప్రతిపాదనలపైనా ముగ్గురు నేతలు చర్చించినట్లు సమాచారం. ఆయా అంశాలపై ప్రస్తుతం తెలంగాణ పర్యటనలో ఉన్న పార్టీ ఇంచార్జి సునీల్ బన్సల్ అభిప్రాయాలను కూడా ముగ్గురు అగ్రనేతలు అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది.

దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్

పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో మంత్రి కేటీఆర్
- తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ
- రూ.13.27 లక్షల కోట్లకు చేరిన జీఎస్‌డీపీ



పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేటీఆర్, జయేశ్‌రంజన్ తదితరులు

రాయదుర్గం (హైదరాబాద్): తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా మారిందని, సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య మోడల్ ఎంతో గుర్తింపు సాధించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక ప్రగతితో పాటు ఆర్థిక, సామాజిక ప్రగతిని సమాంతరంగా ముందుకు తీసుకెళుతోందని పేర్కొన్నారు. ఐటీ రంగం నుంచి మొదలుకుని వ్యవసాయం రంగం దాకా అన్ని రంగాల్లోనూ తెలంగాణ తన ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా పేద, మధ్య తరగతి, ధనిక వర్గాలు అనే వ్యత్యాసం లేకుండా అందరి ప్రగతికీ ప్రభుత్వం పాటుపడుతోందని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో కేటీఆర్ మాట్లాడారు. భారతదేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ రాష్ట్రంలో ఉందని, ప్రస్తుతం మూడు లక్షల 17 వేల రూపాయల తలసరి ఆదాయం కలిగి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి చెప్పారు. రాష్ట్ర జీఎస్‌డీపీ 2014లో రూ.5 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.13.27 లక్షల కోట్లకు చేరిందన్నారు. 2014లో జరిగిన సమావేశంలో ఇన్నోవేషన్ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెప్పామని, ఆ మాట మేరకు ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద టీ హబ్, టీవర్క్స్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్..: ప్రపంచ దేశాలతో పోటీ పడి పెట్టుబడులు రప్పించాలంటే భారీ ఎత్తున మౌలిక వసతుల కల్పన చేపట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తగిన ప్రణాళికలు రూపొందించిందని కేటీఆర్ చెప్పారు. దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు ప్రపంచంలోనే ఏకైక అతిపెద్ద ఫార్మా క్లస్టర్.. హైదరాబాద్ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్కును సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేశామని, ప్రపంచంలోనే అతిపెద్ద స్టెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ తయారీ యూనిట్ కూడా తెలంగాణలోనే ఉందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్‌గా మారిందన్నారు. వచ్చే సంవత్సరం నాటికి ప్రపంచంలో సగానికి పైగా వ్యాక్సిన్లు హైదరాబాద్ నగరంలోనే తయారు అవుతాయన్నారు.

పారిశ్రామిక ప్రగతితో ఆర్థిక వ్యవస్థ బలోపేతం

రాష్ట్రంలో సాధించిన పారిశ్రామిక ప్రగతి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, రియల్ ఎస్టేట్ వంటి ఇతర రంగాల బలోపేతానికి దోహదం చేసిందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోని చిన్న రాష్ట్రం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (కాళేశ్వరం)ను నిర్మించిందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు 2014లో ఉన్న పరిస్థితులు, ప్రస్తుతం ఉన్న రాష్ట్ర ప్రగతిని బేరీజు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పారిశ్రామిక రంగానికి చెందినవారు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ పాఠాలు

▶ మొదటి పేజీ తరువాయి



గోలీసోడా తాగుతున్న మంత్రి కేటీఆర్

అవార్డులు కూడా లభించాయని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. 106 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న టాయ్స్ పార్కుకు భూమి పూజ చేశారు. పార్కులో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 51 కంపెనీల ఉత్పత్తులను ప్రారంభించారు. రూ.41 కోట్లతో నిర్మించిన కామన్ ఫెసిలిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో కేటీఆర్ ప్రసంగించారు.

ఇటు పెట్టుబడులు.. అటు ఉపాధి

సింగిల్ విండో విధానంలో టీఎస్ ఐపాస్‌తో 15 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా పారిశ్రామిక అనుమతులు ఇస్తున్న రాష్ట్రం మరెక్కడా లేదని మంత్రి అన్నారు. అమెరికాలో సైతం ఈ విధానం అందుబాటులో లేదని, అక్కడి పారిశ్రామికవేత్తలు మనలను కొనియాడుతున్నారని చెప్పారు. వారి తహారం మానవ చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమం అన్నారు. గ్రీన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఒకవైపు పరిశ్రమలు పెరుగుతూ పెట్టుబడులు వస్తుంటే, మరోవైపు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

రాష్ట్రంలో అన్ని రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతోందని మంత్రి చెప్పారు. గుజరాత్ లాంటి రాష్ట్రంలో కూడా నేడు కరెంటు కోతలు ఉన్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పర్యావరణం, పారిశ్రామిక రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. ఇక్కడి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో స్థానిక యువతకు శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడి టాయ్స్ పార్కు ద్వారా రూ.190 కోట్ల పెట్టుబడి లభించడంతో పాటు 2,900 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఉద్యోగాలంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాదని, అవి జనాభాలో ఒకటి నుంచి మూడు శాతం మాత్రమే ఉంటాయని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మందికి వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.

రాష్ట్రానికి అగ్ర త్రయం!

▶ మొదటి పేజీ తరువాయి

సభకు జేపీ నడ్డా హాజరుకానున్నారు. ఈ నెలాఖరులోగా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మోదీ రోడ్‌షో, తర్వాత నల్లగొండలో బహిరంగసభ నిర్వహించే అవకాశముంది. దీనిపై రాష్ట్ర పార్టీ ప్రతిపాదనలు పంపగా, జాతీయనాయకత్వం తేదీని ఇంకా ఖరారు చేయలేదని తెలుస్తోంది.

కర్ణాటక నైరాశ్యం నుంచి బయటపడేలా...

కర్ణాటకలో బీజేపీ ఓటమి ప్రభావం తెలంగాణపై పడి ఇక్కడా కాంగ్రెస్ పుంజుకుంటోందనే వాదనను తిప్పికొట్టేందుకు మోదీ, అమిత్‌షా, నడ్డా సభలు ఉపయోగపడతాయని రాష్ట్ర నాయకులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు స్వయంగా అధినాయకత్వమే రాష్ట్రానికి వస్తుండటంతో రాష్ట్రంలో పార్టీపై మరింత ఫోకస్ పెరుగుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర పార్టీలో ఆవరించిన స్తబ్దతను బద్దలుకొట్టి అసెంబ్లీ ఎన్నికలకు చురుకుగా పనిచేసేందుకు ఈ పర్యటనలు దోహదపడతాయని, పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపుతాయని ఆశాభావంతో ఉన్నారు.

ప్రత్యామ్నాయమని చాటేందుకు...

రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా మారబోయేది బీజేపీనే అనే భావన ప్రజల్లో ఏర్పడేందుకు అగ్రనేతల పర్యటనలు దోహదపడతాయని భావిస్తున్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ద్వారా ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలు, జరిగే అభివృద్ధి గురించి అగ్రత్రయం వివరించడం ద్వారా ఓ సానుకూల ప్రచారం ప్రజల్లోకి వెళ్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. దక్షిణాదిలో అధికారంలోకి వచ్చేందుకు అన్ని అనుకూల పరిస్థితులున్న రాష్ట్రంగా తెలంగాణను జాతీయ నాయకత్వం పరిగణిస్తోంది. ఆ అవకాశం చేజారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులోభాగంగా ఇక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో అగ్రనేతలు పాల్గొనాలని జాతీయ నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెలాఖరుకు 'మహా జనసంపర్క్ అభియాన్' ముగియగానే, జూలై నుంచి మూడు, నాలుగు నెలలపాటు ఎన్నికల కార్యాచరణ ప్రణాళికను అమల్లోకి తెస్తారని భావిస్తున్నారు.

'రివర్స్ గేర్'పై కమలం పీఛేముడ్

- కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనా వైఫల్యాలపై 'రివర్స్ అటాక్'కు నో చెప్పిన పార్టీ హైకమాండ్
- ప్రధానంగా మోదీ ప్రభుత్వ విజయాలపైనే ప్రజల్లోకి వెళ్లాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ సర్కార్ 'దశాబ్ది'ఉత్సవాలకు కౌంటర్‌గా 'రివర్స్ గేర్' కార్యక్రమాలు నిర్వహించాలనే యోచనను కమలదళం విరమించుకుంది. కేసీఆర్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై రాష్ట్ర పార్టీ చేపట్టాలని భావించిన ఎదురుదాడి కార్యక్రమాలకు బీజేపీ హైకమాండ్ నో చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనపై నిర్వహిస్తున్న 'మహా జనసంపర్క్ అభియాన్'లో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలపైనే ప్రజల్లోకి వెళ్లాలని సూచించినట్టు తెలుస్తోంది. జాతీయ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 30 నుంచి జూన్ 30 దాకా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో నెగెటివ్ ప్రచారం వద్దని స్పష్టం చేసినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం 21 రోజులపాటు నిర్వహిస్తున్న అధికార కార్యక్రమాలకు వ్యతిరేకంగా కేసీఆర్ సర్కార్ తీరును 'రివర్స్ గేర్' నిరసనలతో ఎండగట్టాలని రాష్ట్ర బీజేపీ తొలుత నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే తొమ్మిదేళ్ల మోదీ పాలనపై పాజిటివ్ ప్రచారంపైనే దృష్టి కేంద్రీకరించి ప్రజల్లోకి వెళ్లాలని అధినాయకత్వం సూచించింది. దీంతో బీఆర్ఎస్‌పై రివర్స్‌గేర్ కార్యక్రమాలు రద్దయినట్టు సమాచారం. బీఆర్ఎస్, బీజేపీలు గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు ఊతమిచ్చేలా ప్రస్తుత పరిణామాలు ఉండటం పార్టీ నాయకులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని భావిస్తున్నారు. జన సంపర్క్ అభియాన్ ముగియగానే మళ్లీ కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమవుతామని పార్టీ నాయకులు చెబుతున్నారు.



వివేకంతో బతికినవాళ్లకు ఆఖరికి చావు కూడా
అంత భయపడవలసిందేమీ కాదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 7 జూన్ 2023

సమయం లేదు మిత్రమా!

ప్రపంచంలోని 175 దేశాలు... దాదాపు 1000 మంది ప్రతినిధులు... అయిదు రోజుల చర్చోప చర్చలు... ఎట్టకేలకు ప్రపంచ సమస్యకు పరిష్కారం దిశగా చిన్న ముందడుగు. మే 29 నుంచి జూన్ 2 వరకు ప్యారిస్‌లో ప్లాస్టిక్‌పై ఐరాస అంతర్ ప్రభుత్వ చర్చల సంఘం2 (ఐఎన్‌సీ–2) సమావేశంలో జరిగింది ఇదే. ప్లాస్టిక్ కాలుష్యభూతాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా విశ్వవ్యాప్త ఒప్పందానికి చిన్నగా అడుగులు పడ్డాయి. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని పారద్రోలండి' అన్నది ఈసారి ప్రధానాంశమైన ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి కొద్దిగా ముందు జరిగిన ఈ సమావేశం ఆ మేరకు ఆనందించదగ్గది. అయితే, నవంబర్‌లో నైరోబీలో జరిగే 'ఐఎన్‌సీ–3' నాటికి కేవలం ఆలోచనలు ఏకరవు పెట్టే చిత్తు ప్రతి తయారీనే ఈ సమావేశం లక్ష్యంగా పెట్టుకోవడం ఆశ్చర్యకరం. పారేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పసిఫిక్ మహాసముద్రంలో కదులుతున్న కృత్రిమ ద్వీపంలా తయారైన వేళ ఇది అతి జాప్యమే.

నిజానికి, వచ్చే 2024 చివర లోపల ప్లాస్టిక్ భూతంపై ఈ చర్చోపచర్చలు ముగించాల్సి ఉంది. అందులో భాగంగా తలపెట్టిన అయిదు సమావేశాల్లో తాజా ప్యారిస్ సమావేశం రెండోది. ఆరు నెలల క్రితం ఉరుగ్వేలో జరిగిన తొలి సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్ని దేశాలు విశ్వవ్యాప్త కార్యాచరణ కోరితే, మరికొన్ని దేశాలు జాతీయ పరిష్కారాలు కావాలన్నాయి. ఇంకొన్ని దేశాలు రెండూ కావాల్సిందే అన్నాయి. తీరా ఆరునెలల తర్వాత తాజా సమావేశంలోనూ తొలి రెండు రోజులూ ఉద్రిక్తత నడుమ వృథా అయ్యాయి. సహజంగానే ప్లాస్టిక్‌తో తమ ఆర్థిక అంశాలు ముడిపడ్డ చమురు, సహజవాయు, పాలిమర్ ఉత్పాదక దేశాలు ఏకాభిప్రాయం కుదరనివ్వక తమకు అనుకూల వాదనను ఎంచుకుంటూ, చర్చలను జాప్యం చేశాయి. ఎట్టకేలకు మూడో రోజున చర్చల రథం కొంత ముందుకు కదిలింది. ఆర్థిక ప్రయోజనాలు అర్థం చేసుకోదగినవే కానీ, వాటి కోసం ప్రపంచమే ప్రమాదంలో ఉన్నా పట్టదంటే ముమ్మాటికీ తప్పే.

మానవాళికి ప్లాస్టిక్ పెనుభూతమే. ప్రపంచంలో ఏటా 43 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తవుతోంది. అందులో సగానికి పైగా ఉత్పత్తులు పరిమిత కాలం ఆయువున్నవే. ఉత్పత్తి చేస్తున్న ప్లాస్టిక్‌లో మూడింట రెండు వంతులను వ్యర్థాలుగా పారేస్తున్నారు. పది శాతం ప్లాస్టిక్కే రీసైక్లింగ్‌కు నోచుకుంటోంది. అతి కొద్దిభాగం ప్లాస్టిక్ వ్యర్థాలనే దహనం చేస్తున్నారు. అత్యధిక భాగం భూమిలో, జలవనరుల్లో, సముద్రాల్లో చేరిపోతున్నాయి. ఇది సమస్త జీవరాశికీ ముప్పు. ఇలా పేరుకుంటున్న వ్యర్థాల పరిమాణం వచ్చే 2060కి మూడు రెట్లవుతుంది. అందులో అయిదోవంతే రీసైకిల్ చేయడానికి వీలుంటుంది. ఇక, 2019లో ప్రపంచవ్యాప్త ఉద్గారాల్లో 3 శాతం పైగా ప్లాస్టిక్ వ్యర్థాల పాపమే. ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ఈ ప్రమాదాలపై తాజాగా అప్రమత్తం చేసింది.

కొత్తగా మైక్రో ప్లాస్టిక్స్ మరో పెను ఆందోళన. చేపలు, బ్లూ వేల్ లాంటి సముద్రచరాలు రోజూ కోటి ముక్కల మైక్రో ప్లాస్టిక్‌ను పొట్టలో వేసుకుంటున్నాయి. వాటిని భుజిస్తున్న మన రక్తంలో, చనుబాలలో, చివరకు గర్భస్థ మావిలో సైతం చేరి, ఆరోగ్య సమస్యగా మారాయి. కానీ, ప్లాస్టిక్ ఉత్పత్తిని పరిమితం చేయాలంటున్న దేశాలకూ, వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తే సరి అంటున్న దేశాలకూ మధ్య భేదాభిప్రాయాలు మరోసారి ప్యారిస్ సాక్షిగా బయటపడ్డాయి. మన దేశంతో సహా సౌదీ అరేబియా, చైనా తదితర దేశాలూ నియంత్రణ చర్యలపై మెజారిటీ ఓటింగ్ కాక, ఏకాభిప్రాయం కావాలని పట్టుబట్టడం చిత్రం. లెక్కల్లో మన దేశ తలసరి ప్లాస్టిక్ వినియోగం అనేక ఇతర దేశాలతో పోలిస్తే తక్కువే. కానీ మన మొత్తం జనాభా, అన్ని కోట్లమంది అవసరాలకై ప్లాస్టిక్ ఉత్పత్తి, తత్ఫలితంగా వ్యర్థాలు మాత్రం ఎక్కువే. పైపెచ్చు, ఎప్పటికప్పుడు అది అధికమవుతోంది.

ప్లాస్టిక్ ఉత్పత్తిని నియంత్రిస్తూ, కాలుష్యాన్ని మొగ్గలోనే తుంచేసే అంతర్జాతీయ ప్లాస్టిక్ ఒడంబడిక ప్రపంచానికి ఇప్పుడు అవసరమంటున్నది అందుకే. ప్యారిస్ పరిణామాలు, అధిగమించాల్సిన అడ్డంకుల్ని చూస్తుంటే ఆ ఒడంబడిక అంత త్వరగా వచ్చేలా లేదు. ఇవాళ్టికీ సామాన్య ప్రజలు తమ జీవితంపై ప్లాస్టిక్ వ్యర్థాల ప్రభావాన్ని గుర్తించడం లేదు. ఆ వైఖరిని మార్చడం విశ్వ ఒడంబడికను మించిన సవాలు. అలాగే వచ్చే ఏడాది చివరకి అంతర్జాతీయ సమాజం కట్టుబడి ఉండే చట్టబద్ధమైన విశ్వవ్యాప్త ఒడంబడిక తెద్దామని యోచన బాగున్నా, అందుకు కట్టుబడి ఉండడం కీలకం. ఒప్పందంలోనూ శషభిషలు లేకుండా ప్లాస్టిక్‌పై కఠిన కార్యాచరణ మరీ కీలకం. అలాకాక, మునుపటి పర్యావరణ ఒప్పందాల్లా ఈ కొత్త ఒడంబడికనూ కాలయాపన వ్యవహారంగా, ధనిక దేశాలకు అనుకూలంగా మారిస్తే ఫలితం శూన్యం. వర్ధమాన దేశాలకు న్యాయం జరిగేలా చూడాలి.

ప్యారిస్ సమావేశం ప్రారంభ చర్చల వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ అన్నట్టు, ప్లాస్టిక్ కాలుష్యం ఇప్పుడు ఓ టైమ్ బాంబ్. తక్షణ చర్యలకు దిగకపోతే, పర్యావరణానికీ, జీవవైవిధ్యానికీ, యావత్ ప్రపంచ మానవాళి ఆరోగ్యానికే ప్రమాదం. దీన్ని కేవలం వ్యర్థాల నిర్వహణ అంశంగానే చూస్తే ఇబ్బందే. కేవలం రీసైక్లింగ్‌కో, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధానికో పరిమితం కాకుండా పాలు, నీళ్ళ నుంచి తిండి దాకా అన్నీ ప్యాకెట్లూ ప్లాస్టిక్‌మయమైన ఈ రోజుల్లో ప్రజల జీవన విధానాన్ని మార్పించడంపై దృష్టి పెట్టాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై త్వరపడాలి. ప్లాస్టిక్ ఉత్పత్తిదారుల పైనే బాధ్యత మోపే ఆలోచన చేయాలి. ముప్పు ముంచుకొచ్చిన వేళ ఆలసిస్తే ఆనక ఏ ఒడంబడికైనా నిరుపయోగమే. మెక్రాన్ మాటల్లోనే చెప్పాలంటే... ఆట్టే సమయం లేదు మిత్రమా!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** తిథి బ.చవితి రా.1.16 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.12.37 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.9.41 నుండి 11.11 వరకు, తిరిగి తె.4.22 నుండి 5.52 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.23 వరకు, **అమృతఘడియలు:** సా.6.34 నుండి 8.02 వరకు.

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

మన ఐఐటీలు ఆత్మహత్యా కేంద్రాలా?

టెక్నాలజీలో భారత్‌ను పటిష్ఠంగా మార్చాలన్న లక్ష్యంతో దేశంలో ఐఐటీలను నెలకొల్పారు. కానీ విదేశాల్లో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ పెరిగిన తర్వాతే నిజంగా వీటి వైపు చూడటం మొదలైంది. దాంతో వీటిలో సీటు సంపాదించడమే లక్ష్యంగా కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇక్కడి చదువుల ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఒకటైతే; ఐఐటీల్లో చేరాక అక్కడి పోటీని తట్టుకోలేక తీవ్ర చర్యకు విద్యార్థులు దిగడం మరొకటి. ప్రొఫెసర్ల నిరంకుశ విధానాలు విద్యార్థుల మీద విపరీత ఒత్తిడిని పెంచుతున్నాయి. విద్యార్థులను దేశం ఆధారపడగల సమర్థ ఇంజనీర్లుగా, సాంకేతిక నిపుణులుగా మలచడానికి బదులుగా... విద్యా కర్మాగారాలుగా ఐఐటీలను మార్చడమే ప్రొఫెసర్ల ప్రాథమిక లక్ష్యంగా ఉంటున్నట్లు కనిపిస్తుంది.

జవహర్‌లాల్ నెహ్రూ 1950లలో దేశంలో మొట్టమొదటి ఐఐటీని ఖరగ్‌పూర్‌లో నెలకొల్పారు. బోస్టన్‌లోని ఎమ్ఐటీ ప్రమాణాలకు అనుగుణంగా మన ఇంజినీరింగ్, టెక్నాలజీలను ప్రభావితం చేయడమే దీని లక్ష్యం. అయితే అమెరికా, యూరప్‌లలో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలకు ఉన్నట్లుండి డిమాండ్ పెరిగిన నేపథ్యంలోనే 1995 ప్రాంతంలో ఐఐటీలకు నిజమైన డిమాండ్ పెరిగింది. తదనుగుణంగా అనేక ఐఐటీలను ప్రారంభించారు. ఇప్పుడు దేశంలోని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐటీ, ఒక ఎన్ఐటీ ఉంటున్నాయి. రానురానూ డిమాండ్ పెరుగుతుండటంతో, మూడు ప్రవేశ పరీక్షలతో కూడిన సంక్లిష్ట ప్రక్రియను ఐఐటీలు ప్రవేశపెట్టాయి. జేఈఈ–1(నవంబర్/డిసెంబర్), జేఈఈ–2 (ఫిబ్రవరి), జేఈఈ–అడ్వాన్స్‌డ్ (జూన్). ఇంటర్ సిలబస్ పూర్తి కావడానికి ముందే తొలి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారన్నది స్పష్టం. సిలబస్ బీఎస్సీ సెకండ్ ఇయర్ స్థాయిలో ఉంటుంది. అంటే ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో చేరాలని విద్యార్థులకు ఇది స్పష్టమైన సంకేతం.

అందుకనే, ఇంటర్మీడియట్ గొలుసుకట్టు/కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలలు దేశమంతటా, ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇక్కడ చదువుకు అనుగుణమైన వాతావరణం ఉండదు. చిన్న నిద్రించే గదులుంటాయి, క్రీడలకు చోటుండదు, బయటి ప్రపంచంతో సంబంధాలుండవు. ఐఐటీలో సీటు కొడతారని, కోట్లాది రూపాయల వేతనాన్ని ఆర్జిస్తారని తల్లిదండ్రులు తమ పిల్లలను వీటిలో చేర్పిస్తారు. మరోవైపున క్రూరమైన టీచర్లు అవకాశం దొరికినప్పడల్లా విద్యార్థులను బాదివడేస్తుంటారు. నిలబెట్టి మరీ అవమానిస్తుంటారు. ఆత్మహత్యకు పాల్పడటం కంటే ఎలాంటి అవకాశాలు విద్యార్థులకు ఉండటం లేదు. మానసిక కౌన్సెలింగ్ గురించి వారికి ఏమీ తెలీదు. టీచర్లు, వార్డెన్ల భౌతిక క్రూరత్వం, ఒక టీచర్ నిర్దాక్షిణ్యంగా బాదినప్పుడు తీవ్రంగా బాధపడిన డేవిడ్ కాపర్‌ఫీల్డ్‌ను గుర్తుకు తెస్తుంది. (1850లలో చార్లెస్ డికెన్స్ ఇదే పేరుతో రాసిన నవల ఇది). 2020లలో కూడా ఇలాంటి ఉదంతాలకు మనం సాక్షీభూతంగా ఉండటం దురదృష్టకరం.

2022 జనవరి 1 నుండి 2023 మార్చి వరకు 12 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యల పాలబడటం ఆందోళనకరమైన వాస్తవం. తాజాగా 2023 మార్చి 1న హైదరాబాద్ నగరంలోని రెసిడెన్షియల్ కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులకు ఒక బలమైన సలహా ఏమిటంటే, పిల్లలు గణితంలో మెరుగ్గా ఉంటేనే జేఈఈ రెసిడెన్షియల్ కాలేజీలను ఎంచుకోవాలి.

2022 నాటికి, ఐఐటీ–జేఈఈ కోసం 11 నుండి 12 లక్షల మంది నమోదు చేసుకున్నారు. వీరిలో 2.7 శాతం మాత్రమే దేశంలోని100 కేంద్ర విద్యా సంస్థల్లో చేరగలరు. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రఖ్యాత ఇంజినీరింగ్ కళాశాలల వంటి విద్యాసం



స్థలను, విద్యార్థుల ఆత్మహత్యలనే తరంగం వేధిస్తోంది. పరీక్షా వైఫల్యాలు, విద్యాపరమైన ఒత్తిడి, కులం, పట్టణ–గ్రామీణ, ధనిక–పేద, ఆంగ్ల నైపుణ్యం వంటి వివిధ కారణాలు ప్రకాశవంతమైన యువ మనస్సులను తీవ్రమైన చర్యలను ఆశ్రయించడానికి కారణమవుతున్నాయి. 2018 నుంచి 2022 మధ్యకాలంలో కేంద్రీయ విద్యాసంస్థలైన ఐఐటీల్లో 33 మంది, ఎన్ఐటీల్లో 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని రాజ్యసభలో విద్యా మంత్రి పేర్కొన్నారు.

అనేక ఐఐటీలలో, ఒక సాపేక్ష గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఇందులో ఒక వ్యక్తి పనితీరును ఇతర ప్రకాశవంతమైన సహ విద్యార్థులతో పోల్చి కొలుస్తారు. దురదృష్టవశాత్తూ, ఈ వ్యవస్థ ఆచార్యులకు అపారమైన అధికారాన్ని కల్పిస్తుంది. వారు నిర్మాణాత్మక బోధన, పరిశోధనల కంటే తరచుగా వారి వ్యక్తిగత ప్రాధాన్యతలకు చోటిస్తారు. విద్యార్థులు ఈ సాపేక్ష గ్రేడింగ్ విధానం ఆధారంగా ఉన్నత ర్యాంకుల కోసం పోటీపడుతున్నందున, విద్యాపరంగా, వ్యక్తిగతంగా ప్రత్యర్థులుగా మారతారు. తమ సొంత గ్రేడ్లకు హాని కలిగిస్తారనే భయంతో విద్యార్థులు ఎలా కట్–థ్రోట్ కాంపిటీషన్లో పాల్గొంటున్నారు, నోట్సును ఎవరికీ చూపకుండా ఎలా దాచిపెట్టుకుంటున్నారు, ఒకరికొకరు సహకరించుకోవడానికి ఎలా నిరాకరిస్తున్నారు అనే అంశాలు దిగ్భ్రాంతికరమైన వివరాలు చెబుతున్నాయి.

ఐఐటీల్లోని ప్రొఫెసర్లు తరచుగా తమను తాము క్రమశిక్షణకు సంరక్షకులుగానూ, సైన్స్ అండ్ టెక్నాలజీకి స్వయంప్రకటిత కర్తలుగానూ భావిస్తారు. వాస్తవానికి ఐఐటీలలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన లేదా పరిశోధన, అత్యాధునిక పురోగతి విషయంలో గణనీయమైన కృషి చేసిన ప్రొఫెసర్లు చాలామంది లేరని తెలుసుకోవడం నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థులను దేశం ఆధారపడగల సమర్థ ఇంజనీర్లుగా, సాంకేతిక నిపుణులుగా మల్చడానికి బదులుగా... విద్యా కర్మాగారాలుగా ఐఐటీలను మార్చడమే ప్రొఫెసర్ల ప్రాథమిక లక్ష్యంగా ఉంటున్నట్లు కనిపిస్తుంది. అకడమిక్ లిటరేచర్ని, ర్యాంకింగులను నిశితంగా పరిశీలిస్తే, ఐఐటీలలోని పరిశోధనా ఫలితాలు పాశ్చాత్య దేశాలతో సమానంగా లేవని తెలుస్తుంది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సర్వేలోని టాప్ 200 ర్యాంకులలో ఏ ఒక్క ప్రధాన ఐఐటీ కనిపించలేదు.

సాహా, పీసీ రే, ఎస్.ఎన్.బోస్, విశ్వేశ్వరయ్య, కెఎల్. రావు, రామన్, కృష్ణన్, హోమీ భాభా వంటి గొప్ప శాస్త్రవేత్తలతో పోల్చదగినవారిని ఎంతమందిని స్వతంత్ర భారతదేశంలో మనం తయారు చేశాం? హైడల్ పవర్ ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్‌తో సహా మన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ఇప్పటికీ గ్లోబల్ టెండర్లపైనే ఆధారపడతాము. నౌకలను మరమ్మతు చేయడానికి కూడా మనవద్ద సాంకేతికత లేనందున రష్యాపై ఆధారపడుతున్నాము. ఆంధ్ర ప్రదేశ్‌లోని కోనసీమ సహజ వాయువు పైప్‌లైన్ 20 రోజులు నిరంతరం మంటలతో ప్రజ్వలించినప్పుడు, వాటిని ఆర్పడానికి కూడా మనం నీల్ ఆడమ్స్‌ను విదేశాల నుండి రప్పించాల్సి వచ్చింది.

ఐఐటీల్లో ఆత్మహత్యలు, ఒత్తిడి లేకుండా సమగ్ర మూల్యాంకనాన్ని నిర్ధారించడానికీ, ఐఐటీలలోని విద్యా, సామాజిక వాతావరణాన్ని పరిశోధించడానికీ 'అంబుడ్స్‌మన్ రకం' వ్యవస్థను నియమించాలి. నియమాలు, అకడమిక్ గ్రేడింగ్ విధానాలను అన్ని ఐఐటీలలో ప్రామాణీకరించాలి. ఐఐటీ చార్టర్లలో నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరుతున్నాయో లేదో తెలుసుకోవడానికి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలి. మనం తరచుగా వార్తాపత్రికలలో ఐఐటీల పరిశోధనా నివేదికలను చూస్తాము. ఇవి తరచుగా 'తదుపరి అధ్యయనాలు అవసరం' అని ముగుస్తుంటాయి.

ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యల ప్రాబల్యం ఒక బాధాకరమైన సమస్య. ఈ ఆత్మహత్యల వల్ల అంతర్జాతీయ విద్యా సంస్థలు, యాజమాన్యాల ముందు మన భారతీయ ప్రతిష్ఠ పలుచబారుతుంది. చివరగా, ఐఐటీలలో చేరే ప్రవేశ ప్రక్రియను వికేంద్రీకరించాలని సూచిస్తున్నాం. ప్రతి రాష్ట్రం ఒక ప్రవేశ బోర్డును కలిగి ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు, ప్రైవేట్ లేదా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆత్మహత్యలు లేవని గుర్తుంచుకోవాలి. ఈ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల నుండి లక్షలాది మంది విద్యార్థులు భారతదేశంలోనూ, విదేశాల్లోనూ కంప్యూటర్ ఆధారిత కంపెనీలలో ఉద్యోగాలు పొందుతున్నారు. ఐఐటీ డిగ్రీ లేకపోయినా జీవితం ఉంది. టెక్నాలజీలో భారత్‌ను పటిష్ఠంగా మార్చాలన్న నెహ్రూ ఆశయం సమీప భవిష్యత్తులో నెరవేరుతుందా? నూతన విద్యా విధానం(ఎన్ఈపీ–2020) ఈ అంశాలను పరిశీలించాలి.

డాక్టర్ కె. నాగయ్య, చీఫ్ సైంటిస్ట్, సీఎస్ఐఆర్–ఐఐసీటీ, హైదరాబాద్; ప్రొ॥ జి. శ్రీమన్నారాయణ, రిటైర్డ్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ విభాగం, ఉస్మానియా; ఫణిరాజ్ జి., ఐటీ ప్రొఫెషనల్, అమెరికా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సరైన మాట



ప్రతిదానికీ సరైన ప్రదేశం, సరైన సమయం అనేవి ఉంటాయి, ఆఖరికి సరైన పనికి కూడా! ఇది అర్థం కానివాళ్లు రాజకీయ నాయకులు కాలేరు. ఇది అర్థం కానివాళ్లను ఎదిగిన మనిషి అనలేం.

– అమిత్ మాలవీయ, కాలమిస్ట్

పసిగట్టే పాత్ర



బ్రిటిష్ మిస్టరీ రచనల్లో ఎప్పుడూ కుక్కను నడిపించుకుంటూ వెళ్తున్న వ్యక్తి అక్కడొక శవం ఉందని గుర్తిస్తుంటాడు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

మీ నుంచే మొదలవ్వాలి



'నేను వార్తాపత్రికలు చదవను; నేను పుస్తకాలు చదవను' అని చెప్పే జనాలే తమ పిల్లలు కచ్చితంగా చదవాలని కోరుకుంటారు. కానీ నియమం స్పష్టంగా ఉంది: మీ పిల్లలు మంచి పాఠకులు కావాలని అనుకుంటే, ముందు మీరు చదవాలి.

– వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

విధానపరమైనది...



నేను రోజుకోసారైనా జగన్నాథుడిని ప్రార్థిస్తాను. స్వీడన్‌లో 32 ఏళ్లుగా ఉంటున్నప్పటికీ బీఫ్ తినలేదు. అయినా నన్ను కొందరు పిచ్చివాళ్లు హిందూ వ్యతిరేకిని అంటున్నారు.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

చెత్త శిఖరం



ఎవరెస్ట్ శిఖరం వేగంగా చెత్తకుప్పలా మారుతోంది. రెండు వారాల వ్యవధిలో 900కి పైగా జనం శిఖరాన్ని చేరడానికి ప్రయత్నించి రద్దీ పెంచడంతో 2023 చరిత్రలో ఒక భయానకమైన సీజన్‌గా మిగిలిపోయింది. అలాగే ఇది భారీ వ్యాపారంగానూ మారిపోయింది.

– జో పాంప్లియానో, క్రీడా విశ్లేషకుడు

ప్రకృతి నియమం



మగవాడు జన్మనివ్వలేడనీ, స్త్రీకి పురుషాంగం ఉండదనీ అనడంలో ద్వేషం ఎంత మాత్రమూ లేదు. మన అభిప్రాయం పొలిటికల్లీ కరెక్ట్ అయినా, కాకపోయినా ఇదే సత్యం. మనం జనాన్ని దయతో, గౌరవంతో చూడాలి; అంతమాత్రాన దానికోసం శాస్త్రీయ వాస్తవాన్ని బలిపెట్ట కూడదు.

– కరోల్ సైకోరా, ఆంకాలజిస్ట్

మౌన నాయకుడు



ఒడిశా రైలు ప్రమాదానికి సంబంధించి ఒక మనిషిని అభినందించాలి. ఆయన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్. 'పీఆర్', 'ఫొటో ఆప్'లను పట్టించుకోకుండా మౌనంగా తన పనిచేసుకుంటూ పోయారు; గాయపడిన ప్రయాణికులకు, సహాయక బృందాలకు ఇవ్వాల్సిన మద్దతు ఇచ్చారు. అది మంచి నాయకుడికి సంకేతం.

– జాయ్‌దాస్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

ఆ దేశం మీద జాలిపడు!

ఏ దేశ ప్రజలు గొర్రెల్లా ఉంటారో/ ఆ జాతిని చూసి జాలిపడు
ఏ గొర్రెల కాపరులు వారిని తప్పుదారి పట్టిస్తారో
ఆ దేశపు బూటకపు నాయకత్వాన్ని చూసి జాలిపడు
ఏ దేశ మేధావులు నోరు విప్పరో/ఏ సద్గుణ సంపన్నులు గాలి కబుర్లతో
గాలితో యుద్ధాలు చేస్తుంటారో/ వారినందరినీ చూసి జాలిపడు
అవసరమైనప్పుడైనా గొంతెత్తలేని/జాతి జనుల చూసి జాలిపడు
దాడులు చేసే వారిని పొగడుతూ ఉండడం
హింసిస్తూ, ప్రపంచాన్ని బలవంతంగా
పాలించాలనుకునే ఆంబోతుల్ని – హీరోలనుకుని,
భజనలు చేస్తున్న భక్తుల్ని చూసి జాలిపడు –
తమ భాష తమదే తప్ప, మరో భాష అర్థం చేసుకోలేని
అవివేకులను చూసి జాలిపడు
తమ సంస్కృతీ సంప్రదాయాలు తమవే తప్ప,
ఇంకా వేరేవి కూడా ఉంటాయని
తెలుసుకోలేని మూర్ఖుల్ని చూసి జాలిపడు
డబ్బే ఊపిరిగా బతికే వారిని చూసి జాలిపడు
బాగా మెక్కి నిద్రిస్తున్న వారిని ఇంకా నిద్ర బుచ్చుతున్న
కాపలాదారుల కపటత్వాన్ని చూసి జాలిపడు
హక్కుల్ని, బాధ్యతల్ని గాలికి వదిలేసే దేశ ప్రజల్నీ...
వారి దేశాన్నీ... చూసి జాలిపడు!
తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కొట్టుకుపోతున్నా,
మిన్నకుండే వానపాము మనస్తత్వాన్ని చూసి జాలిపడు
స్వేచ్ఛాలోచనతో తలెత్తుకుని సగర్వంగా బతికిన
ఓ నా ప్రియమైన దేశమా? నువ్విప్పుడు నిరంతరం
కన్నీళ్ళెందుకు కారుస్తున్నావ్?

– డాక్టర్ దేవరాజు మహారాజు
(ఖలీల్ జీబ్రాన్ భావానికి కవితా రూపం ఇచ్చింది అమెరికన్ కవి లారెన్స్ ఫెర్లింగెట్టి)

ఏం ఒరగబెట్టిండ్రని ఈ సంబురాలు!

అభిప్రాయం



బండి సంజయ్‌కుమార్

ఇటలీ నగరం తగలబడుతుంటే రోమ్ చక్రవర్తి తనకు ఇష్టమైన ఫిడేల్ వాయించుకుంటూ సంబురాలు చేసుకున్నాడట. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తీరు కూడా సరిగ్గా ఇట్లనే ఉంది. ఆయన పాలనలో సబ్బండ వర్గాలు అల్లాడుతున్నయ్. మరి ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాల పేరుతో 21 రోజుల సంబురాలు జరుపుతున్నారో ఏలిన వారే చెప్పాలి.

అనేక సమస్యలతో అన్నదాతలు వడ్ల కుప్పలపై పడి చచ్చిపోతుంటే ఆదుకోవాలనే కనీస సోయి లేని పాలకులు ఏ ముఖం పెట్టుకుని రైతు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలి. 15 లక్షల మంది కౌలు రైతులకు పైసా ఇవ్వరు కానీ... వందల ఎకరాలున్న భూస్వామికి, సాగంటే తెలియని కామందుకు ఏటా లక్షల రూపాయలు సాయపడడమే రైతు సంక్షేమమా? ఉచిత కరెంట్ ఇస్తూ డిస్కంలను వేల కోట్ల రూపాయల నష్టాల్లో ముంచడమే విద్యుత్ రంగంలో సాధించిన అద్భుత ప్రగతి అవుతుందా? ఉమ్మడి పాలనలో కొనసాగిన వేలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది ఉద్యోగులు ఎందుకు రోడ్డున పడ్డారో చెప్పకుండా దాచిపెట్టడమే పారిశ్రామిక ప్రగతి అవుతుందా?

హైదరాబాద్ జంట జలాశయాల ఉనికికే ప్రమాదం తెచ్చేలా 111 జీవోను రద్దు చేసినందుకు నీళ్ల పండుగ చేసుకోవాలా? 'మిషన్ కాకతీయ' పేరుతో తట్ట మట్టి తీయకుండానే 20 వేలకుపైగా చెరువులను పునరుద్ధరించామంటూ రూ. 5 వేల కోట్లు ఖర్చు చేసినందుకు నీళ్ల సంబురాలు చేసుకోవాలా? 'మిషన్ భగీరథ' పేరుతో రూ. 40 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసినా నేటికీ వందల గ్రామాలకూ మంచినీళ్లు రాక ఆడబిడ్డలు బిందెలు పట్టుకుని కిలోమీటర్లు నడిచి వెళ్లే పరిస్థితి ఎందుకొచ్చింది?

'పోడు పట్టాల' పేరుతో పూటకో హామీ ఇస్తూ అమాయక గిరిజనులు, ఫారెస్ట్ ఆఫీసర్లు ఒకరినొకరు తన్నుకుని చచ్చేలా చేయడమే గిరిజన సంక్షేమమా?



ఉమ్మడి పాలనలో అపర సంజీవినిలా ఉన్న 'ఆరోగ్య శ్రీ'ని బకాయిలు చెల్లించకుండా కొండలా పేర్చి పేదలను వైద్యానికి దూరం చేయడమే వైద్య రంగంలో కేసీఆర్ సాధించిన అద్భుత ప్రగతికి నిదర్శనమా?

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ శిథిలావస్థకు చేరిందనీ, 29 వేల బడుల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారిందనీ నివేదికలు ఘోషిస్తున్నాయి. చిన్నారులు మూత్రానికి వెళ్లడానికి టాయిలెట్లు లేక అల్లాడుతున్నారు. చివరకు చాక్‌పీసులకు కూడా పైసలివ్వడం లేదు. రేపటి భావి భారత పౌరులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చే బహుమతి ఇదే అనుకోవాలా?

తెలంగాణ ఉద్యమానికి ఆయువుపట్టు, చైతన్యానికి ప్రతీకగా మారిన 'ఆట–పాట'ను కేసీఆర్ తన కుర్చీకి కట్టేసుకుని, ఆయన గొప్పలను కీర్తిస్తూ అష్టావధానం చేస్తున్న వారికోసమే సాహితీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారా? ప్రశ్నించే గొంతులను లాఠీలతో కుళ్లపొడుస్తున్నందుకు, ప్రజల కోసం ఉద్యమాలు చేసే వాళ్లను బెదిరిస్తూ కేసులు పెడుతున్నందుకు 'సురక్షా రన్' చేస్తున్నారా?

వేలాది జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా దాచిపెట్టడమే సుపరిపాలనకు నిదర్శనమా? అమరుల త్యాగాలతో సిద్ధించిన తెలంగాణ నలుగురి భోగాలకే పరిమితమై ఆ అమరులనే విస్మరించే స్థితి దాపురించినందుకు 'అమరుల సంస్మరణ దినం' జరుపుకోవాలా? ఉద్యమ ద్రోహుల్ని సంకనేసుకుని దోపిడీ దారులను కేబినెట్‌లోకి తీసుకుని ఉద్యమకారులను పొగబెట్టి బయటకు పంపించేసిన పాలనా చాతుర్యానికి కేసీఆర్‌ను 'స్మరించు'కోవాల్సిందే.

చివరగా ఒక్కమాట... తన ఏలుబడి గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో అందరికంటే ముందే అర్థం చేసుకున్న గొప్ప దయార్ద్రహృదయులు కేసీఆర్. అందుకే టీఆర్ఎస్ పేగు బంధానికి గుర్తు అని తాను చెప్పుకునే 'తెలంగాణ' పదాన్ని తొలగించుకుని బీఆర్ఎస్ పేరుతో ఆ పేగు బంధాన్ని తెంచుకున్నరు. తెలంగాణకు ఇక ఆయన అవసరం లేదు. అందుకే 4 కోట్ల ప్రజల తరఫున చెబుతున్నా... 'సాలు దొర – సెలవు దొర!'

వ్యాసకర్త ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు

వినయపిటకం

త్రిపిటకాల్లో మొదటిది వినయపిటకం. బౌద్ధ భిక్షువుల, భిక్షుణుల ప్రవర్తనా నియమావళిని ఈ గ్రంథం నిర్దేశిస్తుంది. సంఘం ఏర్పడిన కొత్తలో ఎలాంటి నియమావళి అవసరం లేకపోయింది. అప్పటి వారంతా నీతి నియమాలతో వుంటూ, బుద్ధుడంటే శ్రద్ధాభక్తులు కలిగి అతడి ఆదేశాలను తు.చ. తప్పకుండ ఆచరించేవారు. తరువాత్తరువాత సంఘంలో అసాంఘిక శక్తులు చొరబడటం మొదలైంది. అలాంటి వారిని అదుపు జేయటానికి సమగ్రమైన నియమావళిని రూపొందించటం జరిగింది. హత్య, దొంగతనం వంటి పెద్ద తప్పిదాలకు సంఘ బహిష్కరణ శిక్షగా వుండేది. అబద్ధం చెప్పటం లాంటి చిన్న తప్పులకు, ఆ తప్పు ఒప్పుకుంటే సరిపోయేది.

భిక్షుణుల సంఘప్రవేశం గురించి, వారికి సంబంధించిన ప్రవర్తనా నియమావళి ఏర్పరచటం గురించి ఆసక్తికరమైన సంఘటన ఒకటి వున్నది. బుద్ధుడికి జ్ఞానోదయం అయి నాలుగేళ్ళు అయింది. తండ్రి శుద్ధోదనుడు రోగంతో మంచం మీద వుండి కొడుకుని చూడాలి రమ్మని కబురు చేశాడు. తండ్రి కోరిక ప్రకారం బుద్ధుడు కపిలవస్తుకు వచ్చాడు. తల్లిలేని బుద్ధుణ్ణి చిన్నప్పుడు కన్నతల్లిలా సాకిన మహాప్రజాపతి బుద్ధుణ్ణి అడుగుతుంది తనను భిక్షుణిగా సంఘంలో జేర్చుకొమ్మని. బుద్ధుడు అంగీకారం తెలపడు. తండ్రి చనిపోయాక బుద్ధుడు తిరిగి వైశాలి వచ్చాడు. పట్టువీడని మహాప్రజాపతి జుట్టు కత్తిరించుకొని, కాషాయబట్టలు కట్టుకొని 500 మంది శాక్య స్త్రీలను వెంట బెట్టుకోని కాలినడకన, కపిలవస్తు నుండి వైశాలికి బుద్ధుడు విడిది చేసిన చోటుకు వచ్చి చేరింది. ఆనందుడు వీళ్ళను చూశాడు. దయతో అతడి గుండె కరిగిపోయింది. అప్పుడు ఆనందుడు అడుగుతాడు, స్త్రీలకు నిర్వాణస్థితిని పొందే సామర్థ్యం లేదా? అని. స్త్రీలకు ఆ సామర్థ్యం ఉన్నదంటాడు బుద్ధుడు. అలాగయితే, మహాప్రజాపతి కోరికను మన్నించి భిక్షుణులుగా సంఘంలో వారికి స్థానం ఇవ్వమంటాడు. ఆ విధంగా భిక్షుణీ సంఘం ఏర్పడటం, వినయ పిటకంలో వారికి సంబంధించిన ప్రవర్తనా నియమావళి చేర్చటం జరిగింది.



జ్యోతిర్మయం

– దీవి సుబ్బారావు



బావిలో భారీ కొండచిలువ

శాయంపేట: మంచినీటి బావిలో భారీ కొండచిలువ కనిపించడంతో నీటి కోసం వచ్చిన మహిళలు హడలిపోయారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. రోజు మాదిరిగానే ఉదయం తాగునీటిని తెచ్చుకోవడానికి మంచినీటి బావి వద్దకు వెళ్లి మహిళలకు అందులో అతిపెద్ద కొండచిలువ కనిపించింది. దీంతో మహిళలు భయభ్రాంతులై కేకలు వేయడంతో స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి చేరుకుని అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు మూడున్నర మీటర్ల పొడవున్న కొండచిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు.

బీసీ బంధు ప్రవేశపెట్టకపోతే భారీ మూల్యం

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య హెచ్చరిక



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్టు 'బీసీ బంధు పథకం'ప్రవేశపెట్టి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయకపోతే, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, అంజి, రామకృష్ణ, రామకోటి, సతీష్, జగన్ యాదవ్, రాందేవ్, భాస్కర్, బలరామ్‌లతో కూడిన ప్రతినిధి బృందంతో ఆర్.కృష్ణయ్య కలిశారు. ఆయనకు బీసీ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ వృత్తి కులాలకు రూ.లక్ష పథకాన్ని కేవలం 6 కులాలకే పరిమితం చేయకుండా.. 130 బీసీ కులాలకు వర్తింపజేయాలని కోరారు. జూన్‌లోగా అబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ప్రతి బీసీ కులస్తునికి రూ.లక్ష స్కీమ్ ఇవ్వడంపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని, పథకాన్ని వెంటనే అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

తెలంగాణ వర్సిటీలో విజి'లెన్స్'

అధికారుల విస్తృత తనిఖీలు

- తెలంగాణ వర్సిటీ వీసీ పీఏ నుంచి ఫైళ్లు స్వాధీనం
- సోదాలు జరుగుతుండగా ఫైళ్లతో కారులో వెళ్లిన వీసీ



తెలంగాణ వర్సిటీ నుంచి ఫైళ్లు తీసుకెళ్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ /భిక్కనూరు (కామారెడ్డి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్స్‌లర్ రవీందర్ గుప్తా, ప్రొఫెసర్ కనకయ్య హయాంలో జరిగిన అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం, విచ్చలవిడి కొనుగోళ్లు తదితరాల నేపథ్యంలో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీలు చేపట్టింది. రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు బృందాలుగా విడిపోయి వర్సిటీలోని ఎస్టేట్ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, రిజిస్ట్రార్ ఆఫీస్, పర్చేజ్ కమిటీ, సర్వర్ రూమ్‌లలో విస్తృత సోదాలు చేశారు. వీటికి సంబంధించిన రికార్డులు, సీపీయూలు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఈ సోదాలు చేశారు. బుధవారం సైతం ఈ సోదాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

వీసీ వెంటపడి వెళ్లిన విజిలెన్స్ అధికారులు

ఇదిలా ఉండగా అధికారులు తనిఖీలు ప్రారంభించిన 30 నిమిషాల తరువాత వర్సిటీలో తన చాంబర్‌లో ఉన్న వీసీ రవీందర్‌గుప్తా తన పీఏ ద్వారా కొన్ని ఫైల్స్ తెప్పించుకుని కారులో పెట్టుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. దీంతో ఒక బృందం వీసీ కారును వెంబడించి కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. వాహనంలో ఉన్న వీసీ వద్దకు విజిలెన్స్ అధికారులు వెళ్లగా తన వాహనాన్ని ఎందుకు నిలిపారని, తనను ప్రశ్నించే అధికారం మీకు ఉందా అని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. దీంతో విజిలెన్స్ అధికారులు వీసీ పీఏ సవితతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

టోల్‌ప్లాజా వద్ద విచారణ 'సీన్'

టోల్‌ప్లాజా కార్యాలయం గదిలో గంటకు పైగా ఆమె వద్ద ఉన్న ఫైళ్లను పరిశీలించారు. కొన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సవిత వద్ద ఫైళ్లను పరిశీలించినంత సేపూ వీసీ రవీందర్ గుప్తా తన వాహనంలోనే కూర్చున్నారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు.

బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలిస్తాం: అదనపు ఎస్పీ ఎం శ్రీనివాసరావు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రికార్డులు స్వాధీనం చేసుకున్నామని, బ్యాంకు స్టేట్‌మెంట్లు పరిశీలిస్తామన్నారు.

పూర్తి కాని కొనుగోళ్లు.. ఆందోళనలో రైతన్నలు

- ఏడువేల కొనుగోలు కేంద్రాల్లో మూడువేలు మూసివేత
- ఇంకా చాలా జిల్లాల్లో చివరి దశలో కొనుగోళ్లు
- 57 లక్షల ఎంటీల ధాన్యం సేకరణ.. మరో 4.55 లక్షల ఎంటీల సేకరణ లక్ష్యం
- సమీపిస్తున్న రుతుపవనాలు, మొదలైన ఏరువాక



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం తలపెట్టిన ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తి కాకపోవడం రైతులను కలవరపెడుతోంది. చాలా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుకాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. ఓవైపు రుతుపవనాలు సమీపిస్తుండటం, రబీ సీజన్ మొదలవుతుండటం.. ఇంకోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇంకా అమ్ముడుపోకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు.. మిల్లర్లు కుమ్మక్కై, చాలాచోట్ల క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు కోత పెడుతున్నారు. అయినా సరే రైతులు కోతలకు సమ్మతించినా.. మిల్లర్లు చాలా చోట్ల కొర్రీలు పెడుతుండటం, ధాన్యాన్ని మిల్లుల్లో దింపకుండా అలాగే ఉంచడంతో లారీలు కొనుగోలు కేంద్రాలకు సరిగా వెళ్లడం లేదు. దీంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొంటోంది.

మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల దూరంలో..

ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 62.16 లక్షల మెట్రిక్ టన్నుల (ఎంటీలు) ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 7,192 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జూన్ 6 నాటికి అందులో 3,181 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. కానీ, మధ్యలో మిల్లర్ల కొర్రీలు, అకాల వర్షాలు, లారీల కొరత తదితర కారణాల వల్ల ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు 57.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, మరో 4.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన ధాన్యం విలువ రూ.11,843 కోట్లుగా ఉంది.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

ఏరువాక ఉత్సవాలతో రబీ సీజన్ మొదలైంది. ఈసారి రబీని నవంబరు నాటికి పూర్తి చేసి, యాసంగి పంట కోతలను మార్చి నాటికి ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి వేసవిలో అకాల వర్షాలు రైతులకు గత వందేళ్లలో ఏనాడూ చూడని నష్టాన్ని కలగజేశాయి. దీనికి తోడు వేసవిలో కోతలు ఏప్రిల్ వరకు సాగితే, వరి నుంచి మర ఆడిస్తే నూక అధికంగా వస్తుంది. ఈ సమస్యలను అధిగమించి మార్చి నాటికి కోతలను ముగిస్తే.. రైతుకు ప్రకృతి విపత్తులు, నూకల బెడద తప్పుతుందన్నది ప్రభుత్వ వ్యూహం. కానీ, కొనుగోళ్ల ప్రక్రియ జాప్యమవడంతో రబీ, యాసంగి సీజన్ల పంట ఆలస్యమయ్యే ప్రమాదముందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజుల్లో పూర్తి



మరో మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం. ఎక్కడా రైతులకు ఇబ్బంది రానీయం. 95% ధాన్యం కొనుగోలు చేశాం. త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమవుతాయి.

–మంత్రి గంగుల కమలాకర్

కొనుగోళ్ల వేగం పెంచాం



రాష్ట్రంలో కొనుగోళ్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. మంగళవారం ఒక్క రోజే 1,31,703 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడమే ఇందుకు నిదర్శనం. అకాల వర్షాలు, సాంకేతిక సమస్యల కారణంగా కొంచెం జాప్యమైన మాట వాస్తవమే. రెండు మూడు రోజుల్లో మిగిలిన 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సైతం కొనేస్తాం.

–సర్దార్ రవీందర్ సింగ్, పౌరసరఫరాల శాఖ, చైర్మన్

కాంటా వేసి పదిహేను రోజులు



కొనుగోలు కేంద్రంలో 400 బస్తాలు కాంటా వేసి, 15 రోజులైతంది. లారీలు రాకపోవడంతో, బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. వానలు పడుతుండటంతో తడుస్తయేమో అని భయంగా ఉంది. బస్తాలు తడవకుండా కవర్లు కప్పి ఉంచిన. ఇక్కడే కాపలా ఉంటున్న. లారీలు పంపి బస్తాలను మిల్లులకు తీసుకుపోవాలి.

–కొట్టె అంజన్న, తాళ్లపేట, దండేపల్లి మండలం మంచిర్యాల

నెలరోజులు గడుస్తున్నా..



గాధిర్యాల్ కేంద్రంలో ధాన్యం సేకరణ ఆలస్యంగా జరుగుతోంది. ధాన్యాన్ని కేంద్రానికి తెచ్చి నెల రోజులు దాటినా తూకం వేయలేదు. దీంతో నిత్యం వానలతో అవస్థలు పడుతున్నాం. రోజుకింత తడిసినప్పుడల్లా ధాన్యం మొలకెత్తుతోంది. 400 బస్తాల వరకు ధాన్యం ఉంది. ఇప్పటికైనా త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలి.

–కుర్వ భీరతయ్య, రైతు గాధిర్యాల్, మహబూబ్‌నగర్

పంట నష్టపరిహారానికి రూ. 230 కోట్లు

- రెండో విడత విపత్తులో 2.30 లక్షల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం
- వ్యవసాయ శాఖ తుది నివేదిక
- త్వరలో రైతుల ఖాతాలో జమ చేసేందుకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: గత ఏప్రిల్ నెలలో రెండో విడత వడగళ్లు, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టానికి రైతులకు రూ. 230 కోట్లు పరిహారంగా ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. వివిధ జిల్లాల్లో 2.30 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నిర్ధారించి, ప్రభుత్వానికి వ్యవసాయశాఖ తుది నివేదిక ఇచ్చింది. నిధులను త్వరలో విడుదల చేసి రైతులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి.

మొదటి విడతలో రూ. 151 కోట్లు..

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండుసార్లు వడగళ్లు, భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లోని యాసంగి సీజన్ పంటకు నష్టం జరిగిన సంగతి తెలిసిందే. వరి, మొక్కజొన్న, మామిడి తదితర పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. మార్చి నెలలో కురిసిన వడగళ్లు, వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. నష్టం జరిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయానా పర్యటించి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించింది. విషయం విదితమే. ఆ మేరకు ప్రభుత్వం రూ. 151 కోట్లు పరిహారం మంజూరు చేసింది.

ఒక విపత్తు నష్టానికే..

ఈ ఏడాది విపత్తు కారణంగా రెండుసార్లు పంటలకు నష్టం వాటిల్లింది. రెండు విడతల్లో పంట నష్టం జరిగిన రైతులకు ఒక్కదానికి మాత్రమే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. నష్టపోయిన ప్రతి రైతు ఒకే వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని స్పష్టం చేసింది. అంటే మొదటి విడత ఒక రైతుకు ఒక ఎకరాలో పంట నష్టం జరిగి పరిహారం ప్రకటిస్తే, అదే రైతుకు ఏప్రిల్‌లోని విపత్తుకు మరో ఎకరాలో నష్టం జరిగితే దాన్ని పరిగణలోకి తీసుకోరు. ఒక రైతుకు వేర్వేరు చోట్ల ఉన్న వ్యవసాయ పంటలకు పూర్తి నష్టం జరిగితే ఒకదాన్నే ఎలా గుర్తిస్తారన్న విమర్శలున్నాయి. దీనిపై నిర్ణయం తీసుకోవడంలో వ్యవసాయశాఖ విఫలమైందన్న చర్చా జరుగుతోంది. కాగా, ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయశాఖ పేర్కొంది.

అడ్వాన్స్‌డ్‌లో 'వాట్సాప్ కాపీయింగ్'

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్బీనగర్‌లోని కళాశాలల్లో సెంటర్లు పడ్డాయి. అయితే తన సోదరుడితో పాటు స్నేహితులకు కూడా మంచి మార్కులు రప్పించాలని భావించిన కడప విద్యార్థి ఐదుగురితో ఓ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశాడు. కళాశాలల్లో తనిఖీ చేసే సిబ్బంది కళ్లుగప్పిన ఈ ఐదుగురూ పరీక్ష కేంద్రాల్లోకి తమ స్మార్ట్‌ఫోన్లు తీసుకువెళ్లారు.

కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలు తీసి..

ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్‌లో ఒక ప్రశ్న తర్వాత మరో ప్రశ్న ప్రత్యక్షమవుతూ ఉంటే.. విద్యార్థులు జవాబులు టిక్ చేస్తూ పోతుంటారు. కడప విద్యార్థి కంప్యూటర్ స్క్రీన్‌పై తాను టిక్ చేసిన ప్రతి జవాబును ప్రశ్నతో సహా కనిపించేలా స్మార్ట్‌ఫోన్‌లో ఫొటోలు తీసి, వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయడం ద్వారా మిగిలిన నలుగురికీ చేరేలా చేశాడు. ఎస్వీఐటీ కాలేజీలో పరీక్ష హాలు పెద్దదిగా ఉండటం, ఇన్విజిలేటర్ విధుల్లో ఉన్న సిబ్బంది ఒకేచోట కూర్చుండిపోవడంతో గంటన్నర పాటు ఈ తతంగాన్ని ఎవరూ గుర్తించలేదు. 10.30 గంటల సమయంలో మల్లాపూర్ కేంద్రంలో ఇన్విజిలేటర్ అక్కడి విద్యార్థి వద్ద స్మార్ట్‌ఫోన్ ఉండటాన్ని గమనించారు. అందులో ఉన్న వాట్సాప్ గ్రూపులో కంప్యూటర్ స్క్రీన్ ఫొటోలను చూసిన ఆయన సదరు విద్యార్థిని ప్రశ్నించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్వీఐటీ కాలేజీ పరీక్ష కేంద్రంలోని కడప విద్యార్థి నుంచి ఈ ఫొటోలు వస్తున్నట్లు తెలుసుకుని ఆ సెంటర్ అధికారికి సమాచారమిచ్చారు. ఆయన కేంద్రంలోకి వెళ్లి కడప విద్యార్థిని తనిఖీ చేయగా అతడి వద్ద స్మార్ట్‌ఫోన్ లభించింది. ఇదే క్రమంలో మౌలాలి, ఎల్బీనగర్‌లోని కేంద్రాల్లో పరీక్ష రాస్తున్న మరో ముగ్గురినీ పట్టుకున్నారు. వాట్సాప్ ద్వారా హైటెక్ మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌కు పాల్పడిన ఈ ఐదుగురూ ఐఐటీ–హైదరాబాద్ తరఫున జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహిస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఐఓఎన్ సంస్థకు క్షమాపణ పత్రాలు రాసిచ్చారు. సంస్థ సిబ్బంది ఆదివారం రాత్రి మార్కెట్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, నాచారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

నిర్వహణ సంస్థ నిర్లక్ష్యం?

విద్యార్థులపై పోలీసులు ఐపీసీ 188, 420తో పాటు తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్‌లోని 4 (బీ), 8 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఐదుగురి ఫోన్లనూ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరీక్ష నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ నిర్లక్ష్యం కారణంగానే స్మార్ట్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి వెళ్లాయని చెప్తున్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకూ నోటీసులు ఇచ్చి విచారించడంతో పాటు వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తున్నారు.

రేషన్ డీలర్ల సమ్మె విరమణ

ప్రభుత్వంతో చర్చలు సఫలం

- సమ్మె విరమించి దుకాణాలు తెరిచిన డీలర్లు
- రేషన్ డీలర్ల జేఏసీ నేతలతో మంత్రి గంగుల కమలాకర్ చర్చలు
- కమీషన్ పెంపు ప్రతిపాదన సీఎం దృష్టికి
- సంతృప్తి వ్యక్తం చేసిన డీలర్ల సంఘం నేతలు



సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన రేషన్ డీలర్లు దిగివచ్చారు. రేషన్ డీలర్ల సంఘం నాయకులతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దాంతో మంత్రి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే సమ్మె విరమిస్తున్నట్లు రేషన్ డీలర్ల జేఏసీ చైర్మన్ నాయికోటి రాజు, కన్వీనర్ రవీందర్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం నుంచే రాష్ట్రవ్యాప్తంగా రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్నట్లు మంత్రి సమక్షంలో వెల్లడించారు.

వచ్చే నెలలోగా పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో..

డీలర్ల కమీషన్ పెంపు, గౌరవ వేతనం అమలు తదితర 22 డిమాండ్ల కోసం డీలర్లు గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా గత నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అదనపు కలెక్టర్లకు సమ్మె నోటీసులు ఇచ్చారు. దీంతో అదే నెల 22న మంత్రి కమలాకర్ డీలర్ల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. 22 డిమాండ్లలో 20 డిమాండ్లు పరిష్కరించేందుకు మంత్రి కమలాకర్ పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ సమక్షంలో హామీ ఇచ్చారు. ప్రధాన డిమాండ్‌లు అయిన కమీషన్ పెంపు, గౌరవ వేతనం అమలు అంశాలు ముఖ్యమంత్రి పరిధిలోనివని మంత్రి సర్ది చెప్పడంతో సమ్మె విరమిస్తున్నట్లు డీలర్ల సంఘం నాయకులు ప్రకటించారు. కానీ ఆకస్మికంగా సోమవారం నుంచి రాష్ట్రంలోని 17,284 రేషన్ దుకాణాలను మూసివేసి సమ్మె బాట పట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి గంగుల మంగళవారం డీలర్ల జేఏసీ నాయకులు నాయికోటి రాజు, రవీందర్, మల్లికార్జున్ గౌడ్, అనంతయ్య, పుస్తె శ్రీకాంత్ తదితరులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. సాయంత్రం 6 గంటల తరువాత సమావేశం ముగియగా, చర్చలు సఫలమైనట్లు డీలర్లు ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు డీలర్ల డిమాండ్ల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన నేపథ్యంలో మంత్రి సూచనల మేరకు సమ్మె విరమిస్తున్నట్లు జేఏసీ నాయకులు మంత్రి కమలాకర్ సమక్షంలోనే ప్రకటించారు. జూలై లోపు తమ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్న నమ్మకం ఉందని, గౌరవ వేతనం, ఇన్సూరెన్స్ అంశాలు ముఖ్యమంత్రి పరిధిలో ఉన్నందున సమ్మెను విరమించి, రేషన్ దుకాణాలు తెరుస్తున్నట్లు స్పష్టం చేశారు.

డీలర్లకు గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం: గంగుల

గతంలో ఇచ్చిన హామీ మేరకు రేషన్ డీలర్ల సంక్షేమం విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. డీలర్లతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ 2 కోట్ల 83 లక్షల పేదల ప్రయోజనాల పరిరక్షణ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైందన్నారు. ఇందుకోసం రేషన్ డీలర్లు సహకరించాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ బాలమాయాదేవి, జాయింట్ కమిషనర్ ఉషారాణి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్.. విద్యుత్ ఉత్పత్తి పెంచలేదు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇస్తున్నది ఉచిత విద్యుత్ కాదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏడాదికి ఒక హార్స్‌పవర్‌కి రూ.20 చార్జ్ (ఏడుగంటల కరెంట్ సరఫరాకు) చేశారని, కేసీఆర్ మాత్రం సర్‌చార్జ్ పేరుతో ఒక హెచ్పీకి రూ.20 వసూలుతో పాటు, ఇంటికి వాడే కరెంటుకూ సర్ చార్జీలను వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడం లేదన్నారు. ఉచిత విద్యుత్‌కు డబ్బు ఎవరు ఇస్తున్నారు? ఎక్కడ నుంచి వస్తుందో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టుల నుంచి వస్తున్న విద్యుతే ఇప్పుడు సరఫరా చేస్తున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం మేరకు డబ్బు ఇవ్వకపోవడంతో ఆ రాష్ట్రం తెలంగాణపై కేసు వేసిందని చెప్పారు. శ్రీశైలంలో మూడు టర్బైన్లు కాలిపోయాయని, వాటిని రిపేర్ చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మన రాష్ట్రాన్ని 'సి'గ్రేడ్‌లో పెట్టడంతో ఇప్పుడు పవర్ కార్పొరేషన్ల నుంచి అప్పు కూడా రాదని తెలిపారు.

క్లుప్తంగా...

అమెరికాతో బంధం గర్వకారణం: మోదీ



న్యూఢిల్లీ: అమెరికాతో భారత్ అనుబంధం బలోపేతం అవుతుండడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రపంచ శాంతి, సౌభాగ్యం పట్ల అంకితభావం అనే పునాదిపై భారత్–అమెరికా సంబంధాలు నిర్మితమై ఉన్నాయని వివరించారు. రెండు దేశాల ప్రజల మధ్యనున్న అనుబంధం ఈ భాగస్వామ్యాన్ని మరింత దృఢతరం చేస్తోందన్నారు. ఈ మేరకు మోదీ మంగళవారం ట్వీట్ చేశారు. ఆయన త్వరలో అమెరికాలో పర్యటించనున్నారు. ఈ అధికారిక పర్యటన సందర్భంగా అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్) ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలని కోరుతూ హౌస్ స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ, సెనేట్ మెజారిటీ లీడర్ చుక్ షూమర్, సెనేట్ రిపబ్లికన్ లీడర్ మిచ్ మెక్‌కానెల్ తదితరులు ప్రధాని మోదీకి ఆహ్వానం పంపించారు. వారికి మోదీ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం రావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మోదీ ఈ నెల 22న అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

భారత నేవీ టార్పెడో పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన భారీ టార్పెడోను నావికా దళం మంగళవారం పరీక్షించింది. నీటి అడుగున లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. భారత నేవీ, భారత రక్షణ, పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) చరిత్రలో ఇదో మైలురాయిగా నేవీ అభివర్ణించింది. ఇటీవలి కాలంలో హిందూ మహాసముద్ర జలాల్లో పెరిగిపోతున్న చైనా నావికా దళం కదలికలను దృష్టిలో ఉంచుకుని భారత నేవీ పోరాట సంసిద్ధతను మెరుగుపరుచుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

డ్యామ్‌పై రష్యా దాడి!



దాడి జరగ్గానే గండిపడిన దృశ్యం

బాంబుల ధాటికి బద్దలైన రిజర్వాయర్

- ఉక్రెయిన్‌లోని కఖోవ్కా డ్యామ్‌పై రష్యా దుశ్చర్య
- దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్న వరద
- ఎగువ ప్రాంతాలకు తరలిపోతున్న వేలాది మంది స్థానికులు
- రష్యా పర్యావరణ విధ్వంసానికి తెగబడిందన్న జెలెన్‌స్కీ
- ఉక్రెయిన్‌కు మరింత పెరగనున్న కరెంట్ కష్టాలు



ప్రవాహ ఉధృతికి డ్యామ్ కొట్టుకుపోతున్న దృశ్యం

కీవ్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో ఇన్నాళ్లూ భూతలంపై కొనసాగిన బాంబు దాడులు తాజాగా రిజర్వాయర్ లక్ష్యంగా సాగాయి. దీంతో మంగళవారం తెల్లవారుజామున మూడుగంటల ప్రాంతంలో ఖేర్సన్ పరిధిలోని నీపర్ నదిపై నిర్మించిన కఖోవ్కా డ్యామ్ ధ్వంసమై పెద్ద ఎత్తున నీరు దిగువ ప్రాంతాల వైపు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోండంటూ ముంపుప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. ప్రస్తుతం మాస్కో అధీనంలో ప్రాంతంలో ఈ డ్యామ్ ఉంది. జలవిద్యుత్ కేంద్రానికి నిలయమైన ఈ డ్యామ్‌ను పేల్చేయడంతో ఉక్రెయిన్‌ను కరెంట్ కష్టాలు మరింతగా చుట్టుముట్టనున్నాయి. డ్యామ్ పేల్చి రష్యా ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసానికి దిగిందని ఉక్రెయిన్ ఆరోపించింది. ప్రస్తుతం రష్యా ఆక్రమణలో ఉన్న జపోరిజియా అణు విద్యుత్ కేంద్రానికి నీటి అవసరాలతోపాటు క్రిమియా దక్షిణ ప్రాంత తాగు నీటి అవసరాలను ఈ డ్యామ్ తీరుస్తోంది. డ్యామ్ బద్దలై భారీఎత్తున నీరు దిగువప్రాంతాలకు వెళ్తుండటంతో ముంపు గ్రామాల ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. దాదాపు 100 గ్రామాలు, పట్టణాలను వరద ముంచెత్తనుందని ఒక ప్రభుత్వేతర సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఉక్రెయిన్‌పైకి రష్యా దురాక్రమణకు దిగి 15 నెలలు గడిచిన ఈ తరుణంలో యుద్ధం ఇలా డ్యామ్‌పై దాడితో కొత్త మలుపు తీసుకుంది.

ఇటు 22 వేలు.. అటు 16 వేలు

అయితే ఈ డ్యామ్ పేల్చివేతతో ఎవరు లబ్ధిపొందుతారనేది తెలియట్లేదు. ఎందుకంటే రష్యా ఆక్రమిత ప్రాంతాలతోపాటు ఉక్రెయిన్ అధీనంలోని భూభాగాలనూ ఈ వరదనీరు ముంచెత్తనుంది. రష్యా అధీనంలోని వరదముప్పు ప్రాంతాల్లో 22,000 మంది నివసిస్తుండగా, ఉక్రెయిన్ అధీనంలోని ప్రాంతాల్లో 16వేల మంది నివాసమున్నారు. వరద భయంతో అక్కడి వారిని రైళ్లు, బస్సుల్లో రెండు ప్రభుత్వాల అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాడి నేపథ్యంలో జాతీయ భద్రతా మండలితో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అత్యవసర సమావేశం నిర్వహించారు. 'దాడిలో రష్యా 80 జనావాసాల్లోని ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టింది' అని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. రష్యా సేనలను తరిమికొట్టే పనిలో ఉన్న ఉక్రెయిన్ ప్రభుత్వానికి ఈ డ్యామ్ సమస్య యుద్ధంలో అవరోధంగా తయారైంది. 'డ్యామ్ బద్దలవడంతో అణువిద్యుత్‌ప్లాంట్‌కు నీటి సరఫరా ఆగిపోతుంది. అయితే, డ్యామ్ నుంచి నీటి సరఫరా ఆగిపోయినా అణువిద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు ఇప్పటికిప్పుడు వచ్చే నష్టమేమీ లేదు' అని ఐరాస అంతర్జాతీయ అణుఇంధన సంస్థ ఒక ప్రకటనలో



పేర్కొంది. రష్యాకు గతంలోనూ డ్యామ్‌లను పేల్చేసే చెడ్డ అలవాటు ఉందని అమెరికా మాజీ శాస్త్రవేత్త డేవిడ్ హెల్మెస్ వ్యాఖ్యానించారు.

ప్రమాదంలో జీవ వైవిధ్యం

తక్షణం మేలుకోకుంటే పెను ముప్పే

- క్షీణిస్తున్న జీవవైవిధ్య హాట్‌స్పాట్లు
- కాపాడుకునే కార్యాచరణ తక్షణావసరం
- లేదంటే పూడ్చుకోలేని నష్టమే: శాస్త్రవేత్తలు

ఆకాశాన్నంటే హిమాలయాల నుంచి, మూడు వైపులా ఆవరించిన అనంత సాగర జలరాశి దాకా; సహారా ఇసుక ఎడారి మొదలుకుని, అపార జీవరాశికి ఆలవాలమైన సుందర్బన్ వంటి అడవుల దాకా... అంతులేని జీవ వైవిధ్యానికి పుట్టిల్లు మన దేశం. అలాంటి జీవవైవిధ్యం ఇప్పుడు మనిషి నిర్వాకం వల్ల అక్షరాలా అతలాకుతలమవుతోంది. అస్తిత్వం కోసం పెనుగులాడుతోంది. అతి త్వరలో పూర్తిగా అంతరించిపోయే పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.



కారణమేమిటి?

- విచ్చలవిడిగా అడవుల నరికివేత, అడ్డూ అదుపూ లేని పట్టణీకరణ, ఫలితంగా విపరీతమైన కాలుష్యం, వాతావరణ మార్పులు తదితరాలు.
- భారత్‌లో 1990–2020 మధ్య 30 ఏళ్లలోనే ఏకంగా ఏడు లక్షల హెక్టార్ల మేరకు అడవి నరికివేతకు గురైనట్లు యుటిలిటీ బిడ్డర్ నివేదిక చెబుతోంది. ఇదిఇలాగే కొనసాగితే వన్యప్రాణులకు కనీసం నిలువ నీడ కరువవుతుంది.
- విచ్చలవిడిగా విస్తరిస్తున్న నగరాలు క్రమంగా చిత్తడి, గడ్డి నేలల వంటి సహజ జీవ వ్యవస్థలను కబళిస్తున్నాయి.
- ప్రణాళికలేని విస్తరణతో పలు నగరాలు వరదల వంటి సమస్యలతో సతమతమవుతున్నాయి.
- దీని తాలూకు విపరిణామాలకు బెంగళూరే అతి పెద్ద ఉదాహరణ. కేవలం గత 50 ఏళ్లలోనే నగరంలో పచ్చదనం 88 శాతం, నీటి వనరులు 79 శాతం మటుమాయమయ్యాయి!
- పెరిగిపోతున్న ధ్వని, కాంతి కాలుష్యం వన్యప్రాణుల జీవితాలను, ప్రవర్తనను, పునరుత్పత్తి సామర్థ్యాన్ని... మొత్తంగా వాటి మనుగడనే దెబ్బ తీస్తోంది.

ముప్పేట ముప్పు!

- జీవవైవిధ్యం అంతరిస్తే తలెత్తే విపరిణామాలను ఊహించడం కూడా కష్టమే.
- వాతావరణ ధోరణులు పూర్తిగా మారిపోతాయి. వాటితో పాటే రుతువులూ క్రమం తప్పిపోతాయి. అంతా అల్లకల్లోలమవుతుంది.
- సముద్ర మట్టాలు మరింత పెరిగి తీర ప్రాంతాలను క్రమంగా కనుమరుగవుతాయి.
- సముద్ర జలాల్లో ఆమ్లత్వం పెరిగి వాటిలోని జీవజాలానికి ముప్పు ఏర్పడుతుంది.
- హిమానీ నదాలు శరవేగంగా కరిగిపోతాయి.
- ప్రజలు భారీగా నిర్వాసితులవుతారు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది.
- పలు అరుదైన జీవ జాతులు శాశ్వతంగా అంతరించిపోతాయి. రాయల్ బెంగాల్ టైగర్, గోల్డెన్ లంగూర్, సిరోయ్ లిలీ వంటివి ఇప్పటికే ఈ జాబితాలోకి చేరాయి.

ఏం చేయాలి?

- జీవవైవిధ్యపరంగా ప్రస్తుత తిరోగమన ధోరణికి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలు తక్షణం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రంగంలోకి దిగాలి.
- శాస్త్రీయ, సమాజ, విధానపరంగా కలసికట్టుగా కృషి జరగాలి.
- పర్యావరణ, సహజ వనరుల పరిరక్షణకు నగదు ప్రోత్సాహకాల వంటివి ఇవ్వాలి. ఉత్తరాఖండ్ ఇప్పటికే ఈ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది.
- తీవ్ర వాతావరణ పరిస్థితులను నిరోధించి పర్యావరణ సమతుల్యతను కాపాడే మడఅడవుల వంటి సహజ వనరులను పూర్తిస్థాయిలో పరిరక్షించుకోవాలి.
- పర్యావరణ విద్యను బోధన ప్రణాళికలో తప్పనిసరి చేయాలి.
- జీవ వైవిధ్య పరిరక్షణ ప్రాధాన్యత ప్రజలందరికీ అర్థమయ్యేలా ముమ్మర ప్రచారం చేపట్టాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

హాట్‌స్పాట్స్.. విశేషాల పుట్టిళ్లు!

- అంతర్జాతీయ గుర్తింపున్న 36 జీవవైవిధ్య హాట్‌స్పాట్లలో నాలుగింటికి భారత్ నెలవు. అవి హిమాలయ ప్రాంతం, పశ్చిమ కనుమలు, ఇండో–బర్మా జోన్, సుందర్బన్ అడవులు.
- ఇవి మనుషులతో పాటు పలు జీవజాలాలకు నిలయాలు.
- తాగునీటి, ఆహార అవసరాలను సమర్థంగా తీరుస్తున్నాయి.
- వాతావరణాన్ని నియంత్రిస్తూ జీవజాలానికి ఎంతో మేలు చేస్తున్నాయి.
- ప్రాణికోటి మనుగడకు అత్యవసరమైన ఆక్సిజన్ ఉత్పత్తికి ఇవి ప్రధాన వనరులు.
- ఈ హాట్‌స్పాట్లు అతి పెద్ద పర్యాటక ఆకర్షణలు. తద్వారా స్థానికులకు ఆర్థికంగా పెద్ద ఆలంబనగా నిలుస్తున్నాయి.
- ఇక ఈ హాట్ స్పాట్స్‌కు మూలమైన అడవుల మీద దేశ జనాభాలో 22 శాతం మంది తమ జీవికకు, సామాజిక, సాంస్కృతిక అవసరాలకు పూర్తిగా ఆధారపడ్డారు.

కరెంట్ షాక్‌తో 40 మంది మృతి?

ఒడిశా దుర్ఘటనలో 40 మృతదేహాలపై కానరాని గాయాలు

భువనేశ్వర్/న్యూఢిల్లీ: ఒడిశాలో ఘోర రైలు ప్రమాద ఘటనలో ఘటనాస్థలి నుంచి స్వాధీనం చేసుకున్న దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవని తెలుస్తోంది. దుర్ఘటన తాలూకు కొత్త విషయం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. సంబంధిత వివరాలను గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) మంగళవారం వెల్లడించింది. 'ప్రమాదం జరిగినపుడు చెల్లాచెదురుగా పడిన బోగీలు పై నుంచి వెళ్తున్న ఓవర్‌హెడ్ లోటెన్షన్(ఎల్‌టీ) విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో విద్యుత్ తీగలు తెగి కొన్ని బోగీలపై పడ్డాయి. అప్పటికే ధ్వంసమైన బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులు ఈ విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయి ఉంటారు. అందుకే దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవు' అని ఎఫ్‌ఐఆర్‌లో నమోదుచేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ పి.కుమార్ నాయర్ చెప్పారు.

మార్చురీలో వందకుపైగా మృతదేహాలు

రైలు ప్రమాదంలో 278 మంది మరణించగా 177 మంది ప్రయాణికుల మృతదేహాలను వారి బంధువులు గుర్తుపట్టారు. దాంతో ఈ మృతదేహాల అప్పగింత ప్రక్రియ పూర్తయింది. తలలు తెగి, ప్రమాదంలో నుజ్జునుజ్జయి అసలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలను.. తమ వారి ఆచూకీ కోసం మార్చురీకి వచ్చిన వారూ గుర్తించలేకపోతున్నారు. ఘటన జరిగిన తర్వాత మృతదేహాలు రెండు మూడు చోట్లకు సరిగా ప్యాక్‌చేయకుండానే తరలించిన కారణంగా కొంతమేర కుళ్లి దుర్వాసన వస్తున్నాయి.

సీబీఐ దర్యాప్తు షురూ

ప్రమాదంపై సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. ఈ దుర్ఘటన వెనుక కుట్ర కోణం ఉందంటూ అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రైల్వే శాఖ, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు మంగళవారం బాలాసోర్ జిల్లాకు చేరుకున్నారు. బాలాసోర్ రైల్వే పోలీసులు రైల్వే చట్టంలోని ఈ నెల 3న వివిధ సెక్షన్ల కింద నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను సీబీఐ అధికారులు స్వీకరించారు. స్థానిక పోలీసులు నమోదు చేసి కేసును దర్యాప్తు ప్రక్రియలో భాగంగా మళ్లీ రిజిస్టర్ చేసి, దాన్ని సొంత ఎఫ్‌ఐఆర్‌గా నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలో మార్పులు చేయడం వల్లే రైలు ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని రైల్వేశాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. సమగ్ర దర్యాప్తు కోసం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. రైల్వే శాఖ కార్యకలాపాలపై తమకు కొంత పరిజ్ఞానం ఉందని సీబీఐ అధికారి ఒకరు చెప్పారు. కేసు దర్యాప్తులో భాగంగా రైలు సెక్యూరిటీ సిబ్బంది, ఫోరెన్సిక్ నిపుణుల సాయం కూడా తీసుకుంటామని తెలిపారు. జాయింట్ డైరెక్టర్ (స్పెషల్ క్రైమ్) విప్లవ్‌కుమార్ చౌదరి నేతృత్వంలో ఆరుగురు సభ్యుల సీబీఐ బృందం మంగళవారం మధ్యాహ్నం బహనాగ బజార్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనాస్థలి, సిగ్నల్ గదిని క్షుణ్నంగా పరిశీలించింది. అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, సిబ్బందిని ప్రశ్నించనుంది.



ఘటనా స్థలిలో సీబీఐ బృందం



వ్యర్థాల కుప్పల వద్ద పశువులతోపాటు ఆహారం కోసం వెతుకుతున్న గజరాజు. శ్రీలంకలోని అంపారా జిల్లాలో తీసిందీ ఫొటో. అటవీ ప్రాంతం తగ్గడంతో జనావాసాల్లో చొరబడి ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఇటీవల ఏనుగు, జింక చనిపోయిన ఉదంతాలు అక్కడ వెలుగుచూశాయి. దీంతో ఒకసారి వాడిపారేసే(సింగిల్ యూజ్) ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మార్చురీలో కొడుకును బతికించుకున్నాడు

కోల్‌కతా: బాలాసోర్ మూడు రైళ్ల ప్రమాద ఘటనలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచేతన స్థితిలో ఉన్న ఓ యువకుడిని అధికారులు చనిపోయినట్లుగా భావించి, మార్చురీలో పడేశారు. తండ్రి అతడిని గుర్తించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యుల చికిత్సతో స్పృహలోకి వచ్చాడు. అనంతరం ఆ తండ్రి అతడిని కోల్‌కతాకు తీసుకెళ్లి, మెరుగైన వైద్యం అందించాడు. ఈ నెల 2న బాలాసోర్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. అందులోనే హౌరాకు చెందిన బిశ్వజిత్ (24) ప్రయాణిస్తున్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరిన అతడినిచనిపోయాడని భావించి, బహనాగ స్కూల్‌లోని తాత్కాలిక మార్చురీలో పడేశారు. రైలు ప్రమాద వార్త విని, హేలారామ్ మల్లిక్ తన కొడుకు బిశ్వజిత్‌కు ఫోన్ చేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేదు. ఒకసారి బిశ్వజిత్ నుంచి కాల్ వచ్చినా అతడి స్వరం పీలగా వినిపించింది. బిశ్వజిత్ సజీవంగానే ఉన్నాడని హేలారామ్ గట్టినమ్మకం. ఆ నమ్మకంతోనే బంధువుతో కలిసి అంబులెన్సులో హుటాహుటిన హౌరా నుంచి 235 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలాసోర్‌కు చేరుకున్నాడు. అక్కడున్న అన్ని ఆస్పత్రుల్లోనూ వాకబు చేశాడు. ఫలితం లేకపోయింది. చివరికి బహనాగ హైస్కూల్‌లోని తాత్కాలిక మార్చురీ వద్దకు వచ్చాడు. అధికారులు అనుమతించలేదు. సరిగ్గా అప్పుడే అక్కడ తోపులాట, ఘర్షణ మొదలైంది. ఆ సమయంలో మార్చురీ బయటకు ఒక చేయి వేలాడుతూ కనిపించింది. అది తన కొడుకుదేనని హేలారామ్ గుర్తించాడు. లోపలికి చొచ్చుకెళ్లి, అచేతన స్థితిలో ఉన్న తన కొడుకు బయటకు తీసుకువచ్చి, వెంటనే అంబులెన్సులో బాలాసోర్ ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు వెంటనే చికిత్స జరిపి కటక్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. పలు చోట్ల ఎముకలు ఫ్రాక్చర్ కావడంతో ఏమాత్రం మాట్లాడే పరిస్థితి లేని బిశ్వజిత్‌ను కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ అతడికి వైద్యులు ట్రామా కేర్ యూనిట్‌లో ఉంచి రెండు శస్త్రచికిత్సలు జరిపారు. బాలాసోర్‌లో బిశ్వజిత్‌ను చనిపోయినట్లుగా అధికారులు ఎందుకు భావించారన్న ప్రశ్నకు వైద్యులు ఏం చెప్పారంటే.. సస్పెండెడ్ యానిమేషన్ అనే పరిస్థితికి బిశ్వజిత్ వెళ్లి ఉంటాడు. ఆ సమయంలో మనిషి అవయవాలు పని చేయడం నెమ్మదిగా మందగిస్తుంది. అలాంటప్పుడు ఆ వ్యక్తి చనిపోయినట్లే భావిస్తుంటారు'అని వివరించారు. 'కొడుకును తిరిగిచ్చిన దేవుడికి కృతజ్ఞతలు' అని హేలారామ్ వ్యాఖ్యానించారు.

మణిపూర్‌లో కాల్పుల కలకలం

ఇంఫాల్: జాతుల వైరంతో నిప్పుల కుంపటిలా తయారైన మణిపూర్‌లో శాంతి నెలకొందని భావిస్తున్న తరుణంలో మళ్లీ కాల్పుల మోత మోగింది. గతంలో కుకీ, మెయిటీ వర్గాల పోరులు ప్రాణాలు కోల్పోగా ఈసారి భద్రతా బలగాల సభ్యుడు ఉగ్రతూటాలకు బలయ్యాడు. సంబంధిత వివరాలను భారత ఆర్మీ వెల్లడించింది. మంగళవారం తెల్లవారుజామున సెరోయూ ప్రాంతంలో బీఎస్ఎఫ్ జవాన్లు, అస్సాం రైఫిల్స్ బలగాల శిబిరంపై అనుమానిత కుకీ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ రంజిత్ యాదవ్ బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. కక్‌చుంగ్ జిల్లాలోని సెరోయూ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ఇద్దరు అస్సాం రైఫిల్స్ బలగం సభ్యులకూ తూటా గాయాలయ్యాయి. కాగా, ప్రభుత్వంతో శాంతి ఒప్పందంపై సంతకాలు చేశాక సుగ్నూలో యునైటెడ్ కుకీ లిబరేషన్ ఫ్రంట్(యూకేఎల్ఎఫ్) ఖాళీచేసిన శిబిరాన్ని అక్కడి గ్రామస్థులు తగలబెట్టారు. తమ 100కుపైగా ఇళ్లను భస్మీపటలం చేసినందుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల శిబిరాన్ని నేలమట్టంచేశామని గ్రామస్తులు చెప్పారు. పుకార్లు, భయం వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో ఇంటర్నెట్ సేవలను పదవ తేదీ దాకా నిలిపేస్తున్నట్లు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. తొలిసారిగా మే మూడోతేదీన బ్రాడ్‌బ్యాండ్‌సహా మొబైల్ డాటా సేవలపై ప్రభుత్వం నిషేధం విధించింది. నెల క్రితం కుకీ, మెయిటీ జాతుల మధ్య రాజుకున్న వైరం దాదాపు 98 మంది ప్రాణాలను బలిగొంది.

భారీ మొత్తంలో ఎల్ఎస్‌డీ స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్

న్యూఢిల్లీ: డార్క్‌నెట్ ద్వారా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)అధికారులు పట్టుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.10 కోట్ల విలువైన 15వేల ఎల్ఎస్‌డీ(లైసెర్జిక్ యాసిడ్ డైఇథైల్‌అమైడ్) బ్లాట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంత స్థాయిలో ఎల్ఎస్‌డీ పట్టుబడటం ఇదే మొదటిసారని ఎన్‌సీబీ అధికారులు తెలిపారు. ఆపరేషన్‌లో దొరికిన వారంతా 25–28 ఏళ్ల విద్యావంతులు, యువతేనని, సులువుగా డబ్బు సంపాదించే లక్ష్యంతోనే అడ్డదారి తొక్కారని చెప్పారు. తెరవెనుక ఉంటూ ఇంటర్నెట్ ఆధారిత రహస్య యాప్‌లు, డబ్ల్యూఐసీకేఆర్ వంటి మెస్సెంజెర్ సర్వీసుల ద్వారా దందాను నడుపుతున్నారన్నారు.

ప్రపంచంలో 230 కోట్ల మందికి వంటగ్యాస్ లేదు

ఐక్యరాజ్యసమితి: నేటి ఆధునిక యుగంలోనూ విద్యుత్ వెలుగులు చూడనివారు, వంటగ్యాస్ అందుబాటులో లేనివారు ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ఉన్నారు. ఈ మేరకు ఐదు అంతర్జాతీయ సంస్థలు.. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ, ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ, ఐక్యరాజ్య సమితి గణాంక విభాగం, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) తాజాగా ఒక నివేదిక విడుదల చేశాయి. ప్రపంచంలో దాదాపు 230 కోట్ల మంది వంటచెరుకుగా కట్టెలు, పిడకల వంటివి ఉపయోగిస్తున్నారని వెల్లడించాయి. 67.50 కోట్ల మందికి ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదని తెలియజేశాయి.

- 2030 నాటికి కరెంటు లేని వారి సంఖ్య 66 కోట్లకు, వంట గ్యాస్ లేని వారి సంఖ్య 190 కోట్లకు తగ్గిపోతుంది.
- 2010లో ప్రపంచంలో 84 శాతం మందికి విద్యుత్‌సౌకర్యం ఉంది. 2021 నాటికి ఇది 91 శాతానికి చేరింది. కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి వల్ల 2019–21లో ఈ వృద్ధి కొంత మందగించింది.
- కరెంటు సౌకర్యం లేనివారిలో 80 శాతం మంది (56.7 కోట్లు) సబ్ సహారన్ ఆఫ్రికాలో నివసిస్తున్నారు.
- ఇంధన వనరుల విషయంలో ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.
- వంట గ్యాస్ లేకపోవడంతో కట్టెలు, పిడకలు వంటి కాలుష్యకారక ఇంధనాల వాడకం, దానివల్ల వాయు కాలుష్యం కారణంగా ప్రపంచంలో ప్రతిఏటా దాదాపు 32 లక్షల మంది చనిపోతున్నారని అంచనా.

'ఖలిస్తాన్' స్థావరాల్లో ఎన్ఐఏ సోదాలు

చండీగఢ్: ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) ఉగ్రవాద సంస్థ స్థావరాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. పంజాబ్‌లో తొమ్మిది ప్రాంతాల్లో, హరియాణాలో ఒక చోట సోదాలు జరిగినట్లు తెలిసింది. భారత్‌లో అశాంతిని సృష్టించడమే లక్ష్యంగా అక్రమ మార్గాల్లో నిధులు సేకరిస్తుండడంతోపాటు పాకిస్తాన్ నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు రహస్యంగా దిగుమతి చేసుకుంటున్నట్లు కేటీఎఫ్‌పై ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి ఎన్ఐఏ అధికారులు గత ఏడాది ఆగస్టులో పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పంజాబ్, హరియాణాలో కేటీఎఫ్ స్థావరాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. కేటీఎఫ్ సభ్యులు ప్రముఖ వ్యాపారవేత్తల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు.

రాజ్‌నాథ్‌తో జర్మనీ రక్షణ మంత్రి చర్చలు


న్యూఢిల్లీ: రూ.43 వేల కోట్లతో ఆరు స్టెల్త్ కన్వెన్షనల్ జలాంతర్గాములను కొనుగోలు చేయాలన్న భారత్ ప్రణాళికలపై జర్మనీ ఆసక్తి కనబరిచింది. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు గాను సోమవారం ఢిల్లీ చేరుకున్న జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చలు జరిపారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడులలోని రక్షణ కారిడార్లలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఈ సందర్భంగా పిస్టోరియస్‌ను రాజ్‌నాథ్ ఆహ్వానించారు. భారత్, జర్మనీలు ఉమ్మడి లక్ష్యాల ఆధారంగా రక్షణ సంబంధాలను మరింత పెంచుకునేందుకు అవకాశాలున్నాయని ఇద్దరు నేతలు అభిప్రాయపడ్డారు. కీలక సైనిక వ్యవస్థలను ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు గల అవకాశాలను వారు గుర్తించారు. చైనా దూకుడుతోపాటు ఇండో–పసిఫిక్ తదితర ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులపై ఇరువురు మంత్రులు సమీక్ష జరిపారని అధికారులు చెప్పారు.

బీజేపీతో బంధంలేని పార్టీని చూపించండి

మాజీ ప్రధాని దేవెగౌడ వ్యాఖ్య

బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయేయేతర పార్టీలను ఏకతాటి మీదకు తెచ్చేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్న వేళ మాజీ ప్రధాని, జేడీఎస్ చీఫ్ దేవెగౌడ భిన్నస్వరం వినిపించారు. మంగళవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'దేశంలో ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ బీజేపీతో సంబంధం నెరపని ఏదైనా ఒక పార్టీ ఉంటే అదేంటో తెలుసుకోవాలనుకుంటున్నా. బీజేపీని మేం విభేదిస్తామని కాంగ్రెస్ నేతలు అనొచ్చు. అయితే, ఇక్కడో విషయం చెప్పాలి. మరి అప్పట్లో ఆరేళ్లపాటు బీజేపీకి మద్దతు ప్రకటించిన కరుణానిధి(డీఎంకే)తో కాంగ్రెస్ మంతనాలు జరిపిందిగా.. అందుకే దేశ రాజకీయ ముఖచిత్రం గురించి నేను చర్చించదల్చుకోలేదు. అయినా అది అనవసరం. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా, ఎంపీగా ఇలాంటివి ఎన్నో చూశా. మహారాష్ట్రలో ఏమైందో తెలిసిందేగా. ఇలాంటి ఘటనలను కోకొల్లలుగా ఉదహరిస్తా' అని అన్నారు.

కోర్టుకు హాజరైన ప్రిన్స్ హ్యారీ



లండన్: ఫోన్ హ్యాకింగ్ కేసులో సాక్ష్యం చెప్పేందుకు బ్రిటన్ రాజకుమారుడు, రాజు చార్లెస్–3 రెండో కుమారుడు హ్యారీ(38) మంగళవారం లండన్ హైకోర్టుకు హాజరయ్యారు. విట్‌నెస్ బాక్స్‌లో నిలబడి సాక్ష్యం చెప్పారు. బ్రిటన్ రాజకుటుంబ సభ్యుడు ఇలా కోర్టుకు హాజరుకావడం దాదాపు 130 సంవత్సరాల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. మిర్రర్ గ్రూప్ న్యూస్ పేపర్స్(ఎంజీఎన్) మీడియా సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఫోన్ హ్యాకింగ్‌తోపాటు చట్టవ్యతిరేక పద్ధతుల్లో ప్రముఖుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించినట్లు ఆరోపణలు వచ్చాయి. మిర్రర్ గ్రూప్ నిర్వాకంపై ప్రిన్స్ హ్యారీతోపాటు వంద మందికిపైగా ప్రముఖులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే హ్యారీ కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పారు. మిర్రర్ గ్రూప్ వల్ల తన జీవితం తీవ్రంగా ప్రభావితమైందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. తనను ఒక మోసగాడిగా, తాగుబోతుగా, డ్రగ్స్ తీసుకొనే చిల్లర వ్యక్తిగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రతిష్టకు భంగం కలిగించారని పేర్కొన్నారు.

ఇఫ్లూలో నాన్‌టీచింగ్ ఉద్యోగాల భర్తీకి ప్రకటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఇఫ్లూలో నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-ఎ, బి, సి కేటగిరీల్లో పీఆర్వో పోస్టుతో పాటు డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో పాటు మొత్తం 132 పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు ఇఫ్లూ వెబ్‌సైట్.

ఆర్థిక సాయానికి దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: బీసీ కుల వృత్తిదారులకు వంద శాతం సబ్సిడీతో రూ.1 లక్ష ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్ https://tsobmmsbc.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
39.6°	27.1°

న్యూస్‌రీల్

ఇద్దరు ప్రయాణికుల వద్ద బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దుబాయ్ నుంచి ఇండిగో 6ఈ–1484 విమానంలో మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఇద్దరు ప్రయాణికుదల కదలికలను అనుమానించిన అధికారులు వారి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మలద్వారంలో క్యాప్సుల్స్‌లో పేస్టు రూపంలో ఉన్న బంగారం తీసుకొచ్చినట్లు గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో వాటిని బయటికి తీయించారు. మొత్తం ఆరు క్యాప్సుల్స్‌లో 1 కేజీ 705 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ 1.5 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దోపిడీ కేసు..

- పోలీసుల అదుపులో మరో ఇద్దరు నిందితులు?

రాంగోపాల్‌పేట్: ఐటీ అధికారుల పేరుతో బంగారం దోపిడీ చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు తెలిసింది. గత నెల 27న పాట్ మార్కెట్‌లోని బాలాజీ జ్యువెలర్స్‌లో ఐటీ అధికారులమని చెప్పి కిలో 700 గ్రాముల బంగారు బిస్కెట్లను తీసుకుని పోయిన సంగతి విదితమే. మార్కెట్, ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని నలుగురు నిందితులు రెహ్మాన్, జకీర్, ప్రవీణ్, ఆకాష్‌లను అరెస్టు చేసి 573 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 10 మంది పాలుపంచుకోగా మిగతా వాళ్లు పరారీలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్, మార్కెట్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీరి నుంచి కూడా బంగారాన్ని స్వాధీనం చేసికున్నట్లు తెలిసింది. పరారీలో ఉన్న వారి కోసం మహారాష్ట్ర, గోవా తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృంధాలు ఇంకా గాలిస్తూనే ఉన్నాయి.

ప్రీబిడ్ సమావేశం సక్సెస్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ స్థలాలపై మంగళవారం బేగంపేట్‌లో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి అనూహ్య స్పందన లభించింది. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో మొత్తం 34 ల్యాండ్ పార్సెళ్లు (స్ట్రే బిట్స్) ఉండగా, మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో ఉన్న 16 స్థలాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ బి.కిషన్ రావు ఈ సందర్భంగా బిడ్డర్లు, డెవలపర్ల సందేహాలను నివృత్తి చేశారు.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎమ్మెస్టీసీ ప్రతినిధి అనురాగ్ ఈ సందర్భంగా ఆన్‌లైన్ వేలం పద్ధతులను, నియమ నిబంధనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రంగారెడ్డి జిల్లాతో పాటు సంగారెడ్డి జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని 10 ల్యాండ్ పార్సెల్స్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలోని 8 ల్యాండ్ పార్సెళ్లను హెచ్ఎండీఏ ఈ నెల 22వ తేదీన ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించనున్నది.

12న ఆర్టీసీ దివ్యాంగుల బస్సు పాస్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 12వ తేదీన దివ్యాంగులకు బస్సు పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి బస్సు పాస్ సెంటర్‌లో మేళా ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. మియాపూర్, లింగంపల్లి, రామచంద్రాపురం, పటాన్‌చెరు ,బీరంగూడ, కృష్ణారెడ్డిపేట, ఐడీఏ బొల్లారం తదితర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని పాస్‌లు పొందవచ్చు.పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఆధార్, ఐడీ కార్డు సర్వీస్ కోసం రూ.50తో మేళాలో పాల్గొనవచ్చని ఈడీ పేర్కొన్నారు.

కింగ్‌కోఠి ఆస్పత్రికి 'ప్లాటినం' ర్యాంక్

హిమాయత్‌నగర్: మెటర్నిటీ లేబర్ రూం, ఓటీ సేవల అంశంలో కింగ్‌కోఠి జిల్లా ప్రసూతి ఆస్పత్రికి 'ప్లాటినం' ర్యాంక్ దక్కింది. కొన్ని నెలల క్రితం ప్రభుత్వ ఆస్పత్రిల్లోని ప్రసూతి ఇంటెన్సివ్ కేర్, ఓటీ, లేబర్ రూం, ఐసీయూ విభాగాల్లో సౌకర్యాలు, ప్రమాణాలు, నాణ్యతపై నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఆధ్వర్యంలో 'లక్ష్య' టీం కింగ్‌కోఠి ఆస్పత్రిని సందర్శించింది. సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్‌లో 'కింగ్‌కోఠి జిల్లా ప్రసూతి ఆస్పత్రి' 'ప్లాటినం' ర్యాంక్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, మెటర్నిటీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ జలజ వెరోనికా హర్షం వ్యక్తం చేశారు.

బడి బస్సు భద్రమేనా?



గడువు ముంచుకొస్తున్నా నిద్ర లేవరే!

- తెరుచుకోనున్న స్కూళ్లు, కాలేజీలు
- బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల్లో జాప్యం
- ఆ దిశగా దృష్టి సారించని ఆర్టీఏ

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాలలు, కళాశాలలు త్వరలో తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో.. ప్రతి ఏటా విద్యాసంస్థల ప్రారంభానికి ముందు అంటే మే నెలలోనే అన్ని బడి బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించే రవాణా శాఖ ఈసారి ఆ దిశగా దృష్టి సారించలేదు. కేవలం బస్సుల కండీషన్‌ను పరిశీలించడమే కాకుండా పిల్లల భద్రతపై విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు ఆర్టీఏ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలి. కానీ.. బడిపిల్లల భద్రతలో ఎంతో కీలకమైన ఈ ప్రక్రియ కొంతకాలంగా మొక్కుబడిగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక చోట స్కూల్ బస్సులు ప్రమాదానికి గురవుతూనే ఉన్నాయి. బస్సుల నిర్వహణలో విద్యాసంస్థల నిర్లక్ష్యం, డ్రైవర్ల అజాగ్రత్త, అటెండర్లు లేకపోవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతి బస్సులో అటెండర్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన కొన్ని చోట్ల అమలు కావడంలేదు. బస్సు ముందూ వెనుకా ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే ముందుకు కదిలించాల్సి ఉండగా కొందరు డ్రైవర్లు ఈ చిన్న జాగ్రత్త పాటించకపోవడంతో గతంలో పలుచోట్ల ప్రమాదాలు జరిగాయి. ఇటువంటి అంశాల్లో అప్రమత్తం చేయవలసిన రవాణా శాఖ ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడం శోచనీయం.

10 వేలకుపైగా..

- స్కూళ్లు, ఇంజినీరింగ్ కళాశాలలు తదితర విద్యాసంస్థల్లో చదువుకొనే విద్యార్థుల రవాణా సదుపాయం కోసం సుమారు 10వేలకు పైగా బస్సులు ఉన్నాయి. నిత్యం లక్షలాది మంది ఈ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం కాలం చెల్లిన బస్సులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టినప్పటికీ.. ఇంకా కొన్నిచోట్ల 15 ఏళ్లు దాటిన వాహనాలు ఉన్నట్లు సమాచారం. కొంత మంది మోటారు వాహన తనిఖీ అధికారులు నిర్వహించే ఉత్తుత్తి తనిఖీలతో కాలం చెల్లినవి కూడా యథేచ్ఛగా రోడ్డెక్కుతున్నాయి. మరోవైపు సామర్థ్యం లేని బస్సులకు సైతం ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఈ నిబంధనలు తప్పనిసరి..

- బస్సు పసుపు రంగులో ఉండాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలుండాలి.
- బస్సు లోపలి భాగంలో పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి. దీనివల్ల లోపల ఉన్న పిల్లలు కూడా డ్రైవర్‌కు కనిపిస్తారు.
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పౌడి అందుబాటులో ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- సదరు పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్, మొబైల్ నంబర్లు, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపున ముందుభాగంలో రాయాలి.
- వాహనానికి నాలుగువైపులా పై భాగం మూలాల్లో (రూఫ్‌పై కాదు) బయటివైపు యాంబర్ (గాఢ పసుపు పచ్చ) రంగు ఫ్లాషింగ్ లైట్లను ఏర్పాటు చేయాలి. పిల్లలు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి.
- సదరు వాహనం స్కూల్ బస్సు అని తెలిసేలా ముందుభాగంలో పెద్ద బోర్డుపై 250 ఎం.ఎం.కు తగ్గని విధంగా ఇద్దరు విద్యార్థులు (ఒక అమ్మాయి, ఒక అబ్బాయి) నల్లరంగులో చిత్రించి ఉండాలి. ఆ చిత్రం కింద 'స్కూల్ బస్సు' లేదా 'కళాశాల బస్సు' అని నల్ల రంగులో కనీసం 100 ఎంఎం సైజు అక్షరాల్లో రాయాలి. అక్షరాల గాఢత సైజు కనీసం 11ఎం.ఎం.ఉండాలి.
- బస్సు తలుపులు సురక్షితమైన లాకింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సైడ్ విండోలకు అడ్డంగా 3 లోహపు కడ్డీలను ఏర్పాటు చేయాలి. సీటింగ్ సామర్థ్యం కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లొద్దు.

డ్రైవర్ల అర్హతలివీ..

- డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి. యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్లకు ప్రతి 3 నెలలకోసారి రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు చేపట్టాలి.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి.
- బస్సు డ్రైవింగ్‌లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.

రాంగ్‌రూట్.. అతివేగం..

- లారీని ఢీకొన్న కారు
- ఒకరు మృతి: నలుగురికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

మొయినాబాద్: అసలే రాంగ్‌రూట్.. ఆపై అతివేగం.. ఒకరి మృతికి కారణమైంది. లారీని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మీరాలం మండికి చెందిన ఎండీ ఉబేద్ (24), కార్వాన్ టప్పాచబుత్రా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా, ఎండీ ఇస్మాయిల్, ఇబ్రహీం, నహీమ్ స్నేహితులు. వీరంతా సోమవారం రాత్రి కారులో మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి శివారులో ఉన్న ఓ ఫాంహౌస్‌కు వచ్చారు. రాత్రి అక్కడ గడిపారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు నగరానికి వెళ్లేందుకు కారులో బయలు దేరారు. మొయినాబాద్ సమీపంలోని తాజ్‌హోటల్ వద్ద రాంగ్‌రూట్లో అతివేగంగా వెళుతున్న కారు.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. కారు ఇంజిన్ ఎగిరి దూరంగా పడిపోయింది. అయిదుగురు యువకులు కారులోనే ఇరుక్కుపోయారు. ఉబేద్ అక్కడికక్కడే మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి.. ఏడుగురికి గాయాలు

మణికొండ: అతివేగంతో ఓ వాహనం అదుపు తప్పి ఔటర్ రింగ్ రోడ్డుపై పల్టీ కొట్టడంతో అందులో ఉన్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడుగురికి గాయాలయ్యాయి. నార్సింగి పోలీసుల వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ లేబర్ క్యాంప్‌లో ఉంటున్న 8 మంది కూలీలు గచ్చిబౌలిలోని ఎన్ కన్వెన్షన్‌లో డెకరేషన్ పనులు చేస్తున్నారు. రోజు మాదిరిగానే అజీజ్‌నగర్ నుంచి డెకరేషన్ వస్తువులను తీసుకుని టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. వాహనం అతివేగంగా వెళుతూ ఔటర్ రింగ్ రోడ్డు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఇందులో ఉన్న వారందరూ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. బర్దన్ (38) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఏడుగురు గాయాల పాలయ్యారు.

కోఠి డీఎంహెచ్‌ఎస్‌లో అగ్నిప్రమాదం

సుల్తాన్‌బజార్: కోఠిలోని డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గోదాంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆవరణలో టీఎస్ ఎంఐడీసీఐడీసీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని హాస్పిటల్స్‌లకు బ్లీచింగ్ పౌడర్, సోడియం, హై–పో క్లోరైడ్ ద్రావణాన్ని గోదాం ముందు భాగంలోని రెండు షెటర్లలో నిల్వ ఉంచారు. మంగళవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మంటలు అంటుకొని అగ్ని ప్రమాదంలో బ్లీచింగ్ పౌడర్ ఉన్న షెటర్ పూర్తిగా కాలిపోయింది. మరోదాంట్లో ఉన్న హైపో క్లోరైడ్ ద్రావణానికి స్వల్పంగా మంటలంటుకున్నాయి. మంటలు చెలరేగిన సమయంలో ఆర్ఎంపీటీసీ ఉద్యోగులు తక్షణమే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న గౌలిగూడ ఫైర్‌స్టేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఫైర్‌ఇంజన్‌తో సుమారు అరగంట పాటు శ్రమించి మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


మంటలు ఆరుపుతున్న ఫైర్ సిబ్బంది

చేప ప్రసాదానికి వేళాయె

9న పంపిణీకి భారీ సన్నాహాలు

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు
- పనుల్ని పరిశీలించిన మంత్రి తలసాని


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తలసాని


చేప ప్రసాదం కోసం ఇప్పటికే వచ్చిన ప్రజలు

అబిడ్స్: చేప ప్రసాదం పంపిణీకి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా మూడేళ్ల విరామం తర్వాత.. ఈ నెల 9న ఉదయం మృగశిర కార్తె రోజు చేప ప్రసాదాన్ని బత్తిని సోదరులు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. బారికేడ్ల ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు చేప ప్రసాదాన్ని మృగశిర కార్తె రోజు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆస్తమా రోగులతో పాటు సామాన్య ప్రజలు కూడా పెద్ద ఎత్తున చేప ప్రసాదాన్ని తీసుకుంటారు. మూడేళ్ల విరామం తర్వాత చేప ప్రసాదం పంపిణీ చేయనుండటంతో మంగళవారం పలు రాష్ట్రాల నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ప్రజలు తరలివచ్చారు. మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉన్నతాధికారులతో కలిసి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసారి ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ప్రమాదంలో అమ్మైంది.. ప్రాణాలు పోసింది!

ఆడుకుంటూ వెళ్లి కేబుల్ వైర్లను పట్టుకున్న బాలిక

- చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నించిన మహిళ
- కేబుల్ తీగలకు కరెంట్ సరఫరాతో ఆమె మృత్యువాత
- కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో విషాదకర ఘటన


బాపనమ్మ (ఫైల్)


చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం


ప్రమాదానికి కారణమైన విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు

కేపీహెచ్‌బీకాలనీ: విధి ఏ రూపంలో వికటిస్తుందో చెప్పలేం. మృత్యువు ఏ దారిలో వచ్చి కాటేస్తుందో ఊహించలేం. తన కడుపున పుట్టకపోయినా.. ప్రమాదంలో ఉన్న మరో పేగుబంధాన్ని కాపాడే క్రమంలో తన ప్రాణాలనే పణంగా పెట్టిన విషాదకర ఘటన మంగళవారం కేపీహెచ్‌బీ పరిధిలో చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో ప్రమాదకర స్థితిలో ఉన్న ఓ చిన్నారిని రక్షించి.. ఓ మహిళ ప్రాణాలు పోగొట్టుకోవడం పలువురిని కలచివేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ములుకి శ్రీనివాస్, బాపనమ్మ దంపతులు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అడ్డగుట్ట సొసైటీలోని ఎలిగేన్స్ ప్రైడ్ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌లుగా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో శ్రీనివాసులు, అతని భార్య బాపనమ్మ అపార్టుమెంట్ గేటు వద్ద నిల్చుని ఉన్నారు. ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ వాచ్‌మన్ కూతురు శ్రీలక్ష్మి (5) ఆడుకుంటూ వెళ్లి చెట్టు పక్కన వేలాడుతున్న కేబుల్ వైర్లను తాకింది. ఒక్కసారిగా షాక్ తగిలి కొట్టుకుంటున్న చిన్నారిని బాపనమ్మ కాపాడేందుకు వెళ్లి కేబుల్ తీగలను పట్టి లాగింది. ఈ ఘటనలో చిన్నారి గాయాలతో బయటపడింది. బాపనమ్మ మాత్రం విద్యుదాఘాతానికి గురై అసువులు బాసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ తీగలకు విద్యుత్ సరఫరాతోనే ప్రమాదం..

కేబుల్ తీగలకు చెందిన సంస్థలతో పాటు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. కేబుల్ తీగలు, కరెంట్ తీగలు పక్కపక్కనే అంటుకుని ఉండడంతో విద్యుత్ సరఫరా జరిగి బాలిక మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారిని కాపాడే క్రమంలో బాపనమ్మ విద్యుదాఘాతంతో విగతజీవిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాపనమ్మ మృతి చెందడంతో ఆమె కుమారుడు, కూతురు హృదయ విదారకంగా రోదించడంతో స్థానికులను కంటతడి పెట్టించింది.

దారిమళ్లిన 'మత్తు'

మూడు మెడికల్ షాపుల లైసెన్సులు రద్దు

- మరో తొమ్మిది దుకాణాలవి సస్పెండ్
- యువతకు 'మత్తు మందుల' విక్రయాలు
- ఫిబ్రవరి 23న దాడి చేసిన హెచ్–న్యూ అధికారులు
- విచారణ అనంతరం డ్రగ్ కంట్రోల్ విభాగం చర్యలు




వివరాలు వెల్లడిస్తున్న హెచ్-న్యూ అధికారులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు విభాగం మాదకద్రవ్యాలపై జంగ్ చేస్తోంది. వినియోగదారులు, విక్రేతలు, సరఫరాదారులతో పాటు సూత్రధారులనూ కటకటాల్లోకి నెడుతోంది. దీంతో మత్తు బానిసలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. సాధారణ రుగ్మతలు, శస్త్రచికిత్సల తర్వాత, అత్యవసర సమయాల్లో వాడే ఔషధాలు దొడ్డిదారిలో సేకరించి వినియోగిస్తున్నారు. కొన్ని మెడికల్ షాపుల నిర్వాహకుల నిర్లక్ష్యం, ధనదాహం కారణంగా వీరి చేతికి కోడిన్ ఫాస్పేట్ టానిక్స్, అల్ప్రాజోలమ్ టాబ్లెట్లు దొరుకుతున్నాయి. సిటీలో సాగుతున్న ఈ దందాపై కన్నేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ), టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుస దాడులు చేస్తున్నారు. ఆయా మెడికల్ షాపులపై కేసులు నమోదు చేయడంతో పాటు డ్రగ్ కంట్రోల్ అధికారులకు లేఖలు రాసి వాటి లైసెన్సులు రద్దు చేయిస్తున్నారు. ఇలాంటి మూడు షాపుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు మరో తొమ్మిదింటిపై చర్యలు తీసుకుంటూ డ్రగ్ కంట్రోల్ విభాగం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్డదారిలో ఆల్ప్రాజోలం..

మానసిక వైద్యంలో వినియోగించే ఆల్ప్రాజోలం సంబంధిత మాత్రలను కేవలం డాక్టర్ చీటీ ఆధారంగా, సూచించిన ప్రమాణంలోనే విక్రయించాలి. దీన్ని వినియోగిస్తే మత్తు రావడంతో అనేక మంది యువకులతో పాటు ఇతర వయసుల వారూ బానిసలు అవుతున్నారు. అలవాటుగా మారడంతో దీర్ఘకాలం వాడి వివిధ రకాలైన రుగ్మతలకు గురవుతున్నారు. రాజస్థాన్‌లోని బయో ల్యాబ్ రెమిడీస్ సంస్థల్లో తయారయ్యే ఈ మాత్రలు నగరంలోని మెడికల్ ఏజెన్సీలకు చేరుతున్నాయి. వీళ్లు ఎలాంటి బిల్లులు లేకుండా హోల్‌సేల్‌గా పలువురికి విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారులు డెలివరీ బాయ్స్‌ను ఏర్పాటు చేసుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో మెడికల్ షాపులకు సరఫరా చేస్తున్నారు. ఈ దుకాణదారులు పరిచయస్తులైన కస్టమర్లకు ఎలాంటి మందుల చీటీ లేకుండానే అమ్ముతున్నారు. 17 నుంచి 20 పైసల ఖరీదు చేసే ఈ టాబ్లెట్ రూ.12 నుంచి రూ.15 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి దుకాణాలపై హెచ్–న్యూతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా ఉంచి దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో బాధ్యతలను పట్టుకోవడం, సరుకు స్వాధీనం చేసుకోవడం మాత్రమే కాదు.... ఆయా మెడికల్ షాపుల వివరాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి అందిస్తున్నారు.

డ్రగ్ కంట్రోల్ అధికారులకు సిఫారసు..

- ఈ దుకాణాల వ్యవహారంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫారసు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 12 దుకాణాలపై దాడి చేసిన హెచ్–న్యూ అధికారులు దాదాపు రూ.40 లక్షల విలువైన ఈ 'మత్తు మందులు' స్వాధీనం చేసుకున్నారు. ఆల్ప్రాజోలం టాబ్లెట్లు అక్రమంగా విక్రయిస్తున్న వారి వ్యవహారాన్ని డ్రగ్ కంట్రోల్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ ప్రారంభించిన ఆ అధికారులు విషయం నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకున్నారు.
- ఇందర్‌బాగ్‌లోని గణేష్ ఫార్మాస్యూటికల్స్, అంబర్‌పేట్‌లోని బయోస్పేర్ ఎంటర్‌ప్రైజెస్, అక్షయ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ లైసెన్సులు శాశ్వతంగా రద్దయ్యాయి. సర్దార్ మెడికల్ హాల్ (నాంపల్లి), హైదరాబాద్ మెడికల్ హాల్ (నాంపల్లి), ఆర్ ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ (లంగర్‌హౌస్), భారత్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ చార్మినార్, అల్ హమ్రా మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ (హుమాయున్‌నగర్), శ్రీ అయ్యప్ప మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ (ఉప్పల్), గోపాల్ మెడికల్ షాప్ (గౌలిగూడ), మీరా మెడికల్ షాప్ (చార్మినార్) లైసెన్సులను 2 నుంచి 15 రోజుల పాటు సస్పెండ్ చేసింది. డ్రగ్ కంట్రోల్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు కొనసాగిస్తామని, ఇలాంటి అక్రమ దందా చేస్తూ దొరికితే చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

విదేశీ మహిళను వేధించిన ఫర్నిచర్ షాపు నిర్వాహకులపై కేసు

అబిడ్స్: ఓ ఫర్నిచర్ దుకాణంలో సోఫాసెట్ కొనుగోలు చేసిన విదేశీయురాలిని దుకాణం నిర్వాహకులు వేధించి ఇబ్బందులకు గురిచేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.రవి తెలిపిన వివరాల ప్రకారం..సోమాలియా దేశానికి చెందిన ఫాతిమా(28) ఓ ఆసుపత్రిలో ట్రాన్స్‌లేటర్‌గా పనిచేస్తోంది. తన ఇద్దరు పిల్లలతో కలిసి మొఘల్‌కా నాలా ప్రాంతంలో నివసిస్తోంది. ఈమె గత నెల 15వ తేదీన లక్ష్మీనగర్ సమీపంలోని ఫర్నిచర్ దుకాణంలో రూ.34 వేలకు ఓ సోఫాసెట్ ఖరీదు చేశారు. సోఫాసెట్ డెలివరీ ఇచ్చాక వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించాలంటూ దుకాణదారులు ఆమెతో గొడవపడ్డారు. నిర్వాహకులు ఇస్మాయిల్, తౌసిఫ్‌లు వాట్సాప్‌లో ఆమెతో చాటింగ్ చేస్తూ అసభ్య సమాచారం పంపించారు. వెయ్యి రూపాయలు ఇవ్వకుంటే నిన్ను నీ పిల్లలను చంపేస్తామంటూ రాత్రిపూట వీడియో, ఆడియో ఫోన్‌కాల్స్ చేస్తూ ఆమెను బెదిరించారు. దీంతో ఫాతిమా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





దాహార్తి తీరట్లే!

- పెరిగిన మంచినీటి వినియోగం
- బస్తీలు, కాలనీల్లో నల్లా నీళ్లు అరకొర
- వెంటాడుతున్న లోప్రెషర్ సమస్య
- ట్యాంకర్ల సరఫరా అంతంతమాత్రంగానే
- 30 శాతానికిపైగా మినరల్ క్యాన్లపైనే ఆధారం
- ఇదీ హైదరాబాద్ మహానగర పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర దాహార్తి పూర్తి స్థాయిలో తీరడం లేదు. వేసవి ఉష్ణోగ్రతల తీవ్రత దృష్ట్యా తాగునీటి వినియోగం బాగా పెరిగింది. జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలున్నా.. సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంతో పోలిస్తే పరిస్థితిలో కొంత మెరుగైనప్పటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. జలమండలి రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్న నీరు సరిపోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్య వెంటాడుతోంది.

◆ బస్తీలు, కాలనీల్లో పరిస్థితి దయనీయంగా మారింది. రోజువారీగా నల్లాలు, ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీళ్లు నగరవాసుల అవసరాలు తీర్చడంలేదు. మరోవైపు సుమారు 30 శాతం కుటుంబాలు మినరల్ క్యాన్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వాస్తవాలకు భిన్నంగా..

◆ నగరంతోపాటు శివారు ప్రాంతాలకు దినసరి సరఫరా చేస్తున్నట్లు జలమండలి అధికారులు చెబుతున్నా.. వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నగర జనాభాకు అనుగుణంగా సాధారణంగా రోజువారీగా 570 నుంచి 580 ఎంజీడీలు నీరు అవసరం. వేసవి దృష్ట్యా ఈ డిమాండ్ 620 నుంచి 640 ఎంజీడీలకు పెరిగింది. జలమండలి నగర వాసుల అవసరానికి తగ్గట్లుగా నీటి సరఫరా కోసం రూపొందించిన వేసవి కార్యాచరణ ప్రణాళిక కూడా ఆచరణలో అభాసుపాలైంది. మే నెలాఖరు నాటికి రోజువారీగా 565 మిలియన్ గ్యాలన్లతో పాటు అదనంగా మరో 42 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ)నీటిని సరఫరా చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినా .. ఆచరణలో కార్యరూపం దాల్చలేదు.



లోప్రెషర్ సమస్య

◆ నల్లా నీటికి లోప్రెషర్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని నివాస సముదాయాల్లో నల్లాలకు అక్రమంగా మోటార్ వినియోగించడంతో లో ప్రెషర్ సమస్య వెంటాడుతోంది. మరోవైపు ఎగువ ప్రాంతాలకు సైతం అంతంత మాత్రంగా తయారైంది. నీటి సరఫరా సమయం కూడా పలు ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టింది. సాధారణంగా 2 గంటల పాటు నీటి సరఫరా ఉంటుంది. కానీ.. పలు బస్తీల్లో కనీసం అరగంట నుంచి 45 నిమిషాల మించి సరఫరా కావడం లేదనే ఆరోపణలున్నాయి.

ట్యాంకర్ల కోసం ఎదురు చూపులే...

◆ నగరంలో జలమండలి ట్యాంకర్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. బస్తీలకు సరఫరా చేసే ఉచిత ట్యాంకర్ల విషయం పక్కకు పెడితే గృహోపయోగ వాణిజ్య ట్యాంకర్ల సరఫరా పరిస్థితి కూడా అంతంతగా తయారైంది. బహుళ అంతస్తుల సముదాయాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయి ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోని ఫిల్లింగ్ కేంద్రాలకు దినసరి ట్యాంకర్ల బుకింగ్ సంఖ్య పెరుగుతున్నా.. ట్యాంకర్ల సరఫరా మాత్రం నత్తకు నడక నేర్పిస్తోంది. దీంతో జలమండలి ట్యాంకర్ల కోసం సుదీర్ఘ నిరీక్షించాల్సి వస్తోంది. వినియోగదారులు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వేసవి దృష్ట్యా మంచి నీటి ట్యాంకర్ల సరఫరాలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో సైతం జలమండలి విఫలమైందనే విమర్శలున్నాయి. అవసరమైన చోట్ల అదనంగా ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటుతో అదనపుట్యాంకర్లు, ట్రిప్పులు పెంచుతామని అధికారులు ప్రకటించినా.. ఆచరణలో లేకుండా పోయింది.

ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని సీఎంకు లేఖలు



ఓయూలో సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖల్ని చూపుతున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు అధ్యాపకులు సీఎం కేసీఆర్‌కు లేఖలు రాశారు. మంగళవారం ఓయూతో పాటు రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు గత రెండు నెలలుగా ఉద్యోగాల పర్మనెంట్ కోసం చేస్తున్న ఆందోళనలో భాగంగా మూకుమ్మడిగా లేఖలు రాసినట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ పరుశురామ్ పేర్కొన్నారు. వర్సిటీలలో ఎంతో కష్టపడి విద్యాబోధన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను విస్మరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైన తమ విన్నపాలను పరిగణనలోకి తీసుకొని ఇతర కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరి రెగ్యులరైజ్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ధర్మా తేజ, వేల్పుల కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా జేఎన్‌టీయూలోనూ కాంట్రాక్టు అధ్యాపకులు లేఖలు రాశారు. శివారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు



జేఎన్‌టీయూలో..

రెండో ప్రియుడి మోజులో..

- మొదటి ప్రియుడి హత్య
- డ్రమ్ము మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు

పహాడీషరీఫ్: పది రోజుల క్రితం వ్యక్తిని దారుణంగా హతమార్చి డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనకు వివాహేతర సంబంధమే కారణమని పహాడీషరీఫ్ పోలీసులు నిర్ధారించారు. రెండో ప్రియుడి మోజులో పడిన మహిళ అతనితో కలిసి మొదటి ప్రియుడిని హత్య చేసింది. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పూరన్‌సింగ్ అలియాస్ దీపక్(30)కి వివాహానికి ముందే బంధువైన జయాదేవితో ప్రేమాయణం కొనసాగింది. అనివార్య కారణాలతో ఇద్దరూ వేర్వేరు సంబంధాలు చేసుకోవాల్సి వచ్చింది. వివాహానంతరం భార్య మమతతో కలిసి పూరన్‌సింగ్ చాంద్రాయణగుట్ట బండ్లగూడకు వలస వచ్చాడు. లాక్‌డౌన్ సమయంలో జయాదేవి తన భర్త, పిల్లలను వదిలేసి కాటేదాన్‌కు వచ్చింది. పూరన్‌సింగ్‌తో వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలోనే ఇంటి సమీపంలోనే ఉంటున్న హర్యానాకు చెందిన నజీం(31)తో కూడా వివాహేతర సంబంధాన్ని నెరపసాగింది. తుక్కుగూడలో వేరుగా గది తీసుకుని అతడితో సహజీవనం సాగించింది. పూరన్‌కు అనుమానం వచ్చిందని గ్రహించిన వారు ఎలాగైనా అతడిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు.

పథకంలో భాగంగా..

ముందస్తు పథకంలో భాగంగా జయాదేవి, నజీం కామన్ ఫ్రెండ్‌గా ఉన్న రాజేంద్రనగర్‌లో నివసించే తమిళనాడుకు చెందిన సుగుణా రాము(42)తో ఈ నెల 22న రాత్రి పూరన్‌సింగ్‌కు ఫోన్ చేయించి బాకీగా ఉన్న రూ.10 వేలు ఇస్తానంటూ తుక్కుగూడకు పిలిపించారు. నమ్మి వెళ్లిన పూరన్‌సింగ్‌ను నజీం, అతని స్నేహితుడు మబీన్, జయాదేవి, అసద్‌తో కలిసి దారుణంగా కత్తితో దాడి చేసి హత్య చేశారు. మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి జేసీబీ ముందుండే పారలో వేసుకొని సమీపంలోని సూరం చెరువులో పడేసి పరారయ్యారు. పోలీసులు నజీం, సుగుణా రామును అరెస్ట్ చేయగా..మిగిలిన ముగ్గురు పరారీలో ఉన్నారు.

మన పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ హాల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తలసాని మాట్లాడుతూ పరిశ్రమల రంగమే కాకుండా ఐటీ రంగం అభివృద్ధికి కూడా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రపంచంలోనే ప్రముఖ సంస్థలైన అమెజాన్, గూగుల్, ఆపిల్ వంటి కంపెనీలు హైదరాబాద్‌లో తమ సంస్థలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం టీఎస్‌ఐపాస్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. అంతే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సరఫరా, నీరు తదితర వనరులు కూడా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులకు పరిశ్రమల ఏర్పాటుపై పలు రాయితీలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురు పరిశ్రమల నిర్వాహకులకు మంత్రి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ పవన్‌కుమార్, ఆర్డీవో వసంత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ కె.రమేష్, డిక్కి అధ్యక్షులు రవికుమార్, ముఠా జైసింహ, సిద్ధార్థ గోయల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు...తెలంగాణ వచ్చాక పరిశ్రమల పరిస్థితిని వివరిస్తూ డాక్యుమెంటరీని ప్రదర్శించారు.




మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేశాకే పరీక్షలు నిర్వహించాలి

విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, సభ్యులను తొలగించి..పూర్తిగా ప్రక్షాళన చేశాకే పోటీ పరీక్షలను నిర్వహించాలని ఓయూలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మంగళవారం గ్రూప్–1 పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి విద్యార్థులు, నిరుద్యోగులు ర్యాలీ చేపట్టగా..అడ్డుకొని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలో కీలకమైన వ్యక్తులను పక్కన పెట్టి, టీఎస్‌పీఎస్సీ అధికారులను తొలగించకుండా పరీక్షలు నిర్వహించడం దారుణమన్నారు. పాత అధికారులతోనే పరీక్షలు నిర్వహించడం వలన మళ్లీ అక్రమాలు జరిగే అవకాశం ఉందన్నారు. 30 లక్షల మంది గ్రూప్–1 అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడకుండా అధికారులను మార్చాలన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకుంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి నిరుద్యోగులు, విద్యార్థులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ నేతలు వేణుగోపాల్, అంబేడ్కర్, ప్రవీణ్, జీవన్ నాయక్, అంజి, యుగంధర్, రాజు, చందు, ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఈ చిన్నారులకు దిక్కెవరు?

- తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలు
- ఆలనాపాలనా చూసే వారు లేక అవస్థలు

బంజారాహిల్స్: తండ్రి చనిపోయి..ఆ విషాదం నుంచి ఇంకా తేరుకోక ముందే తల్లి కూడా మృత్యువాత పడడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఎటు వెళ్లాలతో తెలియక...ఏయం చేయాలో పాలుపోక కుమిలికుమిలి ఏడుస్తున్నారు. వీరి దయనీయ స్థితిపై యావత్తు బస్తీ విషాదంలో మునిగింది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్లితే.. నల్గొండ జిల్లా సూర్యాపేట సమీపంలోని అరవపల్లి కాసర్లపాడు గ్రామానికి చెందిన బాసాని విష్ణు, సంధ్య దంపతులు పొట్ట చేతపట్టుకుని నగరానికి వచ్చి ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ఉంటున్నారు. విష్ణు పెయింటర్‌గా పని చేస్తుండగా భార్య సంధ్య షేక్‌పేట్‌లోని ఓ షాపులో పనిచేస్తుంది. వీరి పెద్ద కూతురు రూప(14) స్థానిక ఎస్‌ఎల్‌ఎన్ స్కూల్‌లో 9వ తరగతి, రెండవ కూతురు నందూ (12) గోల్కొండ గురుకుల పాఠశాలలో 7వ తరగతి, కొడుకు మణికంఠ (7) స్థానిక ఈశ్వర్ విద్యానికేతన్‌లో యూకేజీ చదువుతున్నారు. తల్లిదండ్రులు పని చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివిస్తుండగా..గత ఏడాది మే 30వ తేదీన గొడవల కారణంగా విష్ణు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పిల్లల భారం నెత్తికెత్తుకున్న సంధ్య(32) షాపులో పనిచేస్తూ..పిల్లలను చదివిస్తూ తండ్రి లేని లోటు తీరుస్తున్న సమయంలోనే విధికి కన్ను కుట్టింది. రెండ్రోజుల క్రితం ఆమె విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై కన్నుమూసింది. తన భర్త అంత్యక్రియలను ఆమె నిర్వహించగా.. తాజా పరిణామం నేపథ్యంలో తల్లి అంత్యక్రియలను ముగ్గురు చిన్నారులు నిర్వహించారు. ఈ ఘటనతో ఇప్పుడు ముగ్గురి చిన్నారుల బాధ్యత ఎవరు చూస్తారనే ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కసారిగా తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ కుటుంబం ముఖచిత్రమే మారిపోయి పిల్లలు రోడ్డున పడ్డారు. వీరిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, స్వచ్ఛంద సంస్థలను స్థానికులు కోరుతున్నారు.



తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ముగ్గురు చిన్నారులు..

క్లుప్తంగా

సాగర్ రింగ్ రోడ్డు వద్ద ట్రాఫిక్ మళ్లింపులు

నాగోలు: సాగర్ రింగ్ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పనుల దృష్ట్యా ఇబ్రహీంపట్నం రోడ్డు, ఓఆర్‌ఆర్ బొంగుళూర్ నుంచి సాగర్ రింగ్ రోడ్ వైపు వచ్చే వాహనాల రాకపోకలు ఈ నెల 30 వరకు దారి మళ్లిస్తున్నట్లు రాచకొండ ట్రాఫిక్ డీసీపీ డి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ రింగ్ రోడ్ వైపు వెళ్లే వాహనదారులు గమనించాలని పోలీసులు సూచించారు. ఆర్టీసీ బస్సులు, కంటైనర్లు, గూడ్స్ వాహనాలు వంటి భారీ వాహనాలు బీఎన్‌రెడ్డి జంక్షన్ వద్ద ఎడమ మలుపు నుంచి..తెలంగాణ చౌరస్తా జేపీ రోడ్- టీకేఆర్ కమాన్ మీదుగా సాగర్ రింగ్ రోడ్ వైపుకి మళ్లిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, మధ్యస్థ నాలుగు చక్రాల వాహనాలు బీఎన్‌రెడ్డి జంక్షన్-హస్తినాపురం-ఓంకార్ నగర్ వద్ద ఎడమ మలుపు నుంచి బీడీఎస్ ఎంఎంఎస్ హాస్పిటల్ మీదుగా సాగర్ రింగ్ రోడ్ వైపుకి మళ్లించబడతాయని తెలిపారు. ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 8712662999కు ఫోన్ చేయలని సూచించారు.

ఐఐటీ హైదరాబాద్‌తో 'మనూ' ఒప్పందం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని హెచ్‌కే షేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్(హెచ్‌కేఎస్‌సీడీఎస్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒప్పందంపై ఉర్దూ యూనివర్శిటీ నుంచి ఇన్‌చార్జీ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ-2 ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మహమూద్, ఐఐటీ హైదరాబాద్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ సంతకాలు చేశారు. డెక్కన్ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నీరు, గాలి, పర్యావరణం, జీవనోపాధికి సంబంధించిన అంశాలపై పనిచేయడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు.

స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: హెచ్‌సీయూలో స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులు కోరుతున్నారు. హెచ్‌సీయూ, ది ఎంటర్‌ప్రెన్యూర్ జోన్ (టీఈజెడ్-స్టార్టప్ యాక్సిలరేటర్) సంయుక్తంగా ఎస్పైర్ స్టార్టప్ లాంచర్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను కోరుతున్నారు. ఇది స్టార్టప్‌లను ప్రారంభించడం, అభివృద్ధి చేయడంలో సహాయపడటానికి వారికి సలహాలు ఇస్తుంది. ఈ కార్యక్రమాన్ని జూన్ 24 నుంచి ప్రారంభించి సెప్టెంబర్ 9వ తేదీ వరకు కొనసాగిస్తారు. అర్హులైన వారు జూన్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి.

రైలు కిందపడి రైతు ఆత్మహత్య

కాచిగూడ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రైతు జీవితంపై విరక్తి చెందిన రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం వివరాలు..రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన దెడ్డ రామయ్య కుమారుడు ఈశ్వరయ్య(49) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుండగా..ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందాడు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఈశ్వరయ్య మంగళవారం జామై ఉస్మానియా-విద్యానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య ఓ రైలు కింద పడి ఆత్యహత్యకు పాల్పడ్డాడు. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ పదార్థాలతో మిఠాయిలు తయారీ

స్థావరంపై పోలీసుల దాడులు



దాడుల్లో పాల్గొన్న ఏసీపీ దామోదర్ రెడ్డి

గౌలిపురా: మిఠాయిలు తయారు చేయడానికి వినియోగించే కోవా, కలాకాన్‌లను కల్తీ పదార్థాలతో తయారు చేస్తున్న ఓ ముఠాను దక్షిణ మండలం పోలీసులు మొఘల్‌పురా పోలీసులతో కలిసి పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నకిలీ పదార్థాలను స్వాధీనం చేసుకొని ఫుడ్‌సేఫ్టీ అధికారులకు అప్పగించారు. మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతానికి చెందిన భోళాశంకర్ పాతబస్తీ లాల్‌దర్వాజా ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పాలపొడి, డాల్డా, నూనె, చక్కెర, రవ్వ తదితర పదార్థాలను ఉపయోగించి కల్తీ కోవా, కలాకాన్‌ను తయారు చేస్తూ స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నాడు. ఈమేరకు సమాచారం అందడంతో దాడి చేసి కల్తీ కోవా, కలాకాన్‌తో పాటు పెద్ద ఎత్తున ముడి సరుకులు స్వాధీనం చేసుకొని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న పదార్థాలను ల్యాబ్‌కు పంపించామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మీర్‌చౌక్ ఏసీపీ దామోదర్ రెడ్డి, ఎస్సై అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

న్యాయమూర్తిని కలిసిన పోలీసు అధికారులు



వెంగళరావునగర్ : నూతనంగా ఏర్పాటైన మధురానగర్ పోలీస్ స్టేషన్ అధికారులు మంగళవారం నాంపల్లి 14వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కనిహ్యా లాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తికి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. మేజిస్ట్రేట్‌ను కలిసిన వారిలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐలు యుగంధర్, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మధురానగర్ పీఎస్‌కు వాటర్‌కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

వెంగళరావునగర్ : నూతనంగా ఏర్పాటు చేసిన మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు మధురానగర్ కాలనీ మాజీ సభ్యుడు, సంఘ సేవకులు ఇమ్మడి రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులు వాటర్ కూలర్‌ను అందజేశారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కూలర్‌ను ప్రారంభించారు. వేసవిలో పోలీసు సిబ్బంది, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. స్టేషన్‌కు కూలర్‌ను అందజేసిన రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఇమ్మడి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



జలమండలి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్ : నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. కోట్లతో నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రారంభించిన సివరేజీ, మంచినీటి పైపులైన్ల పనులు ఇంకా కొనసాగుతున్నాయని, యుద్ధ ప్రాతిపదికన వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



తరుణ్‌కుమార్ (ఫైల్)

వెంగళరావునగర్ : కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన గజ్జల తరుణ్‌కుమార్ గత నెల 30న స్నేహితులతో కలిసి బయటికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అతడిని మందలించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో తాను బయటికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లిపోయిన తరుణ్ ఇంటికి తిరిగా రాకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల మధురానగర్‌లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కావడంతో మంగళవారం అక్కడ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి, వ్యర్థాల తొలగింపు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయక నగర్ నుంచి బసవతారక నగర్ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పేరుకుపోయిన మట్టిని తొలగించాలని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్ఎంసి అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం ఆయా ప్రాంతాల్లో మట్టి, వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

సరిహద్దులు మారాయ్..

- మారిన బంజారాహిల్స్ పీఎస్ సరిహద్దులు
- సెక్టార్ల కేటాయింపులు పూర్తి

బంజారాహిల్స్: పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇటీవల చేపట్టిన ఠాణాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధినుంచి కొన్ని ప్రాంతాలను ఫిలింనగర్, జూబ్లీహిల్స్, మసాబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో విలీనం చేశారు. దీంతో ప్రజలకు మరిన్ని పోలీస్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి.



బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్..

విభజనలో భాగంగా బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో మిగిలిన ప్రాంతాలు, సెక్టార్ ఎస్‌ఐలు, వారి ఫోన్‌నెంబర్ల వివరాలు ఇవీ

- బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ (8712660450)
- డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ (8712660449
- అడ్మిన్ ఎస్‌ఐ: బాలరాజు(8712660456)
- డీఎస్‌ఐ: వి.రాంబాబు (8712660457)

సెక్టార్-1. కే. వెంకటేష్ (8712660451)

శ్రీనికేతన్‌కాలనీ, కెన్స్ హోటల్, చంటి మెస్, సాగర్‌సొసైటీ , అరోరా కాలనీ, శ్రీనగర్‌కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కమలాపురి కాలనీ ఫేజ్-3, గ్రీన్ బావార్చి మెయిన్‌రోడ్, జవహర్‌కాలనీ, ఇందిరా నగర్, ఎన్‌టీఆర్ ట్రస్ట్‌భవన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, పార్క్ హయత్ హోటల్, షేక్‌పేట మండల కార్యాలయం, శ్రీనగర్‌కాలనీ ఏటీఎమ్ చౌరస్తా, ఎస్‌ఎన్‌టీ జంక్షన్.

సెక్టార్-2. ఎస్.నవీన్‌రెడ్డి (8712660453)

పంజాగుట్ట స్మశానవాటిక, దోభీఘాట్‌బస్తీ, దేవరకొండ బస్తీ, టైమ్స్ ఆఫ్‌ఇండియా, అస్కి , నవోదయ కాలనీ, టీవీ 9, బంజారాహిల్స్ రోడ్‌నెం 3, గ్రీన్‌మాస్క్, షౌకత్‌నగర్, యూబీఐ కాలనీ, ఆర్‌కే సినీప్లెక్స్, లూసిడ్, రాజు అండ్ రావు కాలనీ, శ్రీ వెంకటేశ్వర నగర్, యానిమల్ కేర్ ఆస్పత్రి, సుఖ్‌దేవ్ నగర్, గాంధీపుర బస్తీ, సంజయ్‌నగర్, వెంగళరావు పార్క్, రాడిసన్ హోటల్, బంజారాహిల్స్ రోడ్‌నెం 7నుంచి రోడ్‌నెం 1దాకా ఎడమవైపు ప్రాంతాలు.

సెక్టార్-3 . ఎస్.కరుణాకర్‌రెడ్డి (8712660454)

బీఎస్ రెడ్డి కాలనీ, వెంకటేశ్వరనగర్, నందినగర్, నూర్‌నగర్, ఇబ్రహీంనగర్, గురుబ్రహ్మనగర్, ఏఐఎస్ క్వార్టర్స్, ఇన్‌కంట్యాక్స్ క్వార్టర్స్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, బంజారాహిల్స్ రోడ్‌నెం 14, ఆశా ఆస్పత్రి, సురేష్ వీల్స్, అమృతా ఎన్‌క్లేవ్, ప్రేమ్ పర్వత్ విల్లాస్, బ్రిగేడ్-7, మీసేవా , పట్టణ ఆరోగ్య కేంద్రం, జహీరానగర్, రోడ్ నెం 9, నామ్‌దారీ టెంట్‌హౌజ్, సప్తపర్ణి, బంజారాహిల్స్‌రోడ్‌నెం 10 స్టార్ ఆస్పత్రి, గౌరీశంకర్‌కాలనీ, కార్వీ, పంచవటి కాలనీ.

సెక్టార్-4. పి.రవీందర్ (8712660458)

బంజారాహిల్స్‌రోడ్‌నెం 12, ఎన్‌బీటీనగర్ కమాన్, మిథిలానగర్, ఎన్‌బీటీనగర్, సయ్యద్‌నగర్, ఫస్ట్ ల్యాన్సర్, ఎమ్మెల్యే కాలనీ, డీశ్రీనివాస్ నివాసం, పవన్ కల్యాణ్ పాత ఇల్లు, అమృతా వ్యాలీ, తెలంగాణ భవన్, కళింగ భవన్, జగన్నాథ టెంపుల్, సిటీ న్యూరో సెంటర్, వీ 6 ఆఫీసు, ఎమ్మెల్యే కాలనీ క్లబ్, ఏసీబీ కార్యాలయం, షరోన్ చర్చి, కమాండ్ కంట్రోల్, వేమిరెడ్డి ఎన్‌క్లేవ్, గ్రీన్‌బంజారా కాలనీ, ఆనంద్ బంజారా కాలనీ, జీహెచ్ఎంసీ ట్రైనింగ్‌సెంటర్, మినిస్టర్ క్వార్టర్స్, ఎన్‌బీనగర్, శ్రీరాంనగర్, అంబేడ్కర్‌నగర్, రోడ్‌నెం 13, రోడ్‌నెం 13ఏ, తాజ్ బంజారా హోటల్, ఉదయ్‌నగర్, సింగాడకుంట, సింగాడ బస్తీ, దోభీఘాట్ ఎడమవైపు.

ఆర్‌పీఐ తెలంగాణ కార్యవర్గం రద్దు



మాట్లాడుతున్న పేరం శివనాగేశ్వర్ రావుగౌడ్

పంజగుట్ట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే ఆదేశాల మేరకు ఆర్‌పీఐ తెలంగాణ రాష్ట్ర, జిల్లా, కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు పార్టీ జాతీయ సెక్రటరీ పేరం శివనాగేశ్వర్ రావు గౌడ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. త్వరలోనే రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుత కార్యవర్గాన్ని పూర్తిగా రద్దుచేశామన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కనీసం 5 సీట్లు గెలిచి తమ పార్టీ అధ్యక్షునికి కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆర్‌పీఐతోనే ప్రజాస్వామ్య పాలన సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో 119 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామని అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించనున్నట్లు తెలిపారు. తమ పార్టీ పూర్తి కార్యవర్గాన్ని రద్దు చేశామని, ఎవరైనా పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులుగా చెప్పుకుంటూ సమావేశాలు ఏర్పాటు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు గోరక్ సింగ్, సామ్యూల్, రహమాన్, రోజారాణి, రత్న ప్రసాద్, అస్లమ్, రవి, శ్రీనివాసరావు, నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంజారాహిల్స్: కిటికీ ఊచలు తొలగించి ఇంట్లోకి దూరిన ఆగంతకుడు నగదు, నగలతో ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్‌రోడ్‌నెం 12లోని కిమ్టీ కాలనీ గోకుల్ రెసిడెన్సీలో మహ్మద్ అహ్మద్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన అహ్మద్ మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి బెడ్‌రూమ్‌లోని వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. అల్మారాలో ఉండాల్సిన రూ.2.50 లక్షల నగదు, వజ్రాభరణాలు కనిపించకపోవడంతో అతను బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు, క్లూస్ టీమ్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కిటికీ ఊచలు తొలగించి లోనికి ప్రవేశించి చోరీ చేసినట్లుగా గుర్తించారు. సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా ఒక్కడే ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలు నిలిపివేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

పంజగుట్ట: స్టేట్ బ్యాంక్ ఆఫ్‌ఇండియా (ఎస్‌బీఐ)లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని, వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వనం కిషోర్, సెక్రటరీ అశోక్‌తో కలిసి ఆయన మాట్లాడారు.. రాష్ట్రంలో ఎస్‌బీఐలో 7వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2017లో ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన ఆయన తమ సమస్యలను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వద్దకు తీసుకెళ్లి బోనస్, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అయితే ఎస్‌బీఐ యాజమాన్యం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తిస్థాయి వేతనాలు ఇవ్వకుండా జీతాల్లో కోతలు విధిస్తున్నారని, పీఎఫ్ చెల్లింపులోనూ కోత విధించడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.12 వేలు వేతనం ఇస్తూ 12 గంటలపాటు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, ఇప్పుడు మరింత ఇబ్బందులకు గురిచేసేందుకు బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం నగరానికి రానున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలకు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న బదిలీలు వెంటనే ఆపాలని, కనీస వేతనచట్టం అమలు చేసి పూర్తి స్థాయిలో వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ఎస్‌బీఐలో ఖాళీగా ఉన్న 10వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రవి తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 వేలు కనీస వేతనం చెల్లించాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రీతంసింగ్ ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతో పాటు జీహెచ్ఎంసీలో ఎన్నో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులు కనీస వేతనాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే వివిధ విభాగాల్లో పని చేస్తున్న 11000 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం మున్సిపల్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సమ్మర్ ఉత్సవ్ మేళా



సమ్మర్ ఉత్సవ్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్, గేమింగ్ జోన్

ఖైరతాబాద్: సాగర తీరంలో ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది. కుటుంబ సమేతంగా విచ్చేసిన వారంతా ఉత్సాహంగా గడిపేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేసిన గేమింగ్ జోన్, వివిధ రకాల స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు మేళాను సందర్శించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మేళాలో ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

ఈవ్ టీజింగ్ కేసులో నిందితుడికి జైలు



నిందితుడు బొల్లి బాలమద్దిలేటి

బంజారాహిల్స్: తనవద్ద పని చేస్తున్న ఉద్యోగి భార్యపై కన్నేసి ఆమెను వెంబడిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్‌రోడ్ నెం 2లోని ఇందిరానగర్‌లో నివసించే బొల్లి బాలమద్దిలేటి ప్రైవేటు సంస్థలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. అదే సంస్థలో హౌజ్ కీపింగ్ ఉద్యోగిని ఐదు రోజుల క్రితం బైక్‌పై అతడి ఇంటి వద్ద దింపేందుకు వచ్చిన బాలమద్దిలేటి సదరు ఉద్యోగి భార్యపై కన్నేశాడు. మర్నాడు ఆమె భర్త పనికి వెళ్లిన సమయంలో ఆమె ఇంటికి వచ్చిన మద్దిలేటి ఆమెతో మాటలు కలిపాడు. రెండ్రోజుల పాటు ఆమెను వెంబడిస్తూ వేధించడమే గాక తరచూ ఫోన్లు చేస్తూ అసభ్యకంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం నాంపల్లిలోని 10వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు ఎదుట హాజరు పర్చారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 8 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

దశాబ్ది ఉత్సవాలను రాజకీయం చేస్తున్నారు



మాట్లాడుతున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: దశాబ్ది ఉత్సవాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను రూ.102 కోట్లతో 21 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రతి అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటోందన్నారు. ఎక్కడా ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. ఎంతో ఆర్భాటంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన పాలకులు అంబేడ్కర్ సందేశాన్ని, రాజ్యాంగాన్ని ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. సమష్టిగా ఉత్సవాలు నిర్వహించాల్సిన బీఆర్‌ఎస్ నాయకులు, చివరకు అధికారులు కూడా ప్రతిపక్షాలను పట్టించుకోవడం లేదన్నారు. సురక్షా దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్‌లో పోలీస్‌స్టేషన్ ప్రారంభం రోజే కార్పొరేటర్ భర్త పోలీసులపై దురుసుగా ప్రవర్తించినా అతడిపై నామమాత్రంగా కేసులు నమోదుచేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులపై దాడులు చేసినవారే నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాలుపంచుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికే బస్తీబాట



బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిలింనగర్: అధికారులు పనులు చేస్తేనే ప్రజాప్రతినిధులుగా తాము ప్రజల్లో తిరగగలమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్ నగర్, స్వామి వివేకానందనగర్, బాబునాయుడు నగర్‌బస్తీల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు అధికారులతో కలిసి బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వామి వివేకానందనగర్ బస్తీ కమ్యూనిటీహాల్ ఫ్లోరింగ్ దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఈఈ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు. జైల్‌సింగ్‌నగర్ బస్తీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. ప్యాచ్‌వర్క్ పనులు పూర్తిచేయాలని, నిర్మాణ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో మంచినీరు ప్రెషర్‌రావడం లేదని, బూస్టర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు రావడం లేదని మహిళలు ఫిర్యాదులు చేయగా అర్హులందరికీ త్వరలోనే కార్డులు అందిస్తామని హామీ ఇచ్చారు. దళితబంధు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. దుర్గాభవానీ నగర్‌బస్తీలో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్డు పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. స్వామీ వివేకానంద నగర్‌నుంచి బాబు నాయుడు నగర్ బస్తీకి కనెక్టింగ్ సీసీ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వీధిదీపాలపై ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని, బస్తీల్లో వీడీసీసీ రోడ్లు వేస్తే ఎక్కువ కాలం ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వెంకటేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని గౌరీశంకర్‌కాలనీలో రూ.42లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసిశంకుస్థాపన చేశారు.

వైభవంగా దైవ సన్నిధానం బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న స్వాత్మానందేంద్ర స్వామి

ఫిలింనగర్: విశాఖశ్రీ శారదా పీఠ పాలిత ఫిలింనగర్ దైవసన్నిధానం 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం నిత్యార్చన, మండప పూజ, నిత్య హోమం, మహా మృత్యుంజయ హోమం, మహా పూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర స్వామి సరస్వతి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గరుడ సేవ, హారతి, ధ్వజ అవరోహణం తదితర కార్యక్రమాలు సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కాజా సూర్యనారాయణ, పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



వేడుకల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి, శ్రీ ఆండాల్ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా సంప్రోక్షణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం ఉత్సవాల్లో భాగంగా యాగశాల వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం చతుర్దశ కలశ, నవ కలశ స్నపనం, మహా శాంతి తిరువంజనం, శయనాధివాసం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, లోకల్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ భాస్కర్‌రావు, రవి ప్రసాద్, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



విజయారెడ్డిని సత్కరిస్తున్న గాంధీతాతా నగర్ వాసులు ..

పంజగుట్ట: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాలు జరగకుండా అడ్డుకోవడంతో పాటు కేసులను ఛేదించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. గాంధీతాతా నగర్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని బస్తీ అధ్యక్షులు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి రమేష్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 కెమెరాలను బాగుచేయించారు. మంగళవారం సదరు కెమెరాలను పరిశీలించేందుకు వచ్చిన విజయారెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.

రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: యువత చరిత్రను తెలుసుకోవాలని హీరో శ్రీకాంత్ అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం..ఆ తర్వాత ఇప్పటి ఆధునిక భారతావని ప్రస్థానం ఎలా సాగిందన్న దానిపై నేటితరం అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ నెల 18న నిర్వహిస్తున్న 'రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్' మంచి ఈవెంట్‌గా అభివర్ణించారు. 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ (ఖైరతాబాద్) డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి మంగళవారం క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ ఆవిష్కరించారు. క్విజ్ లో పాల్గొనదలచిన వారు 7661899899 కు ఈ నెల 17 వరకు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు. రిఫరల్ కోడ్ లో రోహిణ్ అని టైప్ చేయాలని కోరారు. క్విజ్ లో విజేతలకు మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, ల్యాప్‌టాప్స్, మొబైల్ ఫోన్స్, ట్యాబ్స్, కన్సొలేషన్ బహుమతులు గెలుచుకునే అవకాశం ఉంది.

రాక్ గార్డెన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



రాక్ గార్డెన్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు

పంజగుట్ట: ఎట్టకేలకు ప్రేమ్‌నగర్ లోని రాక్ గార్డెన్స్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పార్క్‌ను అభివృద్ధి చేసి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ప్రేమనగర్ సంక్షేమ సంఘం, జై జవాన్ జై కిసాన్ యువజన సంఘం నాయకులు నగర మేయర్, స్థానిక కార్పొరేటర్ గద్వాల విజయలక్ష్మికి గతంలో వినతి పత్రం అందజేశారు. మేయర్ ఆదేశాల మేరకు మంగళవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, కొత్త పవర్ బోర్‌వెల్, ప్రవేశ ద్వారం, ఇన్‌డోర్ గేమ్స్ ఆడుకునే సదుపాయంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు ఈ నెల 19న హరితహారం కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రేమ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు విశ్వనాథం, ప్రధానకార్యదర్శి కె.భగవాన్‌దాస్, కోశాధికారి సుధీర్ కుమార్, మున్నా, కె.ఆర్. నర్సింగ్‌రావు, బాబు, శ్రీకాంత్ మంగళవారం పనులను పరిశీలించారు.


వైద్య పీజీ సీట్ల పంట

ఈ ఏడాది ఏపీకి అదనంగా 510 పీజీ సీట్లు

సాక్షి, అమరావతి: ఇటు ఎంబీబీఎస్ సీట్లు.. అటు పీజీ సీట్లు! ఒకేసారి కొత్తగా 750 ఎంబీబీఎస్ సీట్లతోపాటు అదనంగా 510 పీజీ వైద్య సీట్లతో రాష్ట్ర వైద్య విద్యా రంగంలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. వైద్య విద్యలో ఆంధ్రప్రదేశ్ గేమ్ ఛేంజర్‌గా అవతరిస్తోంది. ఒక్క ఏడాదిలోనే వీటిని సాధించడం ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్ర వైద్య విద్యా రంగం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పీజీ సీట్లు పెరుగుతున్నాయి. వైద్య విద్యను బలోపేతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గత నాలుగేళ్లలో ఏకంగా 702 పీజీ సీట్లు కొత్తగా సమకూరడం గమనార్హం. అధికారంలోకి రాగానే ప్రభుత్వ వైద్య రంగాన్ని తీర్చిదిద్దుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్తగా 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తూనే అప్పటికే ఉన్న 11 మెడికల్ కాలేజీల్లో వసతులను మెరుగు పరిచారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా కళాశాలల్లో వైద్యులు, సిబ్బందిని సమకూర్చడంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. ఫలితంగా 1956 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో వైద్య సీట్లు పెరిగాయి.

పీజీ సీట్లు ఇంకా పెరిగే చాన్స్

రాష్ట్రంలో పది వైద్య కళాశాలల్లో నాలుగేళ్ల క్రితం వరకూ 966 పీజీ సీట్లు మాత్రమే ఉన్నాయి. నెల్లూరు జిల్లా ఏసీఎస్ఆర్ కళాశాలలో ఒక్క పీజీ సీటు కూడా లేదు. అలాంటిది నాలుగేళ్లలో వరుసగా 2020లో 24 సీట్లు, 2021లో 31 సీట్లు, 2022లో 137 సీట్లు చొప్పున రాష్ట్రానికి అదనంగా పీజీ సీట్లు సమకూరాయి. 2023లో 737 సీట్లు పెంచాలని ఎన్ఎంసీకి ప్రతిపాదించగా ఇప్పటి వరకు 510 సీట్లు మంజూరయ్యాయి. మిగిలిన సీట్ల పెంపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విద్యా సంవత్సరంలో పీజీ సీట్ల ప్రవేశాలకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ఈలోగా మరికొన్ని సీట్లు రాష్ట్రానికి దక్కే అవకాశం ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత నాలుగేళ్లలోనే ఏకంగా 702 సీట్లు పెరగడంతో ఇప్పటికే 1,668 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 42.08 శాతం సీట్లు పెరిగాయి. ఏసీఎస్ఆర్ కళాశాల కూడా పీజీ సీట్లలో బోణీ కొట్టింది. ప్రస్తుతం ఆ కళాశాలలోనూ 24 పీజీ సీట్లు ఉన్నాయి. ఇక ఈ ఏడాది ఐదు కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు కొత్తగా సమకూరాయి.

పోలవరం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, అధికారులు

పోలవరం ఇక చకచకా..

ప్రాజెక్టు పనుల పురోగతిపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏరియల్ సర్వే

గడువులోగా ఆయకట్టుకు నీళ్లు.. రైతులకు ప్రయోజనం

- మండుటెండలో ప్రాజెక్టు ప్రాంతంలో కలియతిరుగుతూ పనులు పరిశీలించిన సీఎం జగన్
- ప్రాజెక్టు వద్దే అధికారులతో సమీక్ష.. దిశా నిర్దేశం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసి, ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చాలని జల వనరుల శాఖ అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. టీడీపీ సర్కార్ హయాంలో కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు చేసిన తప్పిదం వల్ల గోదావరి వరదల ఉధృతికి ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నదీ గర్భంలో ఇసుక తిన్నెలు కోతకు గురై ఏర్పడిన అగాధాలను ఇసుకతో నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా సమాంతరంగా 'యూ'ఆకారంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ పనులు పూర్తయితే.. ఇప్పటికే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తయిన నేపథ్యంలో వాటి మధ్య గోదావరి వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ (ప్రధాన) డ్యామ్ పనులు చేపట్టి.. గడువులోగా పూర్తి చేయడానికి మార్గం సుగమం అవుతుందని సూచించారు. మంగళవారం ఉదయం 9.10 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం వైఎస్ జగన్.. 9.50కి పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ఏరియల్ సర్వే అనంతరం హెలికాప్టర్ దిగి నేరుగా పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే వద్దకు చేరుకున్నారు.

మండుటెండలో కలియతిరుగుతూ..

మండుటెండలో తీవ్రమైన ఉక్కపోత మధ్య సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టు పనులను ఒక గంటా 40 నిమిషాలపాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. టీడీపీ సర్కార్ హయాంలో ఎగువ కాఫర్ డ్యామ్‌లో రెండు వైపులా 800 మీటర్లు ఖాళీ వదిలేసి, అరకొరగా చేసిన పనులను.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 44 మీటర్ల ఎత్తుతో పూర్తయిన ఎగువ కాఫర్ డ్యామ్ పనులను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గోదావరి వరదల ఉధృతికి దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురవడం వల్ల ఏర్పడిన అగాధాన్ని పూడ్చి.. 31.5 మీటర్ల ఎత్తుతో ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేసిన ఆ డ్యామ్‌ను పరిశీలించారు. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలలో ఇసుకను నింపి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే పనులను నిశితంగా పరిశీలించారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతంలో కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడంపై అధికారులతో చర్చించారు.

> గత ప్రభుత్వ హయాంలో ఎగువ కాఫర్ డ్యాంలో ఖాళీలు వదిలేశారు. ఈ ఖాళీల గుండా వరద నీరు అతి వేగంతో ప్రవహించడం వల్ల ప్రాజెక్టు నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి కీలకమైన డయాఫ్రమ్ వాల్ దారుణంగా దెబ్బతింది. దీని వల్ల ప్రాజెక్టు పనులు ఆలస్యం కావడమే కాదు.. వాటిని చక్కదిద్దడం కోసం రూ.2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇది మాత్రం ఎల్లో మీడియాకు కనిపించలేదు. ఎందుకంటే.. అప్పట్లో ఆ పనులను రామోజీరావు బంధువులకే నామినేషన్ పద్ధతిలో అప్పగించారు కాబట్టి. ఆ తప్పిదాలన్నింటినీ సరిదిద్దుతూ.. ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం.
>
> – సీఎం వైఎస్ జగన్

సీఎం చొరవ వల్లే నిధులు

క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత పోలవరం ప్రాజెక్టు వద్దే మీటింగ్ హాల్‌లో జల వనరుల శాఖ అధికారులతో సీఎం వైఎస్ జగన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులో తొలి దశను పూర్తి చేయడానికి అవసరమైన రూ.12,911.15 కోట్లను విడుదల చేసేందుకు ఆమోదం తెలుపుతూ కేంద్ర ఆర్థిక శాఖ మెమోరాండం జారీ చేసిందని జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సీఎంకు వివరించారు. గత ప్రభుత్వం ప్రణాళిక లోపంతో చేపట్టిన పనుల వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చివేసి యథా స్థితికి తేవడం, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణాల కోసం రూ.2 వేల కోట్లు ఇచ్చేందుకు అంగీకరించిందని ఈఎన్‌సీ నారాయణరెడ్డి తెలిపారు. బిల్లుల చెల్లింపులో కాంపొనెంట్(విభాగాల) వారీ విధించిన పరిమితులను తొలగించేందుకు కూడా కేంద్రం అంగీకరించిందని అధికారులు వివరించారు. మీ (సీఎం) చొరవ వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు.

చిన్న సమస్యను విపత్తుగా చూపిస్తున్నారు

గైడ్ వాల్‌లో ఏర్పడిన చిన్న సమస్యను అధికారులు సీఎం వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్లతోనే గైడ్ వాల్ పనులు చేశామని చెప్పారు. ప్రస్తుత సమస్యను కూడా సీడబ్ల్యూసీకి నివేదించామన్నారు. గైడ్ వాల్‌లో ఉత్పన్నమైన సమస్యను సరిదిద్దడం పెద్ద విషయం కాదని.. సీడబ్ల్యూసీ అధికారులు పరిశీలించాక.. వారి సూచనల మేరకు వెంటనే మరమ్మతులు చేస్తామని వివరించారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ స్పందిస్తూ.. ప్రాజెక్టు నిర్మాణాల్లో సహజంగానే చిన్న చిన్న సమస్యలు వస్తాయన్నారు. వాటిని గమనించుకుంటూ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో ఇలాంటి ఒక చిన్న సమస్యను విపత్తుగా చూపించే దౌర్భాగ్య మీడియా మన రాష్ట్రంలో ఉందని ఎత్తిచూపారు. ప్రాజెక్టు స్ట్రక్చర్‌తో ఏమాత్రం సంబంధం లేని గైడ్ వాల్‌లో ఉత్పన్నమైన చిన్న సమస్యను పెద్ద విపత్తులా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని కూడా పాజిటివ్‌గా తీసుకుని సరిదిద్దే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



ఆహారం బాగుంటే అది మనకు జవసత్వాలనిస్తుంది. అది కలుషితమైతే ఆరోగ్యాన్నే దెబ్బతీస్తుంది.. ఒక్కోసారి ప్రాణాన్నే తీస్తుంది! కలుషిత లేదా నాణ్యత లేని ఆహారం వల్ల ప్రతి ఏడాది 60 కోట్ల మంది దాదాపు 200 రకాల అనారోగ్యాల పాలవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది పేదలు, పిల్లలు, యువతే. ఇందులో ప్రతి ఏటా 4 లక్షల 20 వేల మంది చనిపోతున్నారు. ఆహారం ద్వారా వచ్చే అనారోగ్యాలను అరికడితే ఈ మరణాలను నివారించవచ్చు. అందుకే, ఈ అంశంపై ప్రజల్లో చైతన్యాన్ని కలిగించేందుకు జూన్ 7న ప్రపంచ ఆహార భద్రతా ప్రమాణాల దినోత్సవం జరుపుకుంటున్నాం.

సురక్షితమైన ఆహారంతో

మేధో, శారీరక సామర్థ్యం

– సాక్షి సాగుబడి డెస్క్

ఆహార భద్రతా ప్రమాణాలతో ప్రాణరక్షణతో పాటు జీవనోపాధి

- కలుషితాహారానికి ఏటా 4.2 లక్షల మంది బలి!
- బాధితులు ఏటా 60 కోట్ల మంది
- ఆహార నాణ్యతా లోపం వల్ల 200 జబ్బులు
- 60 ఏళ్లుగా ఆహార ప్రమాణాలను నిర్దేశిస్తున్న కోడెక్స్ ఎలిమెంటేరియస్ కమిషన్

జూన్ 7న ప్రపంచ ఆహార భద్రతా ప్రమాణాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ప్రతి 10 మందిలో ఒకరు!

ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది మందిలో ఒకరు కలుషిత ఆహారం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. పేద, ధనిక అని తేడా లేదు. అన్ని దేశాల్లోనూ ఆహార నాణ్యతా సమస్యలు తలెత్తుతున్నాయి.

బాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు లేదా భార లోహాలు వంటి రసాయన పదార్థాలతో కలుషితమైన ఆహారం తినడం వల్ల 200కు పైగా వ్యాధులు వస్తున్నాయి.

ఆహార భద్రతా ప్రమాణాలు పాటిస్తే.. అవి అందరి ప్రాణాలనే కాదు, అనేకమంది జీవనోపాధిని కూడా కాపాడతాయి.

ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా 1963లో ఏర్పాటైన కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్.. గత 60 సంవత్సరాలుగా అంతర్జాతీయ ఆహార ప్రమాణాలను నిర్దేశిస్తోంది.

236 ప్రమాణాలు, 84 మార్గదర్శకాలు, 56 ఆచరణాత్మక నియమాలు ఉన్నాయి. ఆహారంలో కలుషితాల గరిష్ట స్థాయికి సంబంధించిన 126 ప్రమాణాలను కోడెక్స్ నిర్దేశిస్తోంది. వీటితో పాటు.. ఆహారోత్పత్తుల తయారీ ప్రక్రియలో కలిపే పదార్థాలకు సంబంధించి.. పురుగుమందుల అవశేషాలు, పశువైద్యంలో వాడే ఔషధాల అవశేషాల గరిష్ట స్థాయిలకు సంబంధించిన 10 వేలకు పైగా పరిమాణాత్మక ప్రమాణాలను కోడెక్స్ అలిమెంటారియస్ కమిషన్ నిర్దేశిస్తోంది.

పశువైద్యంలో ఉపయోగించే యాంటీమైక్రోబయల్ ఔషధాలకు లొంగని మొండి సూక్ష్మక్రిములతో సోకే ఇన్ఫెక్షన్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 లక్షల మంది మరణిస్తున్నారని అంచనా. ఈ మరణాలను తగ్గించేందుకు కూడా ఆహార భద్రతా ప్రమాణాలను కోడెక్స్ నిర్దేశిస్తోంది. 2016 నుంచి 50 అభివృద్ధి చెందుతున్న పేద దేశాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది.

సురక్షితమైన, పోషకవంతమైన ఆహారం మేధో, శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా పిల్లల పెరుగుదలకు, అభివృద్ధికి దోహదపడుతుంది.

ఐరాస నిర్దేశిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆహార భద్రతా ప్రమాణాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థీకృత నేరంగా మారిన మానవ అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. మానవ అక్రమ రవాణా నివారణ కోసం అన్ని ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, రాష్ట్ర పోలీసు మహిళా భద్రతా విభాగం, కార్మికశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ, బచ్‌పన్ బచావో ఆందోళన్ స్వచ్ఛంద సంస్థతో కలిసి రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ట్రాఫికింగ్‌ను ఎదుర్కోవడానికి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు.


నగర వార్తలు

సిటీ హంటర్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: దేశ వ్యాప్తంగా మ్యానీటర్లు, మద గజాలతో పాటు మనుషులు, పంటలకు నష్టం చేస్తున్న అనేక జంతువులను వధించిన సిటీ హంటర్ నవాబ్ షఫత్ అలీ ఖాన్‌కు అరుదైన గుర్తింపు లభించింది. నగరంలోని ఏసీ గార్డ్స్ ప్రాంతానికి చెందిన ఈయన బీహార్ ప్రభుత్వానికి అధికారిక షూటర్‌గా ఉన్నారు. అక్కడి వైశాలి జిల్లాలో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న 10 వేల బ్లూ బుల్స్‌ను ఆయన ఇప్పటి వరకు హతమార్చారు. ఈ నేపథ్యంలో వైశాలి జిల్లాకు చెందిన ప్రముఖ ముఖాయ్ సంఘ్ షఫత్ అలీఖాన్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. సోమవారం అక్కడ జరిగిన కార్యక్రమంలో వైశాలి కలెక్టర్ యశ్పాల్ మీనా, సంఘ్ చైర్మన్ ముఖియా సింగ్ చేతుల మీదుగా అలీఖాన్ అవార్డు అందుకున్నారు.

ఇండియన్ సైక్లింగ్ (పారా) టీమ్ మేనేజర్‌గా దత్తాత్రేయ



దత్తాత్రేయ

చార్మినార్: తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.దత్తాత్రేయ ఇండియన్ సైక్లింగ్ (పారా) టీమ్ మేనేజర్‌గా నియమితులయ్యారు. థాయ్‌లాండ్‌లోని రేయోంగ్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న 11వ ఏషియన్ పారా రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్–2023కు ఇండియన్ సైక్లింగ్ (పారా) టీమ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఆయన ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఆదిత్య మెహతా ఫౌండేషన్ పారా సైక్లిస్టులు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో వైద్యాధికారుల ప్రొవిజనల్, రిజెక్టెడ్ జాబితా

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ జిల్లాలో మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ కోసం గత నెల 20న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్, రిజెక్టెడ్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు www.hyderabad.telangana.gov.in సైట్‌లో జాబితాను పరిశీలించుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

19 లక్షల వాహనాలు..

రెవెన్యూ రూ.1526 కోట్లు

- గణనీయంగా రవాణా శాఖ రంగారెడ్డి జిల్లా రెవెన్యూ పెరుగుదల
- 2023 నాటికి జిల్లాలో వాహనాల సంఖ్య 19 లక్షలు
- యూనిట్ కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు
- రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్ రావు వెల్లడి



ఎల్ఈడీ స్క్రీన్‌ను ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్ రావు తదితరులు

గచ్చిబౌలి: రెండు తెలుగు రాష్ట్రాల్లో రవాణా శాఖ రెవెన్యూలో రూ.1526 కోట్లతో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉందని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రవీణ్ రావు తెలిపారు. మంగళవారం కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో రవాణా శాఖ చేపట్టిన సంస్కరణలను వివరించేందుకు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణికొండలో జిల్లా కార్యాలయ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, ఒకటి రెండు నెలల్లో అద్దె భవనం నుంచి సొంత భవనానికి మార్చనున్నట్లు తెలిపారు. మన్నెగూడలోనూ నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. 2014లో 8 లక్షల వాహనాలు ఉండగా జిల్లా రెవెన్యూ రూ.236 కోట్లు ఉండేదన్నారు. 2023 నాటికి 19 లక్షల వాహనాలతో రెవెన్యూ రూ.1526 కోట్లకు పెరిగిందన్నారు. 2015 నుంచి యూనిట్ ఆఫీస్‌లలో లైసెన్స్‌లు జారీ చేస్తుండటంతో పరిగి, షాద్‌నగర్ ప్రాంతాల వాసులకు కొండాపూర్‌కు రావాల్సి అవసరం తప్పిందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు తెలిపారు. 2017 నుంచి నగదు రహిత విధానం అమలులో ఉందని, నెంబర్ రిజర్వేషన్, బిడ్డింగ్‌లను పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నామన్నారు. టీ యాప్ ఫోలియో ద్వారా రవాణా శాఖ 18 రకాల సేవలను అందిస్తుందని, తద్వారా అడ్రస్ మార్పు, లైసెన్స్ రెన్యూవల్, వాహన యాజమాన్య బదిలీ తదితర అంశాల్లో సమయం ఆదా అవుతుందన్నారు. ఆర్టీఎం వాలెట్ ద్వారా లైసెన్స్, ఆర్సీలను డౌన్‌లోడ్ చేసుకుని తనిఖీల సమయంలో చూపించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రవాణా శాఖ సేవలను కరపత్రాల ద్వారా వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న జిల్లాలోని అన్ని ఆర్టీ కార్యాలయాల్లో మొక్కలు నాటుతామని, 22న అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు సత్యనారాయణ, విజయ రావు, వాసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు సేవలు ఎనలేనివి



చంద్ర రాజేశ్వరరావు జయంతి వేడుకల్లో పాల్గొన్న సురవరం సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కే నారాయణ

హఫీజ్‌పేట్: భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తన ఆస్తులు త్యాగం చేసిన వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సురవరం మాట్లాడుతూ రావినారాయణరెడ్డి, గురువా రెడ్డి, మొహియుద్దీన్‌లతో కలిసి కమ్యూనిస్టు పార్టీని నిర్మించి, సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భౌతికంగా మనతో లేకపోయినా ఆశయాల రూపంలో మనందరితో ఉన్నాడన్నారు. చంద్ర రాజేశ్వరరావు సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధనకు కృషి చేస్తామన్నారు. సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితోనే ఆయన పేరున సీఆర్ ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. వృద్ధాశ్రమం, నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్, లైబ్రరీ, మహిళా సంక్షేమ కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కే రజని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డి కృష్ణకుమారి, ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి, సామూరి తుకారం, డాక్టర్ పి సరస్వతి, రాజేంద్ర రావు, శ్రీనివాస్, సీనియర్ నటులు కాకరాల, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్న కేశవరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేట్ స్కూళ్లల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ ఇవ్వాలని సూచించారు. డీఈఓ ఆదేశాలు జారీ చేయడం పట్ల హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే –టీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్ కుమార్, జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

నిమ్స్ విస్తరణ పనుల పరిశీలన

- ఏర్పాట్లపై కలెక్టర్, నిమ్స్, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీష్‌రావు

లక్డీకాపూల్ : నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా నిర్మించనున్న ఓపీడీ బ్లాక్ నిర్మాణ పనులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు పరిశీలించారు. మంగళవారం మంత్రి కలెక్టర్ అమోయ్ కుమార్‌తో కలిసి నిమ్స్ విస్తరణకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సభాస్థలి, ఏర్పాట్లపై ఆర్అండ్‌బీ, నిమ్స్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో నిమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, ఆర్అండ్‌బీ ఇంజినీర్ శశిధర్ , నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, నిమ్స్ విస్తరణ పనుల నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీ భాస్కర్, ముఖ్యమంత్రి ఓఎస్‌డీ డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే ఎర్రమంజిల్ కాలనీని పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకున్న నిమ్స్ యాజమాన్యం ఆ ప్రాంతంలో నగర ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించింది. ఇందులో భాగంగా తమకు అప్పగించిన స్థలం సరిహద్దుల్లో రాకపోకలను నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో నిమ్స్ నుంచి ఎర్రమంజిల్ కాలనీ మీదుగా బంజారాహిల్స్ వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నిమ్స్ సమీపంలోని బాలాపూర్ బస్తీవాసులు సైతం ఇకపై బంజారాహిల్స్ జీవీకే మాల్ రోడ్డు మీదుగానే రాకపోకలను సాగించాల్సి ఉంటుంది. అయితే మిలీనియం బ్లాక్ వెనుక వైపు ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌కు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రాకపోకలకు వెసులుబాటు కల్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన పూర్తయ్యే వరకు ఆ ప్రాంతంలో ఆంక్షలు అమలులో ఉంటాయని నిమ్స్ విస్తరణ పనుల నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీ భాస్కర్ తెలిపారు.

రెవెన్యూలో బదిలీలకు కసరత్తు

పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లకు తప్పని స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: రెవెన్యూ యంత్రాంగంలో బదిలీలకు కసరత్తు ప్రారంభమైంది. మరో ఆరు మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బదిలీల ప్రక్రియకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒకేచోట పాతుకుపోయిన పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లకు స్థానచలనం కలగనుంది. గ్రేటర్‌లో సుమారు 80 మంది అధికారులు బదిలీ కానున్నారని సమాచారం. హైదరాబాద్ జిల్లా పరిధిలో 32 మంది తహసీల్దార్లు, ఓ రెవెన్యూ డివిజన్ అధికారి, రంగారెడ్డి జిల్లా పరిధిలో సుమారు 25 మంది, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో 22 మంది రెవెన్యూ అధికారులపై బదిలీ వేటు పడనుంది. జులై 15లోగా ఈ ప్రక్రియ పూర్తి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోసైతం భారీగా తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ ముగియగానే తిరిగి వచ్చారు. ఈసారి కూడా తహసీల్దార్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

సంస్కృత కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంటోన్మెంట్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న బోయిన్‌పల్లిలోని వేంకటేశ్వర వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భానోతు సురేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాల అధ్యాపక బృందంతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్కూళ్లు, కళాశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ తత్సమాన కోర్సు అయిన పీడీసీలో ప్రవేశాలకు కనీసం పదో తరగతి, మూడేళ్ల బీఏ (ఓఎల్) కోర్సులో ప్రవేశాలకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని కళాశాలలో నేరుగా లేదా 9951374024 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపక బృందం

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 7-6-2023



అనారోగ్యాలను దూరం చేసే చల్లని చిరునవ్వు ..
విధి నిర్వహణలో అంకితభావం ..
రోగులపాలిట ఆమె అపర నైటింగేల్ ...
సమాజ క్షేమం కోరేవారికి తర తమ భేదాలుండవు అని
తన చేతల్లో చూపుతోంది కామారెడ్డి జిల్లా బాన్సువాడ
ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఆరోగ్యజ్యోతి.

సేవాజ్యోతి

పాతికేళ్లుగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది మన్ననలు అందుకున్నారు ఆరోగ్యజ్యోతి. ఆమె సేవలను గుర్తించి ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నాటక వారు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023' అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. మంగళవారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుని సేవాజ్యోతిగా గుర్తింపు పొందింది ఆరోగ్యజ్యోతి.

బోధన్ పట్టణానికి చెందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తోంది. 1998లో స్టాఫ్ నర్స్ ఉద్యోగంలో చేరి నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండేళ్లు పనిచేసిన ఆమె 2000 సంవత్సరంలో బోధన్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి అక్కడే ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తించింది. 2019 లో హెడ్ నర్స్‌గా పదోన్నతి పొందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి, అక్కడే విధుల్లో కొనసాగుతోంది. కరోనా కాలంలో వైద్యులతో కలిసి రోగులకు ఎన్నో సేవలందించిన ఈ నైటింగేల్ పాతికేళ్ల కాలంలో ఎక్కడ ఉద్యోగం చేసినా విధి నిర్వహణకు అంకితమై పనిచేస్తూ వచ్చింది. దీంతో ఆమె అందరికీ తలలో నాలుకలా మారింది. ఆపరేషన్ థియేటర్‌తోపాటు ప్రసూతి వార్డుల్లోనే ఆమె ఎక్కువగా విధులు నిర్వర్తించింది. అధికారుల నుంచి ఎన్నో మన్ననలు, సామాజిక సేవలకు గాను అవార్డులనూ పొంది సేవాగుణంలో ముందువరసలో నిలిచింది.

మాకెంతో గర్వకారణం

సేవతో అందరి మన్ననలు పొందే ఆరోగ్య జ్యోతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023 అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమంతా గర్వించదగ్గ విషయం. ఈ అవార్డు స్ఫూర్తి మిగతా అందరిలో కలగాలని కోరుకుంటున్నాను.

– డాక్టర్ శ్రీనివాసప్రసాద్,
సూపరింటెండెంట్,
బాన్సువాడ ఏరియా ఆస్పత్రి

అందరి సహకారంతో...

సేవా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది. ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగులు, వైద్యుల సహకారం, ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నాను. నా చిన్నప్పుడు మా అమ్మానాన్నలు ఎంతోమందికి సాయం అందించేవారు. వాళ్లను చూసి నాకూ అలవాటైంది. నా ప్రయత్నాల్లో మా వారు అండగా నిలిచారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను.

– ఆరోగ్యజ్యోతి,
హెడ్‌నర్స్, బాన్సువాడ



కూతురి మరణంతో..

ఆరోగ్య జ్యోతి కూతురు అనుకోని పరిస్థితుల్లో విద్యుత్‌షాక్‌కు గురై మరణించింది. కూతురి మరణంతో ఆవేదనకు గురైన ఆరోగ్యలక్ష్మి తన సేవలను మరింత విస్తృతం చేయాలని సంకల్పించింది. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టింది. వైద్యరంగంలో తన కున్న పరిచయాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేసే కార్యక్రమాలు చేపడుతుంటుంది. బీపీ, షుగర్, గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టి రోగులకు అండగా నిలుస్తోంది. అలాగే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేపట్టి, గర్భిణీలు, బాలింతలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం శిబిరాలు ఏర్పాటు చేసి ఆదుకుంటుంది.



బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్-2023 అవార్డు అందుకుంటున్న ఆరోగ్యజ్యోతి

– ఎస్.వేణుగోపాల్ చారి,
సాక్షి, కామారెడ్డి

మలీషా మాణిక్యమే

మనలో టాలెంట్ ఉండాలేగానీ పాతాళంలో ఉన్నా సరే రివ్వున ఎగసి మిలమిల మెరిసే తారల్లా అందరి చూపులను మనవైపు తిప్పుకోవచ్చు అని చెబుతోంది మలీషా ఖార్వ. ముంబై మురికివాడ ధారావిలో పుట్టిపెరిగిన 15 ఏళ్ల మలీషా నేడు లగ్జరీ బ్రాండ్ మోడల్‌గా మారి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



సాదాసీదాగా సాగిపోతున్న మలీషా జీవితాన్ని మలుపు తిప్పే సంఘటన ఒకటి జరిగింది. అదేమిటంటే, ఓ మ్యూజిక్ వీడియో తీయడానికి ఇండియా వచ్చిన హాలీవుడ్ నటుడు రాబర్ట్ హాఫ్‌మాన్.. తన పని పూర్తి చేసుకుని తిరిగి తన దేశానికి వెళ్లిపోదామనుకున్నాడు. కానీ అదే సమయంలో కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు దేశంలో లాక్‌డౌన్ విధించడంతో.. ఇక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఈ సమయంలోనే అనుకోకుండా అతడికి మలీషాతో పరిచయం అయ్యింది. తాను కలిసిన వాళ్లందరిలోనూ ఆమె విభిన్నంగా, ముఖ కవళికలు చూడముచ్చటగా కనిపించడంతో హాఫ్‌మాన్, 'పెద్దయ్యాక ఏమవాలనుకుంటున్నావు?' అని ఆమెను సరదాగా అడిగాడు. క్షణం కూడా తడుముకోకుండా 'నేను మోడల్‌ని కావాలనుకుంటున్నాను'' అని



మలీషా



చెప్పింది మలీషా. ఆ చిన్నారి కలలను నిజం చేసేందుకు రాబర్ట్ 'గో ఫండ్ మి' పేజీ క్రియేట్ చేశాడు. దీంతోబాటు ఆమెను ఓ మోడలింగ్ మేనేజర్‌కు పరిచయం చేశాడు. అంతటితో ఆగక మలీషా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ క్రియేట్ చేశాడు.

అప్పటినుంచి మోడలింగ్ మేనేజర్ చెప్పినట్లు చేస్తూ మోడల్‌గా ఫొటోలు దిగేది మలీషా. ఆ ఫోటోలు ప్రముఖ ఫారెస్ట్ ఎసెన్షియల్ బ్రాండ్‌కు నచ్చడంతో ... వారు కొత్తగా ప్రవేశపెట్టిన 'దయువతి కలెక్షన్స్'కు మలీషాను మోడల్‌గా తీసుకున్నారు. ఫారెస్ట్ ఎసెన్షియల్ స్టోర్‌కు వెళ్లిన మలీషా అక్కడ ఉన్న పోస్టర్లు, బ్రాండ్ ఉత్పత్తులపై తన ఫోటో రావడంతో తెగ సంబరపడిపోయింది. మలీషా సంబరపడిపోతున్న వీడియోను బ్రాండ్ వారు అధికార ఇన్‌స్టాగ్రామ్ పేజీలో విడుదల చేశారు. ఈ వీడియోకు యాభైలక్షలకుపైగా వ్యూస్, లైక్‌లు రావడంతో సోషల్ మీడియాలో మలీషా బాగా పాపులర్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజనులంతా ఆమెను ''ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్''గా అభివర్ణిస్తున్నారు.

మోడలింగ్‌తోపాటు నటనలో కూడా తన టాలెంట్ చూపిస్తోన్న మలీషా ''లీవ్ యువర్ ఫెయిరీ టేల్'' డాక్యుమెంటరీలో నటించింది. పీకాక్ మ్యాగజీన్‌పైనేగాక, సమీరారెడ్డి, కుషాకపిలతో పాటు మలీషా ఫోటో 'కాస్మో ఇండియా మ్యాగజీన్'పైన కూడా రావడం విశేషం. పదోతరగతి చదువుతోన్న మలీషా పరిణితి చెందిన అమ్మాయిలా కనిపిస్తుంది. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతుంది. తనకొచ్చిన పాపులారిటీతో భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు మలీషా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. తన కలలు నిజం కావాలని ఆశిద్దాం.

కిడ్నాప్ చేస్తారని భయం వేసింది!

''ప్రియాంక చోప్రాలా మోడల్ అవాలని, నోరా ఫతేహీ డ్యాన్స్ చేయాలని ఉండేది. కానీ మాది చాలా పేద కుటుంబం. ఈ మురికి వాడ నుంచి ఆ స్థాయికి ఎలా ఎదగాలి అని ఆలోచిస్తూ ఉండేదాన్ని. మోడలింగ్ మేనేజర్‌ను కలిశాక... 'ఎవరో ఒకతను నా ఫోటోలు తీస్తుంటే ఎందుకితను నా ఫొటోలు తీస్తున్నాడు? బహుశా కిడ్నాప్ చేస్తాడేమో' అని భయం వేసింది. అది గమనించిన ఆ మేనేజర్ 'అలాంటిదేం లేదు. నీ ఫోటోలు పాపులర్ అవుతాయి' అని చెప్పడంతో భయం పోయింది. ఆ ఫోటోలు చూసిన మేనేజర్ 'నీ కళ్లు చాలా బావున్నాయి. మోడల్‌వి అవుతావా?' అని అడిగారు. అప్పుడు నేను మా నాన్నను అడగాలని చెప్పాను. వెంటనే ఆయన నాన్న గారిని కలిసి మోడలింగ్ గురించి వివరించి చెప్పారు. నాన్న వెంటనే మా తాతయ్యావాళ్లతో చెప్పి ఒప్పించడంతో ఇప్పుడు నా కలలను నిజం చేసుకోవడానికి దారి దొరికింది. మోడలింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదువుతాను" అని ఎంతో ఆత్మ విశ్వాసంతో, మరెంతో సంతోషంతో చెప్పింది.

బ్యూటిప్స్

రంధ్రాలు మాయం చేసే.. మెంతి ప్యాక్!

రాత్రంతా నానబెట్టుకున్న టీస్పూను మెంతులను నీళ్లు తీసేసి మిక్సీ జార్ లో వేయాలి. దీనికి ఆరు వేపాకులు, రెండు కీరదోసకాయ ముక్కలు జోడించి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ముల్తానీ మట్టి, అర టీస్పూను నిమ్మరసం వేసి చక్కగా కలిపి, ముఖానికి పూతలా వేసుకుని ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చేతులని తడిచేసుకుని ఐదు నిమిషాలపాటు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి.

- వారానికి ఒకసారి క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మీద అసహ్యంగా కనిపిస్తోన్న రంధ్రాలు, డార్క్ సర్కిల్స్, మొటిమల తాలుకు మచ్చలు పోయి ముఖం చర్మం బిగుతుగా మారి, మృదువైన నిగారింపుని సంతరించుకుంటుంది.
- మెంతుల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఏజింగ్ గుణాలు ముఖ చర్మానికి తేమనందించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.



Vక్టరీ కోడ్

యూత్ పల్స్

యాపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (డబ్ల్యూడబ్ల్యూడీసీ) కొద్దిరోజుల క్రితం కాలిఫోర్నియాలోని యాపిల్ పార్క్‌లో మొదలైంది. యువతలోని టెక్ ప్రేమికులకు ఇది పండగలాంటి బిగ్ ఈవెంట్. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మార్పులకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవడం ఒక కోణం అయితే, 'డబ్ల్యూడబ్ల్యూడీసీ'లో పాల్గొనే అవకాశం సొంతం చేసుకున్న 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల మాటలతో స్ఫూర్తి పొందడం మరో కోణం...

సాంకేతిక దిగ్గజం 'యాపిల్' ప్రతి సంవత్సరం స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ నిర్వహిస్తుంది. 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో న్యూజెర్సీకి చెందిన అభినయ దినేష్ ఒకరు. భారతీయ మూలాలు ఉన్న అభినయ పదిహేను సంవత్సరాల వయసులో 'గ్యాస్ట్రో ఎట్ హోమ్' అనే యాప్‌ను క్రియేట్ చేసింది. జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధ పడేవారికి అవసరమైన సమాచారానికి ఉపకరించే యాప్ ఇది.

'అనుకున్న ఐడియాను యాప్‌గా రూపొందించడం అనేది కష్టంతో కూడుకున్న పని' అంటోంది అభినయ.

భారతీయ మూలాలు ఉన్న అవితా విజయ్ (ఆస్ట్రేలియా) తొమ్మిదేళ్ల వయసులోనే యాపిల్ 'డబ్ల్యూడబ్ల్యూడీసీ-2016' విజేతలలో ఒకరిగా నిలిచింది. యాపిల్ ఐఫోన్, ఐపాడ్‌ల కోసం యాప్స్‌ను క్రియేట్ చేసింది.

'కోడింగ్ అనేది చాలా కష్టం' అంటూనే కోడింగ్‌పై అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తోంది.

గత సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల జాబితాలో జస్కరన్ సింగ్, గీతాన్ష్ ఆత్రే, సుయాష్‌లు ఉన్నారు. పదమూడు సంవత్సరాల వయసులో సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని గీతాన్ష్ కోడింగ్ జర్నీ మొదలు పెట్టాడు.



ఈ సంవత్సరం విజేతలలో...

ఇండోర్ (మధ్యప్రదేశ్)కు చెందిన అస్మీ జైన్ ఒకరు. ఇరవై సంవత్సరాల అస్మీ జైన్ యూజర్ ఐ మూమెంట్స్‌ను ట్రాక్ చేసే యాప్‌ను డిజైన్ చేసింది. కంటిసమస్యలు ఎదుర్కొనే వారికి ఉపయోగపడే యాప్ ఇది. వైద్యరంగానికి అవసరమయ్యే యాప్‌లను తయారు చేయాలనేది అస్మీ లక్ష్యం.

'నా ప్యాషన్‌ను ప్రపంచంతో షేర్ చేసుకోవడానికి కోడింగ్ అనేది ఒక సాధనంలా ఉపయోగపడుతుంది' అంటుంది అస్మీ.

ఇరవై అయిదు సంవత్సరాల మార్త మైఖేల్‌కు పురాజీవశాస్త్రం అంటే ఇష్టం. ఇటలీ నేపుల్స్ నగరంలోని 'యాపిల్ డెవలప్‌మెంట్ అకాడమీ' స్టూడెంట్. ఈ సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతలలో మార్త ఒకరు.

మెమొరీ గేమ్ యాప్ ప్లేగ్రౌండ్‌కు రూపకల్పన చేసిన మార్త 'ఇతరులతో నా భావాలను పంచుకోవడంలో, కొత్తదారులు వెదుక్కోవడంలో కోడింగ్ నాకు ఉపయోగపడింది' అంటుందామె.

జంతుసంరక్షణ, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన యాప్‌లను రూపొందించాలనేది ఆమె భవిష్యత్ లక్ష్యం.

'డబ్ల్యూడబ్ల్యూడీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడమే ఒక అదృష్టం అంటే అంతకంటే అదృష్టం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన అసాధారణమైన స్టూడెంట్స్‌తో మాట్లాడే అవకాశం రావడం. వారి ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది చైనీస్ స్టూడెంట్ ఝూంగ్.

'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్-2021' విజేతలలో ఝూంగ్ ఒకరు.

మెషిన్ లెర్నింగ్, ఏఆర్ చిత్రాలు, సంగీతాలను మిళితం చేస్తూ 'సీ యువర్ స్పోర్ట్స్' అనే ప్రాజెక్ట్‌కు సొంతంగా రూపకల్పన చేసింది ఝూంగ్.

'గత రెండు సంవత్సరాలుగా స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ విన్నర్స్ గురించి తెలుసుకోవడం ఆసక్తిగా మారింది. వారి మాటలు నాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయి' అంటుంది బెంగళూరుకు చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ శ్రీరాగ.

నిజానికి ఇది శ్రీరాగ మాటే కాదు... తమ వయసులో ఉన్నవారి విజయాల నుంచి స్ఫూర్తి పొంది తాము కూడా ఏదైనా సాధించాలనుకునే యువతరం మనసులోని మాట.

సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

యాపిల్ వారి స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో పాల్గొనడానికి అతీతశక్తులు అవసరం లేదు. ఆసక్తి, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. 'కోడింగ్'ను ఇష్టపడే యువతరానికి ఇదొక గొప్ప అవకాశం. 'కోడింగ్‌పై ప్యాషన్ ఉంటే చాలు టాపిక్ మీ ఇష్టం' అంటుంది యాపిల్. ఈ చాలెంజ్‌లోని విజేతలకు బహుమతులు, యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్‌లో సంవత్సర కాల సభ్యత్వం ఒక విషయం అయితే ప్రపంచవ్యాప్త గుర్తింపు అనేది పెద్ద విశేషం. విజేతల విజయాలు వారికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది యువతకు స్ఫూర్తిని ఇస్తున్నాయి. 'నేనెందుకు ప్రయత్నం చేయకూడదు' అని సాధన మొదలు పెడుతున్నారు. సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!



సౌండ్ హీలింగ్

మానసిక ప్రశాంతతకూ, ఒత్తిడి దూరం కావడానికీ సంగీతం ఒక సాధనం అని తెలుసు. కాని 'సౌండ్ హీలింగ్' వేరు. కచ్చితమైన పౌనఃపున్యం దగ్గర ధ్వని తరంగాలను సృష్టిస్తే అవి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా సాంత్వన కలిగిస్తాయని చెబుతోంది డాక్టర్ అంజు శర్మ. సౌండ్ హీలింగ్ కోసం ఆమె నిర్వహిస్తున్న శిబిరాలు మంచి ఆదరణ పొందుతున్నాయి.

ధ్వనితో చేయొచ్చు చికిత్స



'మీరు కారులో వెళుతున్నారు. వెనుక నుంచి ఎవరో అదే పనిగా హార్న్ కొడుతున్నారు. మీకు కోపం వస్తుందా రాదా? మీరు అదే కారులో ప్రయాణిస్తున్నారు. లోపల ఇష్టమైన పాట వస్తోంది. మీ మూడ్ హాయిగా ఉంటుందా లేదా? అంటే మీరు ఏది వింటున్నారో అది మిమ్మల్ని రోగగ్రస్తం చేయగలదు... ఆరోగ్యవంతం చేయగలదు. ఏది వింటున్నాం, ఏది అంటున్నాం అనే దాని మీద దృష్టి పెడితే మీ చెవులకు చేరుతున్న ధ్వనులు, మీ గొంతు నుంచి వెలువడుతున్న ధ్వనులు... వీటిని మంత్రమయం, సంగీతమయం, శుభమయం, శాంతిమయం చేసుకుంటే మీరు మానసికంగా, భౌతికంగా, ఉద్వేగపరంగా సమతులంగా జీవించగలరు' అంటోంది డాక్టర్ అంజు శర్మ.

దేశంలో 'సౌండ్ ఎనర్జీ మాస్టర్'గా జనం ఆరోగ్యం కోసం పని చేస్తున్న అతి తక్కువ మహిళల్లో అంజు శర్మ ఒకరు. ఈమె సౌండ్ థెరపీ ద్వారా అంటే రకరకాల పౌనఃపున్యాలు వెలువరించే పరికరాల ద్వారా ధ్వనులు వినిపిస్తూ మెదడుకు, శరీరానికి తరంగాలు పంపుతూ శరీరం లోపలి అసమతుల్యతను, అపభ్రంశతను తొలగిస్తోంది.

శబ్ద ఔషధం

'మిమ్మల్ని ఎవరో తిట్టారు. ఆ తిట్టిన మాటను మీరు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. అంటే ఆ శబ్దం మీ శరీరంలోకి వెళ్లిపోయింది. నెగెటివ్ ఎనర్జీలాగా ఉండిపోయింది. అదే మీరు ఒక మంచి మంత్రం విన్నారు. ఆశీర్వాదం విన్నారు. లేదంటే ఆలయ గంట విన్నారు. ఆ శబ్దాలు మీ లోపలికి వెళ్లాయి. అవి పాజిటివ్ ఎనర్జీగా పని చేస్తాయి. మాత్ర లోపలికి పోతే ఎలా ఔషధంగా పని చేస్తుందో శబ్దం మీ చెవి ద్వారా లోపలికి పోతే ఔషధంగా పని చేస్తుంది. సౌండ్ థెరపీలో ప్రకృతిలో వినవచ్చే శబ్దాల ద్వారా, సంగీత పరికరాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా, మానవ కంఠాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా స్వస్థత పరుస్తాం' అని తెలుపుతోంది అంజు శర్మ.



▼ 'సౌండ్ హీలింగ్' చేస్తున్న డాక్టర్ అంజు శర్మ ▲



నీటి సవ్వడి

'మనం పారుతున్న నీటి సవ్వడి వింటే ఆస్వాదిస్తాం. వాన శబ్దం విన్నా హాయిగా ఉంటుంది. ఎందుకు? మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. నీటి శబ్దం శరీరంలో రిథమ్ కోల్పోయిన నీటి కణాలను మళ్లీ రిథమ్‌లోకి తెస్తుంది. అందుకే ఎప్పుడైనా మానవ సంబంధాలతో వచ్చే స్ట్రెస్‌లో ఉంటే గనగ నీటి శబ్దం వినాలి. సాంత్వనం లభిస్తుంది' అని చెబుతుంది ఆమె. అప్పుడప్పుడు ప్రకృతిలోకి వెళ్లి ధ్యానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదని చెబుతుందామె. 'ప్రకృతిలో వచ్చే శబ్దాలు ఒకవైపు మీ చెవిన పడుతుంటే ధ్యానం వల్ల మీరు మౌనాన్ని సాధన చేస్తుంటే మీ మనసు శరీరాలు ఎంతో ఓదార్పు పొందుతాయి' అంటుందామె. గృహిణులు ఇంట్లో పనులు చేసుకుంటున్నప్పుడు ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వినడం మంచిదని అంటుంది అంజు శర్మ. 'సీరియల్స్‌లో వినిపించే కలుషిత శబ్దాల కుట్రల డైలాగులు మీ లోపలికి వెళ్లి ఎలాంటి అనారోగ్యం కలిగిస్తాయో మీరు తెలుసుకోవాలి' అని హితవు చెబుతుంది.

కూనిరాగాల మేలు

'కొందరు కూనిరాగాలు తీసుకుంటూ పని చేసుకుంటారు. వయసు మళ్లిన వాళ్లకు కూనిరాగాలు దివ్య ఔషధంలా పని చేస్తాయి. కూనిరాగాలు శాంతిని కలుగచేస్తాయి. అలాగే అప్పుడప్పుడు చప్పట్లతో ధ్వని పుట్టించి వింటే మంచిది' అని తెలిపిందామె. 'మన శరీరంలో ప్రతి అణువుకు కంపించే శక్తి ఉంది. బయటి నుంచి వినే ధ్వనులు ఆ కంపనాలకు హాయిని కలిగించి అనుసంధానం కాగలిగితే రోగ కారక కణాలు ఏర్పడవు' అని తెలుపుతోంది అంజు శర్మ.



హంపితో హారిక గేమ్ 'డ్రా'

కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి 'డ్రా' నమోదు చేసింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపితో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మూడో రౌండ్ తర్వాత హారిక 1.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో, హంపి ఒక పాయింట్‌తో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు.



షూటర్ మేఘన బృందానికి స్వర్ణం

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ సాదుల మేఘన స్వర్ణ పతకంతో మెరిసింది. జర్మనీలో జరుగుతున్న ఈ టోర్నీలో మేఘన (577 పాయింట్లు), పాయల్ ఖత్రీ (572), సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (570)లతో కూడిన భారత జట్టు 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఓవరాల్‌గా మేఘన జట్టు 1719 పాయింట్లు స్కోరు చేసింది. వ్యక్తిగత విభాగంలో మేఘన నాలుగో స్థానంలో నిలిచింది.

'టెస్టు' కిరీటం కోసం...

సరిగ్గా రెండేళ్ల క్రితం... భారత జట్టు తొలి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరింది. 2019–21 మధ్య 12 టెస్టుల్లో విజయాలు సాధించి అద్భుత ఫామ్‌తో తుది పోరుకు అర్హత సాధించింది. అయితే అసలు సమరంలో చతికిలపడి రన్నరప్‌గా సంతృప్తి చెందింది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు న్యూజిలాండ్‌కంటే ఒక మ్యాచ్ ఎక్కువే గెలిచినా... స్లో ఓవర్ రేట్ కారణంగా నాలుగు పాయింట్లు కోల్పోయి దురదృష్టవశాత్తూ ఫైనల్ అవకాశాలు చేజార్చుకొని తీవ్ర నిరాశకు గురైంది. ఇప్పుడు ఇరు జట్లకు తొలిసారి చాంపియన్స్‌గా నిలిచేందుకు మరో అవకాశం వచ్చింది. ఇటీవలే ఇరు జట్లు నాలుగు టెస్టుల సిరీస్‌లో తలపడిన నేపథ్యంలో దానికి కొనసాగింపుగా అన్నట్లు మరో టెస్టు వచ్చేసింది. తటస్థ వేదికలో జరిగే హోరాహోరీ పోరులో ఎవరిది పైచేయి అవుతుందనేది ఆసక్తికరం.

- నేటి నుంచి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్
- అమీతుమీ తేల్చుకోనున్న భారత్, ఆస్ట్రేలియా
- తటస్థ వేదికపై సమరానికి ఇరు జట్లు సిద్ధం
- మధ్యాహ్నం గం. 3 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



లండన్: రోహిత్, కోహ్లి, అశ్విన్... భారత ప్రపంచ కప్ విజయాల్లో భాగస్వాములు... స్మిత్, వార్నర్, స్టార్క్ కూడా అదే తరహాలో ఆసీస్ విశ్వ విజేతగా నిలిచిన జట్టులో సభ్యులు... వీరంతా పరిమిత ఓవర్ల టోర్నీలో మాత్రమే కాకుండా టెస్టుల్లోనూ వరల్డ్ చాంపియన్స్‌గా నిలవాలని కోరుకుంటున్న సీనియర్ ఆటగాళ్లు... పుజారా, రహానే, లయన్, ఖ్వాజా తమ టెస్టు టీమ్‌ల తరఫున చిరస్మరణీయ ప్రదర్శనలు చేసినా ఇంకా విశ్వ విజేత టీమ్ సభ్యులు అనిపించుకోని ఆటగాళ్లు... కెరీర్‌లో కనీసం 50కి పైగా టెస్టులు ఆడి, 33 ఏళ్లు దాటిన వీరందరికి టెస్టు క్రికెట్‌లో అత్యుత్తమ వేదికపై సత్తా చాటేందుకు చివరి అవకాశం. గత రెండేళ్లుగా ప్రపంచ టెస్టు క్రికెట్‌లో ఆధిపత్యం ప్రదర్శించిన రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య అతి పెద్ద సమరానికి రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. గత ఫైనల్ సౌతాంప్టన్‌లో జరగ్గా, ఈసారి ఓవల్ మైదానం తుది పోరుకు వేదికైంది. ఇందులో విజేతగా నిలిచే జట్టుకు తొలిసారి డబ్ల్యూటీసీ టైటిల్ దక్కుతుంది. బలాబలాల్లో సమఉజ్జీలుగా కనిపిస్తున్న ఇరు జట్ల మధ్య ఆసక్తికర పోరు ఖాయం. కెప్టెన్లు రోహిత్ శర్మ, ప్యాట్ కమిన్స్‌లకు ఇది 50వ టెస్టు కావడం విశేషం.



కేఎస్ భరత్‌కు అవకాశం దక్కేనా!

ఆడిన ఆఖరి టెస్టులో (ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టు) తుది జట్టును చూస్తే ఒకటి, రెండు స్థానాలు మినహా ఇతర ఆటగాళ్లందరికీ చోటు ఖాయం. అయితే మారిన వేదికలో పరిస్థితులు, వాతావరణాన్ని బట్టి చూస్తే తుది జట్టు విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌లో సందిగ్ధత కొనసాగుతోంది. టాప్–4లో రోహిత్, గిల్, పుజారా, కోహ్లి ఉండగా, శ్రేయస్ అయ్యర్ లేకపోవడంతో ఐదో స్థానంలో రహానే ఆడతాడు. ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజాకు చోటు ఖాయం. అయితే ఓవల్ మైదానాన్ని బట్టి చూస్తే భారత్ నలుగురు పేసర్లతో ఆడుతుందా లేదా రెండో స్పిన్నర్‌కు అవకాశం దక్కుతుందా చూడాలి. మ్యాచ్‌కు ముందు రోజు రోహిత్ కూడా సీనియర్ బౌలర్ అశ్విన్ స్థానంపై హామీ ఇవ్వలేకపోయాడు. షమీ, సిరాజ్‌లతో పాటు ఉమేశ్ యాదవ్, జైదేవ్ ఉనాద్కట్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. రెండో స్పిన్నర్ అవసరం లేదనుకుంటే శార్దుల్ ఠాకూర్‌కు అవకాశం ఉంది. అయితే ప్రధానంగా వికెట్ కీపర్‌పైనే చర్చ కొనసాగుతోంది. కీపింగ్ నైపుణ్యాన్ని బట్టి చూస్తే ఆంధ్ర వికెట్ కీపర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్‌ను ఎంచుకోవాలి. అయితే దూకుడైన బ్యాటింగ్‌తో పాటు ఎడంచేతి వాటం కావడం ఇషాన్ కిషన్ అవకాశాలు పెంచుతోంది. అయితే ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడని ఇషాన్‌ను కీలకపోరులో అరంగేట్రం చేయిస్తారా అనేది సందేహమే. ఐపీఎల్ కారణంగా భారత ఆటగాళ్లంతా టి20ల్లోనే ఆడినా, ఆటతో 'టచ్'లోనే ఉన్నారు. కీలక ఆటగాడు పుజారా ఇటీవలి కౌంటీ క్రికెట్ అనుభవం జట్టుకు ఉపయోగపడనుంది.

హాజల్‌వుడ్ స్థానంలో బోలండ్...

భారత్‌తో పోలిస్తే ఆస్ట్రేలియాకు తమ తుది జట్టు విషయంలో పూర్తి స్పష్టత ఉంది. వార్నర్ పునరాగమనంతో హ్యాండ్స్‌కోంబ్‌ను తప్పించగా, గాయపడిన హాజల్‌వుడ్ స్థానంలో మరో పేసర్ బోలండ్‌కు స్థానం దక్కింది. ముగ్గురు రెగ్యులర్ పేసర్లతో పాటు కామెరాన్ గ్రీన్ రూపంలో మరో మీడియం పేసర్ అందుబాటులో ఉన్నాడు. ఐపీఎల్ ఆడిన వార్నర్, గ్రీన్ మినహా మిగతావారంతా టెస్టు స్పెషలిస్టులుగా ఈ మ్యాచ్ కోసం ఆసీస్ గడ్డపై పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. ఓవల్ పరిస్థితులు తమ దేశంలోలాగే ఉండటం ఆ జట్టుకు సానుకూలాంశం.

ఫైనల్ 'డ్రా' అయితే...

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత జట్టుకు వెండి గదతోపాటు 16 లక్షల డాలర్లు (రూ. 13 కోట్ల 20 లక్షలు), రన్నరప్ జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 60 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. ఒకవేళ ఫైనల్ 'డ్రా'గా ముగిస్తే రెండు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, పుజారా, కోహ్లి, రహానే, జడేజా, భరత్/ఇషాన్‌కిషన్, అశ్విన్/శార్దుల్, షమీ, సిరాజ్, ఉమేశ్.

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), వార్నర్, ఖ్వాజా, లబుషేన్, స్మిత్, హెడ్, గ్రీన్, క్యారీ, స్టార్క్, లయన్, బోలండ్.

పిచ్, వాతావరణం

సాధారణంగా పిచ్‌పై మంచి బౌన్స్ ఉంటుంది. అది పేసర్లకు అనుకూలం కాగా, మంచి షాట్లకు కూడా అవకాశం ఉంటుంది. స్వింగ్ ప్రభావం తక్కువ. నిలదొక్కుకుంటే బ్యాటర్లు చక్కగా పరుగులు రాబట్టవచ్చు. అయితే జూన్ నెలలో తొలిసారి టెస్టు జరుగుతుండటంతో ఎవరికీ పిచ్‌పై పూర్తి స్పష్టత లేదు. వర్షం ఇబ్బంది కలిగించకపోవచ్చు. రిజర్వ్ డే కూడా ఉంది.

14 ఓవల్ మైదానంలో భారత జట్టు ఇప్పటి వరకు 14 టెస్టులు ఆడింది. 2 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఐదింటిలో ఓడిపోయింది. 7 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకుంది.

38 ఓవల్ మైదానంలో ఆస్ట్రేలియా జట్టు ఇప్పటి వరకు 38 టెస్టులు ఆడింది. 7 మ్యాచ్‌ల్లో నెగ్గింది. 17 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 14 మ్యాచ్‌లను 'డ్రా'గా ముగించింది.

106 భారత్, ఆస్ట్రేలియా మధ్య ఓవరాల్‌గా 106 టెస్టులు జరిగాయి. 44 టెస్టుల్లో ఆస్ట్రేలియా... 32 టెస్టుల్లో భారత్ గెలుపొందాయి. ఒక టెస్టు 'టై'గా ముగియగా... 29 టెస్టులు 'డ్రా' అయ్యాయి.

జొకోవిచ్ జోరు...

- ఫ్రెంచ్ ఓపెన్‌లో 12వసారి సెమీస్‌లోకి
- క్వార్టర్స్‌లో ఖచనోవ్‌పై విజయం



పారిస్: ఆరంభంలో తడబడినా... తన అనుభవాన్నంతా రంగరించి పోరాడిన సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ తన కెరీర్‌లో 12వసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 4–6, 7–6 (7/0), 6–2, 6–4తో 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా)పై గెలిచాడు. 3 గంటల 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 57 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ నెట్ వద్ద 25 పాయింట్లు గెలిచాడు. టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) మధ్య క్వార్టర్ ఫైనల్ విజేతతో సెమీఫైనల్లో జొకోవిచ్ ఆడతాడు.

తొలిసారి సెమీస్‌లో సబలెంకా, ముకోవా

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్), అన్‌సీడెడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) తమ కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరారు. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6–4, 6–4తో స్వితోలినా (ఉక్రెయిన్)పై, ముకోవా 7–5, 6–2తో పావ్లీచెంకోవా (రష్యా)పై గెలిచి గురువారం జరిగే సెమీఫైనల్లో అమీతుమీకి సిద్ధమయ్యారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు బెలారస్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో... మ్యాచ్ ముగిశాక సబలెంకాకు కరచాలనం ఇవ్వకుండానే స్వితోలినా కోర్టు నుంచి వెళ్లిపోయింది. సబలెంకా తొలి రౌండ్ ప్రత్యర్థి మార్టా కొస్ట్యెక్ (ఉక్రెయిన్) కూడా ఇలాగే వ్యవహరించింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో స్వియాటెక్ తొలి సెట్‌లో 5–1తో ఆధిక్యంలో ఉన్న దశలో ఆమె ప్రత్యర్థి సురెంకో (ఉక్రెయిన్) గాయం కారణంగా వైదొలిగింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జ్వెరెవ్ (జర్మనీ) 6–1, 6–4, 6–3తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై, ఎచెవరీ (అర్జెంటీనా) 7–6 (10/8), 6–0, 6–1తో నిషియోకా (జపాన్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

సింధు, సైనా నిష్క్రమణ

- తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్స్
- ప్రణయ్, లక్ష్య సేన్ కూడా అవుట్
- ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రియాన్షు



సింగపూర్: డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధు, మాజీ విజేత సైనా నెహ్వాల్... సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21–18, 19–21, 17–21తో ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్) చేతిలో... 2010 చాంపియన్ సైనా 13–21, 15–21తో ప్రపంచ మాజీ విజేత రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. మరో మ్యాచ్‌లో ఆకర్షి కశ్యప్ 17–21, 9–21తో సుపనిద కతెథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. కిడాంబి శ్రీకాంత్ 21–15, 21–19తో వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)పై, ప్రియాన్షు 21–12, 21–15తో సునెయామ (జపాన్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రణయ్ 15–21, 19–21తో నరోకా (జపాన్) చేతిలో, లక్ష్య సేన్ 21–18, 17–21, 13–21తో చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్–అర్జున్ (భారత్) ద్వయం 21–16, 21–15తో లుకాస్ కోర్వీ–లాబర్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది.

సినిమా

ఇక షురూ


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' మళ్లీ షురూ అంటున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇందులో పూజా హెగ్డే, శ్రీ లీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 12న హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ షెడ్యూల్ దాదాపు నెల రోజులకు పైగా ఉంటుందట. ఈ షెడ్యూల్‌లో సినిమాలోని ప్రధాన తారాగాణం పాల్గొంటారని సమాచారం. 'గుంటూరు కారం' చిత్రం జనవరి 13న విడుదల కానుంది.

చలో మైసూర్

ఒక పాట, ఒక పవర్‌ఫుల్ ఫైట్ కోసం రామ్, శ్రీలీల, బోయపాటి అండ్ టీమ్ మైసూర్ వెళ్లారు. ఈ సందర్భంగా మైసూర్‌లో రామ్, శ్రీలీల సెల్ఫీలు దిగి, సందడి చేశారు. రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన ఒక యాక్షన్ సీక్వెన్స్, ఒక పాటను మైసూర్‌లో చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. మంగళవారం ఆరంభమైన ఈ షెడ్యూల్ ఈ నెల 15 వరకు సాగుతుంది. ఈ షెడ్యూల్‌తో ఒక్క పాట మినహా సినిమా పూర్తవుతుంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 20న రిలీజ్ కానుంది.


శ్రీలీల, రామ్

భారతీయుడికి విలన్?


ఎస్‌జె సూర్య

ఎస్.జె. సూర్యలో దర్శకుడు (తెలుగులో 'ఖుషి నాని, పులి'), హీరో (తమిళంలో పలు చిత్రాలు), విలన్ (తెలుగు 'స్పైడర్') ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం రెండు మూడు చిత్రాల్లో విలన్‌గా నటిస్తున్నారు సూర్య. వాటిలో శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న 'గేమ్ చేంజర్' ఒకటి. మరొకటి 'ఇండియన్ 2' అని సమాచారం. అయితే 'ఇండియన్ 2' గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఇండియన్ 2'. 1996లో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, ప్రియా భవానీ శంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన ఓ షెడ్యూల్ చెన్నైలో ముగిసింది. కాగా నెక్స్ట్ షెడ్యూల్‌ను అమెరికాలో ప్లాన్ చేసింది చిత్రయూనిట్. దాదాపు పది రోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుంది.

పాటల పనిలో...


వెంకీ కుడుముల, కాసర్ల శ్యామ్, జీవీ ప్రకాశ్

మాస్, రొమాంటిక్, మెలోడీ... ఇలా నితిన్ సినిమాకి సందర్భానికి తగ్గ ట్యూన్లు చేయించుకునే పని మీద బిజీగా ఉన్నారు వెంకీ కుడుముల. ట్యూన్ కట్టే పని మీద జీవీ ప్రకాశ్, పాట రాసే పని మీద కాసర్ల శ్యామ్ ఉన్నారు. ఇదంతా నితిన్, రష్మికా మందన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం కోసమే. చిత్ర సంగీతదర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ ఆధ్వర్యంలో చెన్నైలో మ్యూజిక్ సిట్టింగ్స్ ఆరంభమయ్యాయి. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

కథే హీరో – వీజే సన్నీ



"హీరోగా కాదు.. ఓ ఆర్టిస్టుగా కెరీర్‌లో ముందుకు వెళ్లాలనుకుంటున్నాను. కథ నచ్చితే విలన్ పాత్ర చేసేందుకు కూడా సిద్ధమే" అన్నారు వీజే సన్నీ. సప్తగిరి, వీజే సన్నీ హీరోలుగా డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన సినిమా 'అన్‌స్టాపబుల్'. రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వీజే సన్నీ మాట్లాడుతూ– "'బిగ్‌బాస్' నుంచి బయటకు వచ్చిన తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. ముప్పైకి పైగా మాస్ కథలు విన్నాను. కానీ నాకు మాత్రం కామెడీ, థ్రిల్లర్, హారర్ బ్యాక్‌డ్రాప్‌లోని సినిమాలంటే ఇష్టం. డైమండ్ రత్నబాబుగారు చెప్పిన 'అన్‌స్టాపబుల్' కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. దీంతో ఈ సినిమా చేయడానికి అంగీకరించాను. నేను కథనే హీరోగా నమ్ముతాను. ఈ సినిమా కథ బాగుంది. ఈ సినిమా ఆడియన్స్‌కు బోర్ కొట్టదని గ్యారంటీ ఇవ్వగలను. ఈ చిత్రంలో కోహినూర్ కల్యాణ్ పాత్రలో నేను, జిలానీ రామ్‌దాస్ పాత్రలో సప్తగిరిగారు పోటాపోటీగా నటించాం. డబ్బు కారణంగా అనుకోని పరిస్థితుల్లో చిక్కుకున్న కల్యాణ్, రామ్‌దాస్ ఎలా బయటపడ్డారు అన్నదే ఈ చిత్రకథ" అన్నారు.

ఆదిపురుష్ మా అదృష్టం – ప్రభాస్

- తిరుపతిలో పెళ్లి..
- ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తా


భూషణ్‌కుమార్, కృతీ సనన్, ప్రభాస్, ఓం రౌత్, దేవ దత్తా, సన్నీ సింగ్



'ఏడు నెలల క్రితం 'ఆదిపురుష్' ట్రైలర్‌ను నా ఫ్యాన్స్ కోసం త్రీడీలో చూపించమని, వారి రెస్పాన్స్ చూడమని ఓం రౌత్‌తో చెప్పాను. ఫ్యాన్స్ చూపిన ధైర్యం, ప్రోత్సాహమే మమ్మల్ని ముందుకు నడిపించింది. నిజానికి 'ఆదిపురుష్'ను సినిమా అనకూడదు. ఇది రామాయణం. ఈ సినిమా చేయడం మా అదృష్టం" అని ప్రభాస్ అన్నారు. ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆదిపురుష్'. రామాయణం ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో రాముడి పాత్రలో ప్రభాస్, జానకిగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమంతునిగా దేవ దత్తా, లంకేశ్వరుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్ వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిలో జరిగిన 'ఆదిపురుష్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ఇంకా ప్రభాస్ మాట్లాడుతూ – "ఓ సందర్భంలో 'రామాయణం' చేస్తున్నావా? అని చిరంజీవిగారు అడిగారు. అవును.. సార్ అన్నాను.. 'అది నిజంగా అదృష్టం. అందరికీ దొరకదు. నీకు దొరికింది' అన్నారు. 'ఆదిపురుష్' వేడుకకు వచ్చిన చినజీయర్ స్వామిగారికి, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిగారికి, తిరుపతి పోలీసులకు థ్యాంక్స్. స్టేజ్ మీద తక్కువగా మాట్లాడి, ఎక్కువగా సినిమాలు చేస్తాను. ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తాను" అన్నారు. పెళ్లి గురించి అభిమానులు అడగ్గా, "పెళ్లా.. ఎప్పుడైనా..తిరుపతిలోనే చేసుకుంటాలే..." అని నవ్వుతూ సమాధానమిచ్చారు ప్రభాస్.

త్రిదండి చినజీయర్ స్వామీజీ మాట్లాడుతూ– "రామాయణంలో ఉండే అరణ్య కాండ, యుద్ధకాండలో ఉన్న ప్రధానమైన కథను చరిత్రగా లోకానికి అందించాలనే ఆశతో ఈ సినిమా చేస్తున్నామని చెప్పారు. ఇంతకంటే ఈ లోకానికి మహోపకారం ఉండదు. రాముడి పాత్రలో సమాజానికి మళ్లీ ఓ కొత్త ఆధ్యాత్మిక చైతన్య తరంగాన్ని అందిస్తున్న ప్రభాస్‌గారికి, సీతగా చేసిన కృతీ సనన్, దర్శకుడు ఓం రౌత్ అండ్ టీమ్‌కు, ముఖ్యంగా 'జై శ్రీరామ్' మంత్రాన్ని పాడిన అజయ్, అతుల్‌కు బ్లెస్సింగ్స్. జై శ్రీరామ్" అన్నారు.

మరో ముఖ్య అతిథి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ – "రామాయణంలో కొన్ని ప్రధాన ఘట్టాలను తీసుకుని 'ఆదిపురుష్' సినిమా నిర్మించడం జరిగింది. మన భారతదేశ చిత్రపరిశ్రమకు ఇంకా గొప్ప పేరు తీసుకువచ్చే విధంగా ఈ సినిమాని చిత్రీకరించారు. హాలీవుడ్‌లో 'టైటానిక్', 'అవతార్' వంటి భారీ గ్రాఫిక్స్ సినిమాలు వచ్చాయి. ఆ స్థాయిలో గతంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి' మన తెలుగు పరిశ్రమకే కాకుండా భారత చిత్రపరిశ్రమకే ఎంతో కీర్తి తెచ్చింది. ఆ తర్వాత 'ఆదిపురుష్' కూడా భారీ గ్రాఫిక్స్‌తో అదే స్థాయిలో రూపొందింది. మన భారతదేశ చరిత్రకు రామాయణం, మహాభారతం.. ఈ రెండూ గొప్ప ఇతిహాసాలు. అటువంటి రామాయణంలోని కొన్ని ఘట్టాలను తీసుకుని ఆధునిక టెక్నాలజీతో ఈ 'ఆదిపురుష్'ని చేయడం అనేది గొప్ప కార్యక్రమం. ముఖ్యంగా యువతీ యువకులకు ఆదర్శంగా ఉండేలా, వారికి కళ్లకు కట్టేలా ఇలాంటి గొప్ప సినిమా నిర్మించినందుకు నటీనటులు, సాంకేతిక నిపుణులకు ప్రత్యేక అభినందనలు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రామాయణం ఆధారంగా రూపొందిన ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు.


విక్రమ్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ప్రభాస్, చినజీయర్‌స్వామి

ఓం రౌత్ మాట్లాడుతూ– "తన తండ్రి కోసం భూషణ్‌కుమార్ ఇలాంటి భారీ చిత్రాన్ని నిర్మించారు. తనకు మాత్రమే కాదు.. నాక్కూడా ఇది చాలా ముఖ్యమైన సినిమా. ఇక డార్లింగ్ (ప్రభాస్) లేకపోతే ఈ సినిమా చేయడం నాకు సాధ్యం అయ్యేది కాదు. 'ఆదిపురుష్' చేశామంటే అది మన డార్లింగ్ వల్లే. 'ఆదిపురుష్' నా సినిమానో, మీ సినిమానో, డార్లింగ్ సినిమానో కాదు.. ఇది భారతీయ సినిమా. రామాయణం కథ ఎక్కడ జరుగుతుంటే అక్కడికి హనుమంతులు వస్తారని మా అమ్మగారు చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా ఎప్పుడైనా ఏ థియేటర్లో అయినా 'ఆదిపురుష్' షో ప్రదర్శితమవుతుంటే అక్కడ ఓ సీటును ఖాళీగా ఉంచాలని నిర్మాతలను, డిస్ట్రిబ్యూటర్స్‌ను కోరుతున్నాను. ఎందుకంటే హనుమాన్ వచ్చి చూస్తారు (భావోద్వేగంతో..). ఆశీర్వదిస్తారు" అన్నారు.

భూషణ్‌కుమార్ మాట్లాడుతూ – "రాముడి సినిమా చేయాలనే మా నాన్న గుల్షన్‌కుమార్‌గారి కల ఓం రౌత్‌గారితో నెరవేరింది. రామాయణాన్ని నిర్మించినందుకు మా నాన్న గర్వపడతారు. ఈ సినిమాని ఓం చూపించిన విధానం అద్భుతం. ఇవాళ ఎమోషనల్ అవుతున్నాను. ఎందుకంటే ఇది సినిమా కాదు.. ఒక ఎమోషన్. మా నాన్నగారే నాకు రాముడు" అన్నారు.



స్టాక్ మార్కెట్లు		
దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 5	62,793	
నిఫ్టీ ▲ 5	18,599	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,278	▲	8
డోజోన్స్	33,466	▲	297
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲	28
డాక్స్	15,922	▲	29
షాంఘై	3,195	▼	37
నికాయ్	32,506	▲	289

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	60,096 ▲	495
బంగారం (99.5 స్వచ్ఛత)	59,856 ▲	495
వెండి (కిలో)	71,904 ▲	442

హోండా ఎలివేట్ వచ్చేసింది

2030కల్లా మరో 5 ఎస్‌యూవీలు



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ హోండా.. భారత మార్కెట్లో 2030 నాటికి అయిదు కొత్త ఎస్‌యూవీలను పరిచయం చేయనుంది. వీటిలో ఎలివేట్ ఎలక్ట్రిక్ మోడల్ సైతం ఉందని హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో టకుయా సుమురా తెలిపారు. మధ్యస్థాయి ఎస్‌యూవీ ఎలివేట్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఎలివేట్ సాయంతో కంపెనీ తన స్థానాన్ని మరింత బలపర్చుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం సిటీ, అమేజ్ సెడాన్లను భారత్‌లో విక్రయిస్తున్నాం. మొత్తం ప్యాసింజర్ వాహన విభాగంలో సెడాన్ల వాటా 10 శాతమే. ఈ విభాగంలోనే కంపెనీ పోటీపడుతోంది. అలాగే ఈ మోడళ్లు మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాయి. ఎలివేట్‌ను తొలిసారిగా భారత్‌లో ప్రవేశపెట్టాం. రానున్న రోజుల్లో ఈ మోడల్ ప్రధాన ఉత్పాదనగా ఉంటుంది. కొత్తగా వచ్చే మోడళ్లు ప్రీమియం సెగ్మెంట్లో పోటీ పడతాయి. ఎలివేట్ ఎగుమతి కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం. ఇక 2022–23లో 1.2 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేశాం. 2024–25లో దీనిని 1.7 లక్షల యూనిట్లకు చేరుస్తాం' అని వివరించారు. 2040 నాటికి బ్యాటరీ ఎలక్ట్రిక్, ఫ్యూయల్ సెల్ వాహనాలను మాత్రమే విక్రయిస్తామని హోండా మోటార్ కో ఆసియా హెడ్ తోషియో కువహర తెలిపారు.

గిడ్డంగిని విక్రయించిన జీఎంఆర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ జీఎంఆర్ గ్రూప్ తాజాగా శంషాబాద్ విమానాశ్రయంలో ఉన్న 8,18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని గిడ్డంగిని విక్రయించింది. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్) నుంచి సింగపూర్‌కు చెందిన ఐఎల్‌పీ కోర్ వెంచర్స్ ఐ పీటీఈ దీనిని చేజిక్కించుకుంది. డీల్ విలువ రూ.188 కోట్లు. ఈ మొత్తాన్ని విమానాశ్రయ అభివృద్ధికి వెచ్చించనున్నట్టు కంపెనీ మంగళవారం ప్రకటించింది.

బ్రాండెడ్ ఆభరణాల వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్

'నావెల్ జ్యువెల్స్'పై రూ. 5,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: వ్యాపార దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్ తాజాగా బ్రాండెడ్ ఆభరణాల రిటైల్ వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం రూ. 5,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేయనుంది. 'నావెల్ జ్యువెల్స్' పేరిట నెలకొల్పిన కొత్త వెంచర్ ద్వారా దేశవ్యాప్తంగా భారీ స్థాయి జ్యుయలరీ రిటైల్ స్టోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. నూతన వృద్ధి చోదకాలను అందిపుచ్చుకునేందుకు, మరిన్ని కొత్త ఉత్పత్తులతో దేశీ మార్కెట్లో కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ వ్యూహాత్మక పోర్ట్‌ఫోలియో ఉపయోగపడగలదని ఆయన పేర్కొన్నారు. లైఫ్‌స్టయిల్ రిటైల్ విభాగంలో తమకున్న అనుభవం, వినియోగదారుల ప్రాధాన్యతలను అర్థం చేసుకునే నైపుణ్యాలు .. కొత్త వెంచర్‌కు ఉపయోగకరంగా ఉండగలవని చెప్పారు.

టాటా.. రిలయన్స్‌తో పోటీ..

నావెల్ జ్యువెల్స్ బ్రాండ్‌తో ఆదిత్య బిర్లా గ్రూప్.. టాటా తనిష్క్, రిలయన్స్ జ్యువెల్స్ వంటి బ్రాండ్స్‌తో పోటీపడనుంది. ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) రత్నాభరణాల మార్కెట్ వాటా దాదాపు 7 శాతంగా ఉంది. దేశీ ఆభరణాల మార్కెట్ 2025 నాటికి 90 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

బజాజ్ మ్యూచువల్ ఫండ్ వ్యాపారం ప్రారంభం

ఈ నెలాఖరుకు మూడు పథకాలు

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారంలోకి బజాజ్ ఫిన్‌సర్వ్ అడుగు పెట్టింది. వచ్చే కొన్నేళ్లలో పెద్ద సంస్థగా అవతరించాలనే లక్ష్యంతో ఉన్నట్టు ప్రకటించింది. ఈ నెలాఖరులోపు లిక్విడ్, మనీ మార్కెట్ తదితర మూడు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) పథకాలను ప్రారంభించనున్నట్టు తెలిపింది. ఆ తర్వాత కొన్ని రోజులకు నియంత్రణ సంస్థ అనుమతితో మరో 4 కొత్త పథకాలను తీసుకురానున్నట్టు గ్రూప్ చైర్మన్, ఎండీ సంజీవ్ బజాజ్ ప్రకటించారు. ఇప్పటికే మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో 42 సంస్థలు ఉన్నాయి. తమ గ్రూపు పరిధిలో ఎనిమిది సబ్సిడరీలు ఉన్నాయని, 7 కోట్ల మంది కస్టమర్లకు ఆర్థిక ఉత్పత్తులను అందిస్తున్నట్టు సంజీవ్ చెప్పారు.

యాపిల్ 'విజన్ ప్రో'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్‌మెంటెడ్ రియాలిటీ హెడ్‌సెట్‌ను టెక్ దిగ్గజం యాపిల్ ఎట్టకేలకు ఆవిష్కరించింది. యూఎస్ కాలిఫోర్నియాలోని కూపటీనో నగరంలో ఉన్న ఆపిల్ పార్క్‌లో జరుగుతున్న వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్–2023 వేదికగా విజన్ ప్రో పేరుతో ఈ ఉత్పత్తిని పరిచయం చేసింది. ప్రారంభ ధర సుమారు రూ.2,88,742. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. యాపిల్ సీఈవో దీనిని స్పేషియల్ కంప్యూటింగ్‌గా అభివర్ణించారు. త్రీ–డైమెన్షనల్ కెమెరా, మైక్రోఫోన్ సిస్టమ్‌తో రూపొందింది. 12 కెమెరాలు, ఆరు మైక్రోఫోన్స్‌తోపాటు విభిన్న సెన్సార్స్ ఏర్పాటు చేశారు. వీడియోలు, చిత్రాలను సులభంగా క్యాప్చర్ చేస్తుంది. వీటిని వినియోగదారులు 3డీలో వీక్షించవచ్చు అని కంపెనీ తెలిపింది.

ఆఖర్లో 'కొనుగోళ్ల' రికవరీ

- ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు
- 18,599 వద్ద స్థిరపడిన నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం అయిదు పాయింట్లు
- ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు చివరి అరగంట కొనుగోళ్లతో రికవరీ అయ్యి ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారని ట్రేడర్లు తెలిపారు. ఉదయం సెన్సెక్స్ 49 పాయింట్ల నష్టంతో 62,738 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 313 పాయింట్ల పరిధిలో 62,554 వద్ద కనిష్టాన్ని, 62,867 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి అయిదు పాయింట్ల స్వల్ప లాభంతో 62,793 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18,601 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,532 – 18,623 పరిధిలో ట్రేడైంది. ఆఖరికి అయిదు పాయింట్లు పెరిగి 18,599 వద్ద స్థిరపడింది. ఐటీ, మెటల్, ఇంధన, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. వడ్డీరేట్ల ఆధారిత బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, పారిశ్రామిక, కమోడిటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.50%, 0.30 శాతం చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.386 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.489 కోట్ల షేర్లు అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలహీనపడి 82.60 స్థాయి వద్ద స్థిరపడింది. 'ఐటీ రంగ షేర్లలో అనూహ్యంగా అమ్మకాల ఒత్తిడి తలెత్తడంతో స్టాక్ మార్కెట్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అయితే ఆటో, బ్యాంక్స్ షేర్ల ర్యాలీతో సూచీలు కనిష్ట స్థాయి నుంచి రికవరీ అయ్యాయి. ఇటీవల మార్కెట్ గరిష్ట స్థాయి వద్ద తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతుంది. గడిచిన 3 ట్రేడింగ్ సెషన్లో ఎఫ్ఐఐలు నికర అమ్మకందారులుగా నిలవడం కూడా సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచినట్లైంది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి వెల్లడయ్యే వరకు సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలోనే ట్రేడవ్వొచ్చు' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

లక్ష కోట్ల డాలర్లకు ఇంటర్నెట్ ఎకానమీ

- 2030 నాటికి ఆరింతలు పెరుగుతుందని అంచనా
- ఈ–కామర్స్ విభాగం దన్ను
- గూగుల్, టెమాసెక్, బెయిన్ సంయుక్త నివేదిక



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ విభాగం దన్నుతో దేశీ ఇంటర్నెట్ ఎకానమీ 2030 నాటికి ఆరింతలు పెరగనుంది. 1 లక్ష కోట్ల డాలర్లకు చేరనుంది. గూగుల్, టెమాసెక్, బెయిన్ అండ్ కంపెనీ విడుదల చేసిన సంయుక్త నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2022లో భారత ఇంటర్నెట్ ఎకానమీ 155–175 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. బీ2సీ ఈ–కామర్స్ విభాగం, బీ2బీ ఈ–కామర్స్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ ప్రొవైడర్లు, ఓవర్ ది టాప్ సంస్థల (ఓటీటీ) వంటి ఆన్‌లైన్ మీడియా దేశీ ఇంటర్నెట్ ఎకానమీకి వృద్ధి కారకాలుగా ఉండగలవని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ సంజయ్ గుప్తా తెలిపారు. భవిష్యత్తులో చాలా మటుకు కొనుగోళ్లు డిజిటల్‌గానే జరగనున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ ఆవిష్కరణలకు అంకుర సంస్థలు బాటలు వేయగా, కోవిడ్ మహమ్మారి అనంతరం చిన్న–మధ్య–భారీ తరహా సంస్థలు మార్కెట్లో దీటుగా పోటీ పడేందుకు డిజిటల్ సాంకేతికతలను గణనీయంగా ఉపయోగించడం ఆరంభించాయన్నారు. ప్రపంచ జీడీపీ వృద్ధికి భారత్ కొత్త ఆశాదీపంగా మారిందని టెమాసెక్ ఎండీ (ఇన్వెస్ట్‌మెంట్స్) విశేష్ శ్రీవాస్తవ్ తెలిపారు. డిజిటల్ సాంకేతికతలను ఆర్థిక కార్యకలాపాల్లో విస్తృతంగా వినియోగించే ఆర్థిక వ్యవస్థను ఇంటర్నెట్ ఎకానమీగా పరిగణిస్తారు.

నివేదిక ప్రకారం..

- బీ2సీ ఈ–కామర్స్ 2022లో 60–65 బిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి 5–6 రెట్లు పెరిగి 350–380 బిలియన్ డాలర్లకు చేరనుంది.
- బీ2బీ ఈ–కామర్స్ 8–9 బిలియన్ డాలర్ల నుంచి 13–14 రెట్లు పెరిగి 105–120 బిలియన్ డాలర్లకు ఎగియనుంది.
- సాఫ్ట్‌వేర్–యాజ్–ఎ–సర్వీస్ విభాగం 5–6 రెట్లు వృద్ధి చెంది 12–13 బిలియన్ డాలర్ల నుంచి 65–75 బిలియన్ డాలర్లకు చేరనుంది.

టాప్‌గేర్‌లో సోనాలిక ట్రాక్టర్ అమ్మకాలు



న్యూఢిల్లీ: సోనాలికా ట్రాక్టర్స్ కంపెనీ మే నెలలో 13,072 ట్రాక్టర్లను అమ్మినట్లు తెలిపింది. గతేడాది ఇదే మే నెలలో విక్రయించిన 12,615 యూనిట్లతో పోలిస్తే ఇవి 11.42% శాతం, పరిశ్రమ అంచనాల కంటే నాలుగు రెట్లు అధికమని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక నెలలో ఇవే అత్యధిక అమ్మకాలని కంపెనీ జాయింట్ ఎండీ రమణ్ మిట్టల్ తెలిపారు. తమ ట్రాక్టర్ల తయారీ అత్యాధునిక సాంకేతికత వినియోగిస్తున్నందున రైతుల నుంచి తమ బ్రాండ్‌కు విశేష ఆదరణ లభిస్తుందని రమణ్ అన్నారు.

మారుతీ సుజుకీ 4,500 సర్వీస్ కేంద్రాలు



పార్థో బెనర్జీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ సర్వీస్ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా 4,500ల కేంద్రాల మార్కును చేరుకుంది. హైదరాబాద్‌లోని రాంపల్లి సర్వీస్ సెంటర్ ఈ ఘనతను సొంతం చేసుకుంది. 2022–23లో భారత్‌లో 310 సర్వీస్ టచ్ పాయింట్లను ఏర్పాటు చేశామని సంస్థ సర్వీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'పట్టణేతర ప్రాంతాల్లో అత్యధికంగా ఇవి ప్రారంభం అయ్యాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో సర్వీస్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం సంస్థ చరిత్రలో తొలిసారి. 2023–24లో కొత్తగా 350 కేంద్రాలను నెలకొల్పుతాం. సర్వీసు కోసం నగరాల్లో 10–15 కిలోమీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 25 కిలోమీటర్లకు మించి కస్టమర్ ప్రయాణించకూడదు అన్నది మా లక్ష్యం. సర్వీస్ టచ్ పాయింట్స్ 2,271 నగరాలు, పట్టణాల్లో విస్తరించాయి. 335 సర్వీస్ ఆన్ వీల్స్ వర్క్‌షాప్స్ ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 326 సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అత్యధికంగా 2.23 కోట్ల వాహనాలకు సర్వీసు అందించాం' అని వివరించారు.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో.. ఇంజనీరింగ్ ఉత్తీర్ణులకు స్వాగతం పలుకుతోంది. సైంటిస్ట్/ఇంజనీర్ హోదాల్లో.. కొలువుదీరే అవకాశం కల్పిస్తోంది!! గ్రూప్‌-ఎ గెజిటెడ్, నాన్‌-గెజిటెడ్ కొలువులతో కెరీర్ ప్రారంభించే అవకాశం అందిస్తోంది! ఇందుకోసం ఇస్రో చేపట్టే నియామక ప్రక్రియలో విజయం సాధించాల్సి ఉంటుంది. ఇటీవల ఇస్రో.. 303 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి ప్రకటన ఇచ్చింది. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఇస్రో భర్తీ చేసే సైంటిస్ట్ పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

బీటెక్‌తో.. ఇస్రో సైంటిస్ట్

» సైంటిస్ట్/ఇంజనీర్ ఉద్యోగాలకు ఇస్రో ప్రకటన
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» నెలకు రూ.56,100 కనీస మూల వేతనం

ఇంజనీరింగ్ జాబ్స్

ఇంజనీరింగ్ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాల దిశగా అడుగులు వేస్తుంటారు. గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపట్టే పీఎస్‌యూలకు దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఇలాంటి అభ్యర్థులకు ఇస్రో సైంటిస్ట్ జాబ్స్ చక్కటి అవకాశంగా చెప్పొచ్చు.

ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డ్

ఇస్రోతోపాటు, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో సైంటిస్ట్, ఇంజనీర్ ఉద్యోగాల భర్తీ కోసం సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ పేరిట ప్రత్యేక నియామక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే.. సైంటిస్ట్, ఇంజనీర్స్‌గా ఖరారు చేస్తారు. గత ఏడాది వరకు ఈ పోస్ట్‌లకు గేట్ స్కోర్ ఆధారంగానే నియామక ప్రక్రియ జరిగేది. ఈ ఏడాది తొలిసారి సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఇస్రో సొంత నియామక ప్రక్రియ చేపడుతోంది.

అయిదు విభాగాలు.. 303 పోస్ట్‌లు

- తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం అయిదు విభాగాల్లో 303 సైంటిస్ట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఆ వివరాలు..
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఎలక్ట్రానిక్స్)–90 పోస్టులు: అర్హత: ఈసీఈ బ్రాంచ్‌లో కనీసం 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(మెకానికల్)–163 పోస్ట్‌లు: అర్హత: మెకానికల్ బ్రాంచ్‌లో కనీసం 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(కంప్యూటర్ సైన్స్)–47 పోస్ట్‌లు: అర్హత: సీఎస్ఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులు లేదా 6.84 జీపీఏతో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- పీఆర్ఎల్‌లో సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఎలక్ట్రానిక్స్)–2 పోస్టులు: అర్హత: ఈసీఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులతో లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- పీఆర్ఎల్‌లో సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(కంప్యూటర్ సైన్స్)–1 పోస్ట్: అర్హత: సీఎస్ఈ బ్రాంచ్‌లో 65 శాతం మార్కులతో లేదా 6.84 జీపీఏతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వారు ఆగస్ట్ 31, 2023 నాటికి సర్టిఫికెట్లు పొందాల్సి ఉంటుంది.
- వయసు: జూన్ 14, 2023 నాటికి 28 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

- సైంటిస్ట్/ఇంజనీర్ పోస్ట్‌ల భర్తీకి రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో రాత పరీక్ష ఉంటుంది. మలి దశలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ రెండింటికీ నిర్దేశిత కటాఫ్‌లు, వెయిటేజీని నిర్దేశించి.. దానికి అనుగుణంగా తుది విజేతల జాబితా రూపొందిస్తారు.

100 మార్కులకు రాత పరీక్ష

- తొలి దశలో రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 80 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.
- పార్ట్–బిలో న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డయాగ్రమెటిక్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్, డిడక్టివ్ రీజనింగ్ విభాగాల నుంచి 15 ప్రశ్నలు–20 మార్కులకు ఉంటాయి.
- పార్ట్–ఎ, పార్ట్–బి కలిపి మొత్తం వంద మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పార్ట్–ఎలో 1/3వంతు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

మలి దశ పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఆయా విభాగాల్లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుని.. ఒక్కో పోస్ట్‌కు అయిదుగురిని(1:5 నిష్పత్తి) చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయిస్తారు.

వెయిటేజీ విధానం

- రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా ఫైనల్ సెలక్షన్ ఉంటుంది. రాత పరీక్షలో ప్రతిభకు 50 శాతం; ఇంటర్వ్యూ మార్కులకు 50 శాతం వెయిటేజీని గణించి.. దాని ఆధారంగా తుది విజేతలను ఖరారు చేస్తారు.
- ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు రాత పరీక్షలో రెండు విభాగాల్లో కలిపి 50 శాతం మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూలో 50 శాతం మార్కులు.. మొత్తంగా 60 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది.
- రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూలలో 40 శాతం చొప్పున.. రెండూ కలిపి సగటున 50 శాతం మార్కులు స్కోర్ చేయాల్సి ఉంటుంది.

ప్రారంభ వేతనం రూ.56,100

ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిచి కొలువులో చేరిన వారికి పే లెవల్–10తో సైంటిస్ట్/ఇంజనీర్‌గా నియామకం ఖరారు చేస్తారు. ప్రారంభ వేతనం నెలకు రూ.56,100గా ఉంటుంది. వీటికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ వంటి ఇతర అలవెన్స్‌లు సైతం అందిస్తారు. నియామకం ఖరారు చేసుకున్న వారు ఇస్రో, అంతరిక్ష శాఖకు చెందిన విభాగాలు, కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్ హోదాకు

ఇస్రోలో సైంటిస్ట్/ఇంజనీర్‌గా కొలువుదీరిన అభ్యర్థులు భవిష్యత్తులో విశిష్ట శాస్త్రవేత్త స్థాయికి(డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్) చేరుకునే అవకాశం ఉంది. సర్వీస్‌లో చేరిన నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌డిగా.. ఆ తర్వాత నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఈగా.. అనంతరం మరో నాలుగేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్ఎఫ్‌గా పదోన్నతులు లభిస్తాయి. ఆ తర్వాత మరో అయిదేళ్లకు సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌జీ, మరో అయిదేళ్లకు.. సైంటిస్ట్ జి హోదా లభిస్తుంది. సైంటిస్ట్ జి హోదాలో ఆరేళ్ల పూర్తి చేసుకుంటే.. ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్ హోదా, మరో రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే.. డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్‌గా పదోన్నతి లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూన్ 14, 2023
- రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.isro.gov.in/ICRB_Recruitment7.html
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://apps.ursc.gov.in/CentralBE-2023/advt.jsp

క్లుప్తంగా...



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.విజయభాస్కర్ రెడ్డి

టీఎస్‌సీపీజీఈటీ-2023 పరీక్షల తేదీల వెల్లడి



ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ సీపీజీఈటీ-2023 కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పరీక్షల తేదీలను కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి మంగళవారం వెల్లడించారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 10 వరకు జరిగే ప్రవేశ పరీక్షల పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు తెలిపారు. వివిధ పీజీ కోర్సుల్లోని 45 సబ్జెక్టులకు హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని 15 సెంటర్లలో పరీక్షలు జరగనున్నట్లు పేర్కొన్నారు. సీపీజీఈటీ-2023 జూన్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, 27 నుంచి హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రభాకర్ ఎన్నికయ్యారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు జరిగిన ఐఏఎల్ 11వ జాతీయ మహాసభ చివరి రోజున నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఏఎల్ అధ్యక్షునిగా ఆర్.ఎస్.చీమా (పంజాబ్), ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని ప్రభాకర్ (తెలంగాణ) ఎన్నికయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మరో నలుగురు కూడా ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. కాగా, ఐఏఎల్ జాతీయ కార్యవర్గ సమితి సభ్యులుగా తెలంగాణ నుంచి 11 మంది ఎన్నికయ్యారు. వారిలో ఎ.వి.కృష్ణారావు, దుస్సా జనార్దన్, బీంనాథ్ శ్రీనివాస్, బి.రాజిరెడ్డి, బొమ్మగాని శ్రీనివాస్, వై.ఉదయ్ భాస్కర్ రావు, ఒ.శేషగిరిరావు, గుర్రం రాజశేఖర్ రెడ్డి, దాసరి జయ శ్రీనివాస్, కేపీఎల్, కె.రామ్మూర్తి ఉన్నారు.

ఐసీసీ 'మూట్ కోర్టు'కు లక్కిరాజు



సాక్షి, హైదరాబాద్: ఐసీసీ మూట్ కోర్టుకు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవాన్ని చండీగఢ్‌కు చెందిన న్యాయవాదితో పాటు తాను అందుకున్నందుకు చాలా ఆనందంగా ఉందని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా స్టాండింగ్ కౌన్సిల్, తిరుమల తిరుపతి దేవస్థానం న్యాయవాది పద్మారావు లక్కరాజు పేర్కొన్నారు. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులు(ఐసీసీ), ఇంటర్నేషనల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక ఐసీసీ మూట్ కోర్టు పోటీల్లో ఆయన పాల్గొన్నారు. దాదాపు రెండేళ్ల అనంతరం ఈ కార్యక్రమాన్ని ఐసీసీ నిర్వహిస్తోంది. హేగ్‌లోని లైడెన్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జూన్ 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం 9వ తేదీ వరకు కొనసాగనుంది. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 63 దేశాల నుంచి మొత్తం 400 మంది న్యాయ విద్యార్థులు పాల్గొంటున్నారని పద్మారావు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 40 మంది న్యాయమూర్తులు వివిధ సెషన్లలో మాట్లాడతారని వెల్లడించారు.

నాణ్యత లేని బోధనకు బ్రేక్.. అధిక ఫీజులకూ చెక్!

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు స్కూళ్లపై మరింత నిఘా పెట్టాలని విద్యాశాఖ భావిస్తోంది. ప్రతి ప్రైవేటు స్కూల్‌ను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించే పనిలో ఉంది. ప్రతి ప్రైవేటు పాఠశాల ఈ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చూడాలని జిల్లాల అధికారులకు ఆదేశాలిచ్చారు. అనుమతి పొందిన సెక్షన్లు, స్కూల్‌లో చదివే విద్యార్థుల సంఖ్య, ఎంతమంది ఉపాధ్యాయులు, ఏ సబ్జెక్టుకు ఎవరు టీచర్? వాళ్ళ అర్హతలేంటి? తీసుకునే ఫీజులెంత? ఇలాంటి అంశాలతో పోర్టల్‌ను రూపొందిస్తున్నారు. ఈ నెలాఖరులోగా ఇది సిద్ధమవుతుందని అధికారులు చెబుతున్నారు. సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించని స్కూళ్లను గుర్తించడం దీనివల్ల సాధ్యమవుతుందని, నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక ఫీజుల వసూలుకు కళ్లెం వేసేందుకు తోడ్పడుతుందని ఉన్నతాధికారులు అంటున్నారు. ఈ పోర్టల్ రూపకల్పనపై ఇటీవల ఉన్నత స్థాయి సమావేశం కూడా జరిగింది. ప్రైవేటు స్కూళ్ల సమాచారం ఇప్పటివరకు జిల్లా అధికారుల పరిధిలోనే ఉంటోంది. ఇక మీదట విద్యార్థుల తల్లిదండ్రులూ వివరాలు తెలుసుకులా వెసులుబాటు కల్పించనున్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) నివేదికలో రాష్ట్ర పాఠశాల విద్య 31వ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ప్రమాణాలు పెంచేలా సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు విద్యా సంస్థలపై నియంత్రణ అవసరమని అధికారులు భావిస్తున్నారు.

బోధనలో నాణ్యతపై దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 11 వేల ప్రైవేటు స్కూళ్లున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం వీటిల్లో 1.75 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. నిజానికి డీఎడ్‌తో పాటు టెట్ ఉత్తీర్ణులైన వారినే టీచర్లుగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా పాఠశాలల్లో డీఎడ్ (డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్) చేసిన వారితోనే బోధన సాగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అనేక స్కూళ్లల్లో ఎలాంటి అర్హతలు లేని ఉపాధ్యాయులు కూడా బోధిస్తున్నట్టు తేలింది. దీంతో విద్యలో నాణ్యత దెబ్బతింటోందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు స్కూళ్లు మాత్రం అన్ని అర్హతలున్న టీచర్లే బోధన చేస్తున్నట్టుగా రికార్డుల్లో పేర్కొంటున్నాయి. అయితే దీనిపై ఇంత కాలం సరైన పర్యవేక్షణ లేకపోవడం పాఠశాల విద్యపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల వివరాలు, వారి అర్హత పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయించారు.

అధిక ఫీజులకు కళ్లెం..

మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఏటా తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులొస్తున్నాయి. దీన్ని కట్టడి చేయడానికి స్కూళ్ళ వారీగా ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయించారు. కోవిడ్ తర్వాత ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. దాదాపు 40 శాతం మంది ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారు. స్కూళ్లు సరిగా నడవకపోవడం, ఫీజులు వసూలు కావడం లేదనే సాకుతో వేతనాలు ఇవ్వకపోవడంతో, ఇంకోవైపు ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడుతుండటంతో టీచర్లు ప్రైవేటు స్కూళ్లల్లో పనిచేయడం మానేశారు. దీంతో అర్హతలేని వారితో బోధన చేయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకే పోర్టల్ తెస్తున్నట్టు స్కూల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలపై పోర్టల్ నిఘా

- ప్రతి స్కూలు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- పోర్టల్‌లో సెక్షన్లు, టీచర్లు, విద్యార్థుల సంఖ్య, ఫీజుల సమాచారం
- ఇకపై సులభంగా ప్రమాణాలు పాటించని స్కూళ్ల గుర్తింపు
- విద్యాశాఖ సన్నాహాలు..



నాణ్యత పెరుగుతుంది

ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్ళ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రత్యేక పోర్టల్ తేవడం వల్ల వాస్తవికత తెలుస్తుంది. ఫలితంగా పాఠశాలల్లో నాణ్యత పెరుగుతుంది. ఈ విషయాన్ని మేం ఎన్నోసార్లు విద్యాశాఖ దృష్టికి తెచ్చాం. ఇప్పటికైనా అడుగులు పడటం సంతోషం.
- పి.రాజాభానుచంద్ర ప్రకాశ్ (అధ్యక్షుడు, రాష్ట్ర హెచ్ఎంల సంఘం)

రైలుబండి నడిపే వారెక్కడ?

సాధారణంగా ఏ సంస్థలోనైనా సరే వంద మంది సిబ్బంది అవసరమైన చోట కనీసం మరో 10 మందిని అదనంగా నియమించుకుంటారు. సంస్థ నిర్వహణలో ఆటంకాలు లేకుండా ఉండాలంటే అదనపు సిబ్బంది అవసరం. కానీ దక్షిణమధ్య రైల్వేలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రైళ్లు నడిపేందుకు డ్రైవర్‌లు కరువవుతున్నారు. వాస్తవానికి రైళ్ల నిర్వహణకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్లు తదితర సిబ్బంది కనీసం 30 శాతం అదనంగా ఉండాలి. అదనపు సిబ్బంది సంగతి పక్కనపెడితే.. ఉండాల్సిన వారిలోనే 30 శాతం సిబ్బంది కొరత ఉంది. దీంతో పనిభారంతో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. చివరకు అనారోగ్యం ఉన్నా సెలవులు లభించడం లేదంటూ లోకోపైలెట్లు వాపోతున్నారు. –సాక్షి, హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వేలో అరకొరగా లోకో పైలెట్‌లు

- 1416 పోస్టులు ఖాళీ.. 30% సిబ్బంది కొరత
- ఉద్యోగులకు సెలవుల్లేక విలవిల.. ఏటేటా పెరుగుతున్న పనిభారం



విరామమెరుగని విధులు.. దక్షిణమధ్య రైల్వేలో రోజూ సుమారు 600 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. 10 లక్షల మందికిపైగా ప్రయాణం సాగిస్తుంటారు. అన్ని డివిజన్ల పరిధిలో 3,800 వరకు లోకో పైలెట్‌లు, సహాయ లోకోపైలెట్‌లు, షంటర్‌లు పని చేయవలసి ఉండగా ప్రస్తుతం 2384 మంది మాత్రమే ఉన్నారు.1,416 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే కనీసం వెయ్యి మంది అదనంగా ఉండాల్సిన చోట వెయ్యి మందికిపైగా కొరత ఉండడం గమనార్హం. కొంతకాలంగా లోకోపైలెట్‌ల భర్తీ ప్రక్రియ నిలిచిపోవడంతో ఉన్న వాళ్లపైనే పనిభారం అధికమవుతోంది.

'లింక్' లేని డ్యూటీలు

సాధారణంగా ఒక లోకోపైలెట్ తన విధి నిర్వహణలో 8 గంటలు పనిచేసి 6 గంటల విశ్రాంతి తీసుకోవాలి. తరువాత మరో 8 గంటలు పని ఉంటుంది. తిరిగి 6 గంటలు విశ్రాంతి తీసుకోవాలి. డ్యూటీ ముగిసిన తరువాత 16 గంటల పాటు విశ్రాంతి ఉండాలి. ప్రతి 72 గంటలకు ఒక రోజు సెలవు చొప్పున, ప్రతి 14 రోజులకు ఒక 24 గంటల పూర్తి విశ్రాంతి చొప్పున లోకోపైలెట్ లింక్ (విధి నిర్వహణ) ఉండాలి.

- కానీ ఈ లింక్‌కు పూర్తి విరుద్ధంగా 6 గంటలకు బదులు 4 గంటల విశ్రాంతే లభిస్తోందని లోకోపైలెట్‌లు అంటున్నారు. వరుసగా రాత్రిళ్లు పని చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటోంది. దాన్ని దృష్టిలో ఉంచుకొని వారానికి ఒకరోజు రాత్రి పూర్తిగా విశ్రాంతి ఉండాలి. కానీ ప్రస్తుతం రాత్రి పూట నిద్రకు నోచని ఎంతోమంది తీవ్ర ఒత్తిళ్ల నడుమ పనిచేస్తున్నారు.
- 'అనారోగ్యం కారణంగా కూడా సెలవులు లభించడం లేదు. లాలాగూడ రైల్వే ఆసుపత్రి డాక్టర్‌లు ఫోన్‌లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారు. బాగానే ఉన్నావు డ్యూటీకి వెళ్లొచ్చని చెబుతున్నారు.'.. అని సికింద్రాబాద్ డిపోకు చెందిన అసిస్టెంట్ లోకోపైలెట్ ఒకరు చెప్పారు.

'సేఫ్టీ' ఎలా..

- సిగ్నల్స్ కనిపెట్టడం, కాషన్ ఆర్డర్స్‌ను అనుసరించడం, ట్రాక్‌లు మార్చడం, వేగాన్ని అదుపు చేయడం.. ఇలా ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. ఇందుకు లోకోపైలెట్లకు ఏకాగ్రత, ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం ఉండాలి.
- కానీ ప్రతి క్షణం వెంటాడే ఒత్తిడి, నిద్ర లేమి వల్ల రైల్వే మాన్యువల్‌కు విరుద్ధమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నామని రైఅంటున్నారు.

ఒత్తిడే ప్రమాదాలకు కారణం?

- తరచూ హెచ్చరిక సిగ్నళ్లను (సిగ్నల్ పాసింగ్ ఎట్ డేంజర్) సైతం ఉల్లంఘిస్తూ రైలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. రైళ్లు పట్టాలు తప్పే సందర్భాల్లో ఇలాంటి ఒత్తిడే ప్రధాన కారణమవుతున్నట్లు రైల్వే ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

సికింద్రాబాద్ డిపోలోనూ కొరత

దక్షిణమధ్య రైల్వేలోనే కీలకమైన సికింద్రాబాద్ డిపోలో 578 మంది లోకోపైలెట్‌లు పని చేయవలసి ఉండగా 343 మంది మాత్రమే ఉన్నారు. 235 ఖాళీలు ఉన్నాయి. సిబ్బంది కొరతతో గూడ్స్ రైళ్లు నడపాల్సిన వాళ్లు ఎక్స్‌ప్రెస్‌లు, మెయిల్ సర్వీసులు నడుపుతున్నారు. షంటర్‌లు ఎంఎంటీఎస్‌లు, ప్యాసింజర్ రైళ్లు నడుపుతున్నారు.

పాఠశాల కమిటీల పొడిగింపుతో పరేషాన్

2019లో నియమించిన కమిటీలే ఇంకానా?

- సొంత పిల్లలే స్కూళ్లలో లేనప్పుడు చైర్మన్లుగా వాళ్లెలా ఉంటారు?
- ఉపాధ్యాయ సంఘాల తీవ్ర అభ్యంతరం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాల విద్యలో కీలక పాత్ర పోషించే పాఠశాల యాజమాన్య కమిటీల విషయంలో విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్న విమర్శలొస్తున్నాయి. 2019లో ఏర్పాటు చేసిన కమిటీలనే ఇప్పటికీ కొనసాగించడం తీవ్ర నిరసనకు దారితీస్తోంది. బడిబాట, ఇంగ్లీష్ మీడియం అమలు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నా, వాటిని ముందుకు తీసుకెళ్ళే యాజమాన్య కమిటీలకు జీవం పోయడం లేదు.

పొడిగింపు ఎందుకు?

నిబంధనల ప్రకారం స్కూల్లో ఉన్న పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరిని వైస్ చైర్మన్, చైర్మన్‌గా ఎన్నుకోవాలి. పాఠశాల యాజమాన్య కమిటీలు కేవలం రెండేళ్ళు మాత్రమే పనిచేస్తాయి. ఆ తర్వాత కొత్త కమిటీలను నియమించాలి. 2019లో నియమించిన కమిటీలకు 2021తో పదవీ కాలం ముగిసినా, ప్రతి ఆరు నెలలకూ పొడిగిస్తూ వస్తున్నారు. తాజాగా విద్యాశాఖ మరో ఆరు నెలలు పొడిగింపు ఉత్తర్వులను ఇచ్చింది. 2019లో ప్రాథమిక స్కూల్లో చేరిన విద్యార్థి 2023 నాటికి ఆ స్కూల్ విద్య ముగించేసి ఉంటాడు. ఉన్నత పాఠశాలల్లో 2019లో చేరిన విద్యార్థి కూడా ఇంతే. స్కూల్లో పిల్లలు లేకుండానే, వారి తల్లిదండ్రులున్న యాజమాన్య కమిటీలను పొడిగించడం ఏమిటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

తక్షణమే స్పందించాలని ప్రభుత్వానికి లేఖ

పాఠశాలకు సంబంధించిన అనేక బిల్లుల విషయంలో కమిటీలతో కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. పాఠశాల అభివృద్ధిపైనా చర్చించాల్సి ఉంటుంది. అసలు అందుబాటులో లేని నేతలున్న కమిటీలతో ఎలా పనిచేస్తామని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని స్కూళ్ళ కమిటీ సభ్యులు, చైర్మన్లుగా ఉన్న వ్యక్తులు విదేశాల్లో ఉన్నారని, కొందరైతే ఇతర రాష్ట్రాలకు వెళ్ళారని కూడా చెబుతున్నారు. ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించాలని రాష్ట్ర హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు రాజా భాను చంద్రప్రకాశ్ ప్రభుత్వానికి ఓ లేఖ రాశారు.

'గ్రూప్-1'లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

జూన్ 11న యథావిధిగా పరీక్ష



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వచ్చే ఆదివారం(11న) నిర్వహిస్తున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. అయితే సీబీఐ విచారణ విషయంలో మాత్రం ఇప్పటికే పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటితో పాటు ఈ పిటిషన్‌పైనా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ పిటిషన్లలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. టీఎస్‌పీఎస్సీలో పలు ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటి విచారణ పూర్తయ్యే వరకు పరీక్షలు నిర్వహణ ఆపాలని, దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లాకు చెందిన మురళీధర్‌రెడ్డి హైకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీ దేవి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. దర్యాప్తు పూర్తికాకుండానే టీఎస్‌పీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తుండటం అనుమానాలకు తావిస్తోందని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ప్రిలిమ్స్‌కు గైర్హాజరైనవారిని జూన్ 11న నిర్వహించే పరీక్షకు అనుమతించకుండా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సీబీఐ దర్యాప్తును కోరుతూ ఇప్పటికే పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని టీఎస్‌పీఎస్సీ తరపు న్యాయవాది ఎం.రాంగోపాల్‌రావు వాదించారు. వాదనలను విన్న ధర్మాసనం.. గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించింది. పెండింగ్‌లో ఉన్నవాటితో ఈ పిటిషన్‌ను జత చేయాలని ఆదేశించింది.

'ఏఈఈ' కాపీయింగ్ కేసులో ఏడుగురి గుర్తింపు

- కీలక సూత్రధారి మాజీ ఏఈ రమేష్
- వీరిలో ఇద్దరు మహిళలున్నట్లు నిర్ధారణ
- నిందితుల కోసం గాలిస్తున్న సిట్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పరీక్షల్లో హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఏడుగురు అభ్యర్థులను సిట్ అధికారులు గుర్తించారు. నీటిపారుదల శాఖ మాజీ ఏఈ పూల రమేష్ ద్వారా వీరంతా ఈ పరీక్షలు రాయడం తెలిసిందే. ఈ ఏడుగురిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారని తేలింది. ఇద్దరు రాజకీయ నాయకుల సంతానం కూడా ఉన్న ఈ ఏడుగురు అభ్యర్థులతో పాటు సహకరించిన వారి తల్లిదండ్రులను కూడా సిట్ అధికారులు నిందితులుగానే పరిగణిస్తూ గాలిస్తున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన పూల రమేష్ 2011లో నీటిపారుదల శాఖలో ఏఈగా చేరాడు. అతని భార్య కూడా వరంగల్‌లో వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బి.కొత్తకోట పోలీసుస్టేషన్‌లో 2015లో నమోదైన మహిళ హత్య కేసులో రమేష్ అరెస్టు అయ్యాడు. దాదాపు 45 రోజులు జైల్లో ఉండటంతో ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేశారు. 2017లో తిరిగి ఉద్యోగంలో చేరిన రమేష్ ఎనిమిది నెలల పాటే విధులు నిర్వర్తించాడు. తొలుత సెలవులో ఉండి, ఆపై ఉద్యోగం మానేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం మొదలెట్టాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం హైటెక్ మాస్ కాపీయింగ్‌కు శ్రీకారం చుట్టాడు. జనవరిలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్షల్లోనూ రమేష్ కాపీయింగ్ చేయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత జరిగిన ఏఈఈ పరీక్ష సందర్భంలో టోలిచౌక్‌లోని ఓ కళాశాలలో ఏర్పాటైన పరీక్ష కేంద్రం ప్రిన్సిపల్ పాషాతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆయన ద్వారా బయటకు వచ్చిన పేపర్ సాయంతోనే ఈ ఏడుగురితోనూ పరీక్ష రాయించాడు. రమేష్ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు తేల్చిన సిట్ వారి కోసం గాలిస్తోంది. మూడోరోజు కస్టడీ సందర్భంగా మంగళవారం రమేష్‌ను విచారించిన సిట్.. మాస్ కాపీయింగ్‌లో అతనికి సహకరించిన మరికొందరి వివరాలు సేకరించింది.

రాయితీ విద్యుత్‌తో 72,41,014 మందికి లబ్ధి

ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కంల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యుత్ రాయితీ పథకాల కింద మొత్తం 72,41,014 మంది వినియోగదారులు లబ్ధి పొందారని దక్షిణ,ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్/టీఎస్ఎన్పీడీసీఎల్)లు వెల్లడించాయి. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ మేరకు కరపత్రాలను ముద్రించాయి. 27,48,598 మంది వ్యవసాయ, 0-50 యూనిట్లలో విద్యుత్ వినియోగించే 35,61,809 మంది గృహ, 0-101 యూనిట్లు వినియోగించే 5,25,433 మంది ఎస్సీ/2,85,114 మంది ఎస్టీ వినియోగదారులతో పాటు 5011 పవర్‌లూమ్‌లు, 39 స్పిన్నింగ్ మిల్లులు, 6494 పౌల్ట్రీ ఫాంలు, 32654 హెయిర్ కటింగ్ సెలూన్లు, 65806 లాండ్రీ దుకాణాలు, 56 దోబీఘాట్లకు రాయితీ విద్యుత్ అందజేస్తున్నట్టు తెలిపాయి.

రోజూ స్కూళ్లలో యోగా, ధ్యానం



ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు

- మార్చిలో టెన్త్ పరీక్షలు
- వార్షిక క్యాలెండర్ విడుదల చేసిన విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: ఈ విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలలోనూ రోజూ 5 నిమిషాల పాటు యోగా, మెడిటేషన్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో స్కూళ్లకు సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. 12న ప్రారంభమయ్యే స్కూళ్లు 229 రోజుల పాటు నడుస్తాయని, 2024 ఏప్రిల్ 24న చివరి పనిదినం ఉంటుందని క్యాలెండర్‌లో పేర్కొంది. పదో తరగతి వార్షిక పరీక్షలను మార్చి 24లో చేపట్టాలని నిర్ణయించింది. టెన్త్ సిలబస్‌ను 2024 జనవరి 10 నాటికి పూర్తి చేయాలని సూచించింది.

ఇదీ క్యాలెండర్..

ముఖ్యమైన విషయాలు	తేదీ
పాఠశాల రీ ఓపెనింగ్	12.6.23
చివరి పని దినం	24.4.24
ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1	31.7.23
ఫార్మేటివ్ అసెస్‌మెంట్-2	30.9.23
సమ్మేటేటివ్ అసెస్‌మెంట్-1	5.10.23 -11.10.23
ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3	14.12.23
ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4	29.1.24 (టెన్త్‌కు), 29.2.24 (1-9 క్లాస్‌కు)
సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 (క్లాస్ 1-9 వరకు)	8.4.24 - 18.4.24
టెన్త్ ప్రీ ఫైనల్స్	29.2.24
టెన్త్ బోర్డ్ పరీక్షలు	మార్చి, 2024
దసరా సెలవులు	13.10.23 - 25.10.23
క్రిస్మస్ సెలవులు	22.12.23-26.12.23
సంక్రాంతి సెలవులు	12.1.24 - 17.1.24

సింగరేణి @ 4000 మెగావాట్లు!

థర్మల్ విద్యుత్ సామర్థ్యం పెంచుకోవాలని సంస్థ నిర్ణయం

- ఇప్పటికే 1200 మెగావాట్ల ప్లాంట్ల నిర్వహణ
- మరో 800 మెగావాట్ల యూనిట్ పనులు ఇటీవలే ప్రారంభం
- ఇంకో 2000 మెగావాట్లు, ఆపై సామర్థ్యంతో కొత్త ప్లాంట్ల నిర్మాణం



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ విద్యుదుత్పత్తి రంగంలో తెలంగాణ జెన్‌కో, ఎన్టీపీసీలకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ప్రధానంగా కొత్త విద్యుత్ కేంద్రాల స్థాపన ద్వారా తమ థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 4000 మెగావాట్లకు పెంచుకోవాలని కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిపిన సింగరేణి సంబురాల్లో సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఈ విషయాన్ని ప్రకటించారు. సింగరేణి సంస్థ ఇప్పటికే మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 2 వేల ఎకరాల్లో 1,200(2X600) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్వహిస్తూ, ఏటా రూ.500 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. అదే ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల కొత్త సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను ఇటీవలే ప్రారంభించింది. 800 మెగావాట్ల మరో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 2800 మెగావాట్లకు పెంచుకోలని ఈ ఏడాది ప్రారంభంలోనే సంస్థ నిర్ణయం తీసుకుంది. తాజాగా 4000 మెగావాట్లకు థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించడంతో, మరో 1200(2X600) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలను సంస్థ ఏర్పాటు చేయాల్సి ఉండనుంది.

4400 మెగావాట్లకూ పెరిగే అవకాశం..

కొన్నేళ్ల నుంచి సబ్ క్రిటికల్ టెక్నాలజీతో 600 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించడం లేదు. దాంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో 1600(2X800) మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్లను సింగరేణి నిర్మించాల్సి ఉంటుంది. ఈ లెక్కన చూస్తే సింగరేణి థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యం 4400 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉంది.

జెన్‌కో, ఎన్టీపీసీలకు గట్టి పోటీ..

తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) రాష్ట్రంలో మొత్తం 4042.5 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తుండగా, చివరి దశలో ఉన్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తయితే సంస్థ పూర్తి సామర్థ్యం 8042.5 మెగావాట్లకు పెరగనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'ఎన్టీపీసీ' రామగుండంలో 2600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తుండగా, చివరి దశలోని 1600(2X800) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తయితే సంస్థ సామర్థ్యం 4200 మెగావాట్లకు పెరగనుంది. అదే సమయంలో 4400 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యంతో సింగరేణి ఎన్టీపీసీని వెనక్కి నెట్టి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో ఉండే అవకాశం ఉంది.

సౌర విద్యుత్ రంగంలో సైతం..

సింగరేణి సంస్థ భారీగా సౌర విద్యుదుత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 300 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టి, 224 మెగావాట్ల ప్లాంట్ల పనులు పూర్తయి విద్యుదుత్పత్తి జరుగుతోంది. మిగిలిన 76 మెగావాట్ల ప్లాంట్ల పనులు చివరి దశలో ఉన్నాయి. భూపాలపల్లి, మందమర్రి, మణుగూరులో మరో 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి సంస్థ సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం 550 మెగావాట్లకు పెంచుకోవాలని నిర్ణయించింది.

ఐదున్నరేళ్లు... 11 భాషలు

- హైదరాబాద్ బుడతడికి వరల్డ్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డ్
- 11 అంతర్జాతీయ భాషల్లో వర్ణమాల ఉచ్చారణ..



సాక్షి, హైదరాబాద్: ఏ ఫర్ యాపిల్, బీ ఫర్ బాల్ అని చదువుకునే వయసులో ఏకంగా 11 ప్రపంచ భాషల్లో వర్ణమాల అక్షర క్రమాన్ని స్పష్టంగా చెబుతూ అబ్బురపరుస్తున్నాడు నగరానికి చెందిన ఐదున్నరేళ్ల బాలుడు ఉజ్జిల్ విక్టర్. ఆంగ్లం, రష్యన్, స్పానిష్, గ్రీక్, టర్కిష్, కాప్టిక్, హిబ్రూ, అరబిక్, జపనీస్ వంటి 11 అంతర్జాతీయ భాషల్లో వర్ణమాల అక్షర క్రమాన్ని వివరంగా చెప్పగలడు ఉజ్జిల్. తన అసాధారణ ప్రతిభతో 'ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకున్నాడు.నగరంలోని టోలీచౌకికి చెందిన విక్టర్, రీనా దంపతుల సంతానం ఉజ్జిల్. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయ కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తల్లి రీనా మాట్లాడుతూ.. తమ కుమారుడు నాలుగున్నరేళ్ల వయసులోనే 50 కూడికలను 5 నిమిషాల్లో పూర్తి చేసి మొదటి వరల్డ్ రికార్డును సాధించాడని పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.